


# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 143 మంగళవారం 13 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 25 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

# జెన్-జెడ్‌లో ఎంతో సృజనాత్మకత

'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తితో ఈ వేదికను ప్రారంభించినట్లు వెల్లడి

యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వెల్లడి

నేను ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానమంత్రిగా ఉన్నా దేశ యువతపై తనకు ఎప్పుడూ మంచి విశ్వాసం ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన జెన్-జెడ్ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ఆయన ప్రశంసించారు.



## అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

పతంగులు ఎగురవేసిన ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్సలర్




# అద్భుత రాజధాని నిర్మించి చూపుతాం

## అమరావతిని శ్మశానం.. ఎడారి అని అన్నారు

వృధా జలాలలు వాడుకుంటే తప్పేంటి

నేను ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోలేదు

పోలవరం పూర్తయితే అభివృద్ధి పరుగులే

2026లో ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక

పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ఏపీ


ఈ ఏడాదిలో ల్యాండ్ రికార్డుల పూర్తి ప్రక్షాళన

మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు స్పీడు పెంచాలి

ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి :** రాజధాని అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని సిఎం చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. అధికారులతో సమీక్షలో సిఎం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు

మిగతా 2 లో



## ప్రాయోజిత పథకాల నిధుల ఖర్చులో నిర్లక్ష్యం

ప్రజల సొమ్ము మురిగిపోతే బాధ్యులెవరని ప్రశ్న

నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ఆదేశం

అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు

## నారావారిపల్లెలోనే సంక్రాంతి సంబరాలు

సొంతూరుకు చేరుకున్న చంద్రబాబు

పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున ఘనస్వాగతం

నందమూరి కుటుంబ సభ్యులు కూడా రాక

# పీఎస్ఎల్వీ-సి62 ప్రయోగం విఫలం

## సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

**శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సోమవారం షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సి62 రాకెట్ ప్రయోగం అనుకోని సాంకేతిక లోపంతో విఫలమైంది. ప్రయోగం ప్రారంభమైన 8 నిమిషాల 42 సెకన్ల అనంతరం రాకెట్ తొలి మూడు దశలను విజయవంతంగా పూర్తి చేసుకుని నాలుగో దశలోకి ప్రవేశించిన సమయంలో సమస్య తలెత్తినట్లు ఇస్రో వెల్లడించింది. నాలుగో దశలో ప్రయాణిస్తున్న

మిగతా 3 లో



## సంక్రాంతి వేళ మందుబాబులకు షాక్


అనూహ్యంగా మద్యం ధరలు పెంపు



.. వివరాలు 2లో

## పులువురు ఐఎఎస్‌ల బదిలీలు

14మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు




.. వివరాలు 2లో

# యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

ఈ ప్రభుత్వంలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది

కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జగన్

**అమరావతి :** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ... యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో యువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి

మిగతా 2 లో



# మా ఐదేళ్ల అప్పులు... మీరు 18 నెలల్లో చేశారు



మావి ఐదేళ్లలో రూ.3.32 లక్షల కోట్ల అప్పులు

బాబు చేసినవి రూ.3.02 లక్షల కోట్ల అప్పులు

మాజీమంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు విమర్శలు

**అమరావతి :** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఐదేళ్లలో చేసిన అప్పులతో పోలిస్తే, కూటమి ప్రభుత్వం కేవలం 18 నెలల్లోనే దాదాపు అదే స్థాయి అప్పులు చేసిందని మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంబటి రాంబాబు ఆరోపించారు. జగన్ హయాంలో మొత్తం ఐదేళ్లలో రూ.3.32 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో 18 నెలల్లోనే రూ.3.02 లక్షల కోట్ల అప్పులు

మిగతా 2 లో

# అపారమైన పశుసంపదకు రాష్ట్రం నిలయం

19 నుంచి 31 వరకూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి అచ్చన్నాయుడు




**అమరావతి :** అపారమైన పశుసంపదకు రాష్ట్రం నిలయమని పశుసంవర్ధకశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టరు, కరపత్రాలను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి

మిగతా 2 లో

# సంక్రాంతిపై వివాదం

సంక్రమణం 14నే అంటున్న కొందరు



# అద్భుత రాజధాని నిర్మించి చూపుతాం

మొదటి పేజీ తరువాయి

అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ఎ÷-లాంట్‌ను



నిలబెట్టి తీరుతామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్‌గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.

## నారావారిపల్లెలోనే సంక్రాతి సంబరాలు

**కుప్పం :** సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఆయన స్వగ్రామం నారావారిపల్లికి చేరుకున్నారు. రాజధాని అమరావతి నుంచి హెలికాప్టర్‌లో ఆయన స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు జిల్లా ఉన్నతాధికారులతోపాటు స్థానిక నేతలు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఇక ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ రోజు ఉదయమే సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి ఈ గ్రామానికి చేరుకున్నారు. అలాగే నందమూరి బాలకృష్ణ ఫ్యామిలీ సైతం ఇప్పటికే నారావారిపల్లికి విచ్చేసింది. నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ చిన్న అల్లుడు, విశాఖ ఎంపీ ఎం.భరత్ సైతం నారావారిపల్లికు చేరుకున్నారు. నారా, నందమూరి ఫ్యామిలీలు చేరుకోవడంతో.. సీఎం స్వగ్రామానికి కొత్త శోభ వచ్చింది. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆయన స్వగ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి పండగను నారా, నందమూరి ఫ్యామిలీలు ఈ నారావారిపల్లిలో జరుపుకోవడం అనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. తల్లిదండ్రుల సమాధులను సైతం చంద్రబాబు సందర్శించుకొని వారికి ఘన నివాళులు అర్పిస్తుంటారు.

## ప్రాయోజిత పథకాల నిధుల ఖర్చులో నిర్లక్ష్యం

**ప్రజల సొమ్ము మురిగిపోతే బాధ్యులెవరని ప్రశ్న**

**నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని ఆదేశం**

**అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు**

**అమరావతి :** కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సరిగా ఖర్చు చేయకపోవడంపై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు , విభాగాధిపతులతో జరిగిన కీలక సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ప్రజల సొమ్ము మురిగిపోయేలా చేసే హక్కు ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. ఈనెల 15వ తేదీ డెడ్‌లైన్‌గా ఇచ్చినా ఎందుకు ఖర్చు చేయడం లేదని సీఎం నిలదీశారు. సామాజిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల్లో నిధులు ఎక్కువగా మిగిలి పోయాయని ముఖ్యమంత్రి ఆగ్రహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో సుమారు రూ.320 కోట్లు ఉంటే కేవలం రూ.120 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఈ నెలాఖరు లోగా అన్ని నిధులు పూర్తిగా ఖర్చు చేయాలని, లేకపోతే వెంటపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి మొదటి, రెండో వారాల్లో పెట్టి, మార్చి 15 నాటికి అంతా ముగించాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మార్చి 15 నుంచి సెక్రటరీలు ఢిల్లీ వెళ్లి డబ్బులు తెస్తారని చూస్తుంటే ఇలా చేస్తారా అని నిలదీశారు. ఇలా అయితే వారానికి ఒకసారి మీటింగ్ పెట్టాలా? అని ప్రశ్నించారు. అన్ని శాఖలతో పోల్చితే ÷నాన్స్ శాఖ మాత్రం బాగా పనిచేస్తోందని ప్రశంసించిన సీఎం... వారే ఇతర శాఖల వెంటపడుతున్నారని తెలిపారు. ఈనెలాఖరులోగా కేంద్ర పథకాల డబ్బులు ఖర్చు చేసి, మార్చి నాటికి అందరూ ఢిల్లీ వెళ్లి డబ్బులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టామని.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని.. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామన్నారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామని సీఎం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 3.5కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారని.. దీనికోసం ఇప్పటి వరకు రూ.1,114 కోట్ల వ్యయం చేశామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు ఖాతాల్లో వేశామని వివరించారు. ఏడాదిన్నరలో 50వేల కోట్ల మేర పింఛన్లు అందించడంతో సంక్షేమంలో కొత్త మైలురాయిని సాధించామని సీఎం పేర్కొన్నారు.

## యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

మొదటి పేజీ తరువాయి



దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన... నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిలిపివేయడం వల్ల యువత నైపుణ్యాలు పెంచుకునే అవకాశాలు కూడా దూరమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

## మా ఐదేళ్ల అప్పులు... మీరు 18 నెలల్లో చేశారు

మొదటి పేజీ తరువాయి



చేశారని అంబటి రాంబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు అంటే జగన్ హయాంలో చేసిన అప్పుల్లో దాదాపు 90 శాతం అప్పులను కేవలం ఏడాదిన్నరలోనే చేశారని అన్నారు. జగన్ అప్పులు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని చెప్పిన వారు, చంద్రబాబు అప్పులు చేస్తే రాష్ట్రం సింగపూర్ అవుతుందా అంటూ ప్రశ్నించారు. కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.69 వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చిందని, 90 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించగలిగామని అంబటి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చినా, కూటమి ప్రభుత్వ హయాంలోనే దాదాపు రూ.20 వేల కోట్ల విద్యుత్ భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. అలాగే ఎన్నికల హామీలను ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇక, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్' అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అంబటి, ఆయనకు అనేక సామర్థ్యాలు, కళలు ఉన్నాయని ప్రశంసించారు. అయితే పవన్‌ను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జనసేన నేతల నెత్తిన ఎక్కి టీడీపీ నేతలు ఆడుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగుళూరులో ఉంటూ వైఎస్ జగన్.. కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలపై స్పందించిన అంబటి, జగన్‌కు ఇక్కడే శాశ్వత నివాసం ఉందని తెలిపారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ల శాశ్వత నివాసాలు ఎక్కడున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. మీరు నదీ గర్భంలో ఉన్న ఇంట్లో ఉంటున్నారు అంటూ విమర్శలు చేశారు. జగన్ ప్రతీ వారం రాష్ట్రానికి వచ్చి ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. టీడీపీ నేతలు కడుపు మంటతో మాట్లాడుతున్నారని, జగన్ మాత్రం స్ట్రెయిట్ పాలిటిక్స్ చేస్తారని అన్నారు. డొంక తిరుగుడు రాజకీయాలు జగన్ చేయరని స్పష్టం చేశారు. సత్తెనపల్లిలో ఆరేళ్ల పాటు ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించామని, గత ఏడాది కొన్ని పరిస్థితుల వల్ల చేయలేకపోయామని తెలిపారు. ఈ ఏడాది ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని, తమ సంక్రాంతి వేడుకలకు పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మరోవైపు.. దైవాన్ని అడ్డం పెట్టుకుని తుచ్ఛమైన రాజకీయాలు చేస్తున్నారని చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. జగన్‌ను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మీ కుట్రలను వెంకటేశ్వర స్వామి కూడా క్షమించడు అంటూ అంబటి రాంబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## సంక్రాంతి వేళ మందుబాబులకు షాక్



**అమరావతి :** కొత్త ఏడాది ప్రారంభమైన కొన్ని రోజులకే.. అది కూడా సంక్రాంతి పండగకు కొన్ని గంటల ముందు మందుబాబులకు ఏపీ ఎక్సైజ్ శాఖ గట్టి షాక్ ఇచ్చింది. కొన్ని రకాల మద్యం బాటిల్స్‌పై రూ.10ల ధర పెంచింది. అన్ని సైజుల బాటిళ్లపై రూ.10 పెంచింది. అయితే కొన్ని బాటిళ్లను మాత్రం అందులో నుంచి మినహాయించింది. ఈ మేరకు ఏపీ ఎక్సైజ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.99 ఇండియన్ మేడ్ ఫారన్ లిక్కర్, బీర్, వైన్, ఆర్‌టీడీలకు ఈ పెంపు వర్తించదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అలాగే బార్లపై విధిస్తున్న అదనపు ఏఆర్ఈటీ తొలగింపును అంగీకరిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. బార్లు- షాపుల మధ్య ధరల సమానత్వమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రిటైలర్ మార్జిన్ సుమారు 1శాతం పెంచుతున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో వివరించింది. ఇక ఐఎంఎఫ్ఎల్, ఎఫ్ఎల్, బీర్, వైన్ షాప్‌లకు మార్జిన్‌ను పెంచింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

## మిగులు జలాలు వాడుకుంటే తెలంగాణకు నష్టం లేదు

**ఇరు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే చంద్రబాబు లక్ష్యం**

**మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి :** తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో అభివృద్ధి చెందాలన్నది ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం - నల్లమల సాగర్‌కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పొద్దని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కూడా 4,600 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని గుర్తు చేశారు. పోలవరం దగ్గర వరదనీరు వాడుకోకుంటే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయని అన్నారు. గోదావరిలో పుష్కలంగా నీరుందనే కాళేశ్వరానికి మేం అభ్యంతరం చెప్పలేదు. పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకు కూడా ఉపయోగం ఉంది. ఏపీకి సరిపోగా నీరు మిగిలితే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. అందుకే, పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణకూ నష్టం లేదని చెబుతూనే ఉన్నాం. సముద్రంలో కలిసే 3 వేల టీఎంసీల్లో 200 టీఎంసీలు వాడుకుంటామన్నాం. గత 50 ఏళ్లలో గోదావరి నుంచి 1.53 లక్షల టీఎంసీలు సముద్రంలో కలిశాయని నిమ్మల వెల్లడించారు. పోలవరం ? నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఓ ట్విస్ట్ వచ్చి చేరింది.. సాంకేతిక కారణాల దృష్ట్యా తన పిటిషన్‌ను ఉపసంహరించు కున్నట్టు పేర్కొంది తెలంగాణ ప్రభుత్వం.. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు.. అయితే, పోలవరం- నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై తెలంగాణ అభ్యంతరాలను సుప్రీంకోర్టు డిస్పోజ్ చేయడంపై స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు.. కీలక వ్యాఖ్యలు చేశారు.. వృధాగా సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీల నీటిలో 200 టీఎంసీలు మాత్రమే వాడుకుంటామని స్పష్టంగా చెబుతున్నాం.. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎటువంటి నష్టం లేదని ముందు నుండి మేం చెబుతూనే ఉన్నాం అన్నారు..గత ఐదేళ్లలో గోదావరి వరద నీరు 1,53,000 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసింది.. ఈ సంవత్సరం కూడా 4600 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలోకి పోయింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత గోదావరి ఎగువన కాళేశ్వరం కు ఏ మాదిరిగా అనుమతి ఇచ్చారో.. ఆ విధంగా దిగువన పోలవరం ? నల్లమల సాగర్ కు అనుమతి ఇవ్వమంటున్నాం. పోలవరం దగ్గర వరద నీరును ఉపయోగించుకుంటే, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకోవాలి, లేదంటే సముద్రంలో ఉప్పునీటిలో కలిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. గోదావరిలో పుష్కలంగా నీరు ఉందనే ఆనాడు రాష్ట్ర విభజన తర్వాత కాళేశ్వరాన్ని తెలంగాణ నిర్మాణం చేస్తున్నా, మేం అడ్డుకోలేదు అన్నారు.. పోలవరం ? నల్లమల సాగర్ పూర్తైతే మన రాష్ట్ర ప్రయోజనాలు తీరిన తరువాత నీరు మిగిలితే తెలంగాణకు సైతం ఉపయోగం ఉంటుందని వ్యాఖ్యానించారు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు..

## అపారమైన పశుసంపదకు రాష్ట్రం నిలయం

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఒంగోలు, పుంగనూరు, గో జాతులు, శ్రేష్టమైన నెల్లూరు, మాచెర్ల గొర్రెల జాతులు, ఆశిల్ జాతి కోళ్లు మన రాష్ట్రంలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా స్థిరమైన ఆదాయ వనరుగా పశు సంవర్ధక రంగం కొనసాగుతూ, ఈ రంగంపై ఆధారపడిన వారికి ప్రధాన జీవనాధారంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రస్తుతం 1.08 కోట్ల ఆవులు, గేదెలు, 2.31 కోట్ల గొర్రెలు, మేకలు, 10.78 కోట్ల కోళ్లు ఉన్నట్లు తెలిపారు. గతేడాది 13,257 గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశుఆరోగ్య శిబిరాల్లో 10.48 లక్షల పశువులకు వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ టి దామోదరనాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సాయిగోపాల్, అసిస్టెంట్ సర్జన్ మురళీమోహన్ తదితరులు పాల్గన్నారు.

## మాజీమంత్రి అప్పల సూర్యనారాయణ కన్నుమూత

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు**

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ (78) సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా పనిచేశారు. అరసవల్లి లోని తన నివాసంలో బాత్‌రూమ్‌లో కాలు జారి పడిపోవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన్ని హుటాహుటిన శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్సపొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన కుటుంబం శ్రీకాకుళం రాజకీయాల్లో బలమైన పట్టు కలిగి ఉంది. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గుండ అప్పల సూర్యనారాయణ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున విజయం సాధించారు. ఎన్టీఆర్ క్యాబినెట్ లో మంత్రిగా పని చేసిన ఆయన.. టీడీపీతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉన్నారు. ఆయన భార్య గుండ లక్ష్మీదేవి 2014లో శ్రీకాకుళం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదం తర్వాత ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, గాయాల తీవ్రత కారణంగా చికిత్స ఫలించలేదు. 'మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మృతి నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన వరుసగా నాలుగు సార్లు శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు రెండుసార్లు మంత్రిగా పని చేశారు. క్రమశిక్షణతో పార్టీ పట్ల అంకిత భావంతో ఆయన చేసిన సేవలు మరువలేనివి. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నాను.' అని సీఎం చంద్రబాబు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతా ద్వారా తన సంతాపాన్ని తెలియజేశారు.

## పులువురు ఐఏఎస్‌ల బదిలీలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా, సమతుల్యంగా నడిపించేందుకు 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి .విజయానంద్ జారీ చేశారు. ఈ మార్పులు జిల్లాస్థాయి పరిపాలనా శాఖల్లో కీలక బాధ్యతలను పునర్విభజన చేసేలా ఉన్నాయి. ఈ బదిలీల్లో పలు ముఖ్యమైన మార్పులు ఉన్నాయి. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్ నియమితులయ్యారు. గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీ కల్పన కుమారి బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కల్పన కుమారి,విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కతవాటె మయూర్ అశోక్, గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా కతవాటె మయూర్ అశోక్, తిరుపతి జేసీ, తుడా వైఎస్ ఛైర్మన్‌గా ఆర్.గోవిందరావు, వైఎస్ఆర్ కడప జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్, వైఎస్ఆర్ కడప జాయింట్ కలెక్టర్‌గా నిధి మీనా నియామకం అయ్యారు. ప్రస్తుతం అనంతపురం జేసీగా ఉన్న శివ్ నారాయణ శర్మ బదిలీ అయ్యారు. అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా సి.విష్ణు చరణ్ నియామకం జరిగింది. ఎపీటీఎస్ ఎండీ మల్లవరపు సూర్యతేజ బదిలీ అయ్యారు. అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా మల్లవరపు సూర్యతేజ, చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ నియమితులయ్యారు. వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ ఎస్ఎస్ శోభిక, గిరిజన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీగానియామకం జరిగింది. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిల్ల విద్యాధరి బదిలీ అయి విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శివ్ నారాయణ్ శర్మ నియామకం జరిగింది. తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ బదిలీ అయి, పల్నాడు జిల్లా జేసీగా వి.సంజనా సింహ నియామకం అయ్యారు.

# జెన్-జెడ్‌లో ఎంతో సృజనాత్మకత


**'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

**వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తితో ఈ వేదికను ప్రారంభించినట్లు వెల్లడి**

**యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వెల్లడి**

న్యూఢిల్లీ: నేను ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానమంత్రిగా ఉన్నా దేశ యువతపై తనకు ఎప్పుడూ మంచి విశ్వాసం ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన జెన్-జెడ్ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ఆయన ప్రశంసించారు. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొంది 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ వేదికను స్థాపించినట్లు తెలిపారు. వినూత్న ఆలోచనలు, లక్ష్యాలు, ఉత్సాహంతో దేశ నిర్మాణంలో జెన్-జెడ్ ముందు వరుసలో ఉందని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో యువత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. ఈ క్రమంలోనే దేశంలో స్టార్టప్ విప్లవం ఊపందుకుందని అన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రారంభించిన సంస్కరణల పరంపర ఇప్పుడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా మారిందని, వీటికి కేంద్ర బిందువు యువతే అని ఆయన స్పష్టం చేశారు. దేశ యువతకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ వేదికను రూపొందించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి పైగా యువత పాల్గొన్నారు.

# పీఎస్ఎల్వీ-సి62 ప్రయోగం విఫలం



మొదటి పేజీ తరువాయి



సమయంలో రాకెట్ గమనం స్పష్టంగా తెలియకపోవడంతో పాటు, శాటిలైట్ కమ్యూనికేషన్ అకస్మాత్తుగా గ్రౌండ్ స్టేషన్లతో కట్ ఆఫ్ అయింది. దీంతో రాకెట్ దిశపై స్పష్టత కోల్పోయిన శాస్త్రవేత్తలు వెంటనే అప్రమత్తమయ్యారు. క్షణాల్లోనే మిషన్ కంట్రోల్‌లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ మాట్లాడుతూ, "రాకెట్ తొలి మూడు దశలు పూర్తయ్యాయి. అయితే నాలుగో దశలో ప్రయాణిస్తున్న సమయంలో గమనం స్పష్టంగా తెలియకపోవడంతో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ అందకపోవడం వల్ల ప్రయోగం విఫలమైంది" అని తెలిపారు. ప్రయోగం విఫలానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు లోతైన పరిశీలన చేపట్టినట్లు చైర్మన్ చెప్పారు. పూర్తి సాంకేతిక వివరాలను విశ్లేషించిన అనంతరం మీడియాకు సమగ్ర సమాచారం అందిస్తామని ఆయన వెల్లడించారు. ఇస్రో చరిత్రలో ఎన్నో విజయవంతమైన ప్రయోగాలు ఉన్నప్పటికీ, ఈసారి ఎదురైన సాంకేతిక సవాల్‌ను కూడా శాస్త్రవేత్తలు సమర్థంగా అధిగమిస్తారనే నమ్మకం వ్యక్తమవుతోంది.

# ఎస్‌బిఐ ఎటిఎం ఛార్జీల పెంపు

**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బిఐ ఇటీవల ఎటిఎం ట్రాన్సాక్షన్ ఛార్జీలను పెంచింది. ఇంటర్‌ఛేంజ్ ఫీజ్ పెరిగిన నేపథ్యంలో ఈ పెంపు అనివార్యమైందని బ్యాంకు ప్రకటించింది. కొత్త ఛార్జీలు డిసెంబర్ 1నుంచి అమలులోకి వచ్చాయి. ఇదే తరహాలో గతేడాది ఫిబ్రవరి తర్వాత కూడా ఛార్జీలు పెంచిన సంగతి తెలిసిందే. సేవింగ్స్ అకౌంట్ హోల్డర్లు: ఇతర బ్యాంకుల ఎటిఎంలలో నెలకు 5 ఫ్రీ ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు. ఫ్రీ లిమిట్ అయిపోయాక.. క్యాష్ విత్‌డ్రాయల్ కు రూ.23 చొప్పున వసూలు చేస్తారు. ఇక, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్-÷నాన్షియల్ లావాదేవీలకు రూ.11 ఛార్జీలుగా వసూలు చేస్తారు. శాలరీ అకౌంట్ హోల్డర్లకు గతంలో అన్‌లిమిటెడ్ ఫ్రీ ట్రాన్సాక్షన్లు ఉండేవి. ఇప్పుడు నెలకు 10 ఫ్రీ ట్రాన్సాక్షన్లు మాత్రమే కల్పించారు. దాని తర్వాత సేవింగ్స్ ఖాతాదార్ల మాదిరే రూ.23 ,ఇంకా రూ. 11 చెల్లించాలి. అయితే, సొంత ఎటిఎంలలో ఛార్జీలు మారలేదు. ఫ్రీ ట్రాన్సాక్షన్లూ పాత పద్ధతిలో అలాగే ఉన్నాయి. సేవింగ్స్ ఇంకా శాలరీ అకౌంట్ హోల్డర్లు ఫ్రీ లిమిట్ దాటినప్పుడు మాత్రమే ఎక్స్‌ట్రా ఛార్జీలు చెల్లించాలి. కరెంట్ అకౌంట్ హోల్డర్లు కూడా ఛార్జీల పెంపునకు ప్రభావితమవుతారు.

## పెండింగ్ బిల్లుల క్లీయరెన్స్‌కు నిధులు విడుదల

**అమరావతి :** ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఏపీ సర్కార్ సంక్రాంతి కానుక ఇచ్చింది. డీఏ, వివిధ రకాల పెండింగ్ బిల్లులను ఆర్థిక శాఖ క్లియర్ చేసింది. డీఏ, డీఆర్ ఎరియర్స్, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు రూ.2,653 కోట్ల నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్ ఎరియర్స్ కోసం రూ.1,100 కోట్లు, పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవులకు రూ.110 కోట్లు, ఈఏపీ, నాబార్డ్, సాస్కీ, సీఆర్ఐఎఫ్ పనులకు రూ.1,243 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొత్తం 5.7 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

# అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

**పతంగులు ఎగురవేసిన ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్సలర్**




**అహ్మదాబాద్, జనవరి 12:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ పతంగుల పండుగను ప్రారంభించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదీ తీరంలో ప్రధాని సోమవారం అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ వేడుకలో ప్రధాని మోదీతో పాటు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ కూడా పాల్గొన్నారు. ఇద్దరూ కలిసి పతంగులను ఎగురవేశారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్‌లో కలియ తిరిగారు. ఈ ఉత్సవంలో 50 దేశాలకు చెందిన ఔత్సాహికులు పాలుపంచుకున్నారు. ఈ వేడుకలో హనుమాన్ పతంగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతేడాది ఈ ఫెస్టివల్‌కు 3.83 లక్షల మంది సందర్శకులు హాజరయ్యారు. ఈ ఏడాది సందర్శకులు సంఖ్య 5 లక్షల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# భారత్ మాకు నిజమైన భాగస్వామి

- నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమే
- అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు





**న్యూఢిల్లీ, జనవరి 12:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహబంధం నిజమైనదని అన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగేందుకే వారు ప్రయత్నిస్తారని వ్యాఖ్యానించారు. 'ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఎవరూ ఎక్కువ కాదు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తాను' అని గోర్ చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. ఈనెల 13న భారత్-అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కావాల్సి ఉందని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌కు అమెరికా రాయబారిగా ఆయన సోమవారంనాడు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద దేశమని, అందువల్ల ఒప్పందంపై ముగింపునకు తీసుకురావడం అంత తేలికైన పనికాదని, అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఒప్పందం కుదిరేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. భద్రత, కౌంటర్ టెర్రరిజం, ఇంధనం, సాంకేతికత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు. సిలికాన్ ఆధారిత సాంకేతికతలను రక్షించడానికి, మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'ప్యాక్స్ సిలికా' కూటమిలోకి పూర్తి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానిస్తున్నామని గోర్ వెల్లడించారు. కూటమిలో అమెరికా, జపాన్, సౌత్ కొరియా, యూకే, ఇజ్రాయెల్ దేశాలు కలిసి పనిచేయనున్నట్టు చెప్పారు.

# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు

**బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం**



**కోల్‌కతా, జనవరి 12:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ పక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు. ఈ పక్రియలోనే లోపం ఉంది. ఎస్ఐఆర్ విచారణ పక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఈసీ తొలగించిన విషయం తెలిసిందే.

# మకర సంక్రాంతిపై వివాదం

**సంక్రమణం 14నే అంటున్న కొందరు**



**తిరుమల, జనవరి 12:** పండగల తేదీలపై ఏటా కొన్ని విభేదాలు వస్తూనే ఉన్నాయి. ఏ రోజు ఏ పండగ అన్నది వివాదాలకు దారితీస్తోంది. తాజాగా సంక్రాంతి పర్వదినంపైనా కొంత చర్చ మొదలయ్యింది. మకర సంక్రాంతి.. ఏడాదిలో వచ్చే తొలి పండగే కాదు. అతి పెద్ద పండగల్లో ఇది కూడా ఒకటి. ఈ ఏడాది ఈ మకర సంక్రాంతి పండగ జనవరి 14 లేదా 15వ తేదీన జరుపుకోవాలా? అనే సందేహం చాలా మందిలో కలుగుతోంది. అదీకాక చాంద్రమానం ప్రకారం ఏడాదిలో దాదాపు అన్ని పండగలు జరుపుకుంటాం. కానీ సౌరమానం ఆధారంగా సంక్రాంతిని జరుపుకుంటాం. ఇంకా చెప్పాలంటే.. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర ఘడియలనే మకర సంక్రాంతిగా అంతా పరిగణిస్తారు. ఈ ఏడాది 14వ తేదీన పవిత్ర స్నానాలు, దానధర్మాలు, సూర్య ఆరాధన చేయాలని పండితులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని సంప్రదాయ పంచాంగాలు సూర్యోదయం ఆధారంగా నియమాలను అనుసరిస్తాయి. సూర్యుడు సాయంత్రం చాలా ఆలస్యంగా లేదా సూర్యాస్తమయం తర్వాత మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. దాంతో పండగ మరుసటి రోజు జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది జనవరి 14వ తేదీ మధ్యాహ్నమే ఈ మార్పు జరుగుతుంది. దాంతో ఈ పండగ బుధవారం అంటే.. జనవరి 14వ తేదీనే జరుపుకోవాలని అంటున్నారు. దీని ప్రకారం మకర సంక్రాంతి వేడుకలకు జనవరి 14వ తేదీగా నిర్ణయించారు. ఆరోజు మధ్యాహ్నం 3.13 గంటలకు సంక్రాంతి ముహూర్తం వస్తుంది. ఈ నేపథ్యంలో ఆ రోజే పండగ జరుపుకోవాలని,. అంటే జనవరి 15వ తేదీ కాదన్నది సుస్పష్టం. అయితే ఇప్పటికే మకరసంక్రాంతి 15గా నిర్ణయించారు. ప్రభుత్వం కూడా అదేరోజు సెలవుగా పరిగణించింది. మకర సంక్రాంతి వేళ.. సూర్యుడు దక్షిణాయణం ముగించుకుని.. ఉత్తరాయణం దిశగా ప్రారంభాన్ని సూచిస్తుంది. సూర్య భగవానుడి ప్రయాణ మార్పు ఆశ, కాంతి, సానుకూల శక్తిని తెస్తుందని అంతా ప్రగాఢంగా విశ్వసిస్తారు. ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు సూర్యుడిని పూజిస్తారు. పేదవారికి వస్త్రాలు దానం చేస్తారు. తమిళనాడులో పొంగల్‌గా ఈ పండగను జరుపుకుంటారు. ఇది అనేక రోజుల పంట పండగా వారు భావిస్తారు. అసోంలో మాఘ్ బిహుగా జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో: పౌష్ పర్బన్ అని ఈ పండగను పిలుస్తారు. అయితే ఈ పండగ పేర్లు, ఆచారాలు భిన్నంగా ఉన్నప్పటికీ అన్ని వేడుకలు పంట శ్రేయస్సుతోపాటు కృతజ్ఞతతో ముడిపడి ఉంటాయి.

# డ్రోన్‌లతో సరిహద్దుల్లో పాక్ కవ్వింపులు

- తిప్పికొట్టిన సైన్యం



**శ్రీనగర్:** భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'తో కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న పాకిస్థాన్ మరోసారి కవ్వింపులకు దిగింది. జమ్మూకశ్మీర్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్వోసీ) వెంబడి రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా ఐదు డ్రోన్లు సంచరిస్తున్నట్టు భారత సైన్యం గుర్తించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు వాటిని తిప్పికొట్టాయి. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తినష్టం కానీ, ప్రాణనష్టం కానీ జరగలేదు. భారత సైనిక వర్గాల సమచారం ప్రకారం, పాకిస్థాన్ ఆర్మీకి చెందిన కొన్ని డ్రోన్లు ముఖ్యంగా నౌషెరా-రాజౌరీ సెక్టార్‌లో సంచరిస్తున్నట్టు గుర్తించారు. దీంతో వెంటనే సైనిక విభాగాలు ఆపరేషన్ ప్రారంభించాయి. మీడియం, లైట్ మిషన్‌గన్‌లతో కాల్పులు జరిపాయి. పాక్ డ్రోన్ కదలికలతో ఎల్ఓసీ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భద్రత, నిఘాను మరింత కట్టుదిట్టం చేశామని, భారత బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని సెక్యూరిటీ అధికారులు చెప్పారు. గత ఏడాది మే 7న పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పలు పాక్ డ్రోన్లను కూల్చేసింది. అప్పటి నుంచి డ్రోన్ల సంచారం తగ్గింది. అయితే తిరిగి డ్రోన్ల కదలికలు కనిపించడంతో ఉగ్రవాద గ్రూపులకు మద్దతుగా మాదక ద్రవ్యాలు, ఆయుధాలు జారవిడిచేందుకు డ్రోన్లను ఉపయోగించినట్టుగా అనుమానిస్తున్నారు. దీంతో భద్రతా బలగాలు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.




సంపాదకీయం

# జల రాజకీయాలను తిప్పికొట్టాలి!

నదీజలాల విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాలు సంయమనంతో ముందుకు సాగాల్సిన తరుణమిది. జల జగడాలు మంచిది కాదు. ఈ రగడతో ప్రజలను సెంటిమెట్‌తో ముంచాలని చూస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎందుకంటే నీళ్ల కోసమే తెలంగాణ పోరాటం సాగింది. ఇందులో అనుమానాలు లేవు. అందువల్ల నీటి కోసం ప్రతిపక్షాలు చేసే విమర్శలకు లోను కావద్దు. వారి రాజకీయాలకు బలి కావద్దు. ఎపిలో జగన్, తెలంగానలో బిఆర్ఎస్ జలజగడాలతో రాజకీయం చేయచూస్తున్నాయి. వీరి మాటలను తిప్పికొట్టాలి. సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూడా జలజగడాలకన్నా పరిష్కారాలే ముఖ్యమని అంటున్నారు. అందువల్ల వాటిని అనుసరించడమే శ్రేయస్కరం. వృధాగా పోతున్న జలాలను పరిరక్షించుకోవడంలో వ్యూభాత్మకంగా అడుగులు వేయాలి. నదీజలాలలను ఎంతగా ఒడిసిపడితే అంత మంచిది. ఎండిన బీళ్లను తడపాలి. నదుల్లో నీరంతరాయంగా నీరు పారేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అయితే తెలుగునాట జల రాజకీయాలు మరింత వికృతంగా మారుతున్నాయి. ఏ స్థాయిలో దుష్ప్రచారం చేయబోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎవరి రాజకీయం వారిది. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగి నప్పుడే రాజకీయ నాయకులు తమ పబ్బం సాధ్యమవు తుంది. తెలంగాణ ప్రజలు నీళ్లతో త్వరగా కనెక్టవుతారు. అందుకే కేసీఆర్ అండ్ కో జల వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. అలాగే జగన్ కూడా తన హయాంలో నిలిచిపోయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ఆపారని ప్రచారం చేస్తున్నారు. ఎప్పుడో నిలిచిపోయిన ఈ పథకం గురించి బిఆరెస్ నేతలు పెడబొబ్బలు పెడుతున్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కెటిఆర్,హరీష్ రావులు విమర్శించడం హాస్యాస్పదం. సమాజంలో విద్వేషాలు రగిలించడానికి పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం లేదు. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం నడుస్తున్న జల వివాదంలో ప్రతిపక్షాలు తమవంతు పాత్రను పోషిస్తున్నాయి.. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై విపక్ష జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు రాజకీయం మొదలు పెట్టారు. ఈ పథకాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆపేశారని జగన్ ఆరోపించారు. జగన్ మీడియాలో ఆంధ్రప్రదేశ్ ద్రోహిగా చంద్రబాబును చిత్రీకరిస్తుండగా, కేసీఆర్ సొంత మీడియాలో చంద్రబాబును నీటి దొంగగా, తెలంగాణ ద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీటిని తరలించుకుపోవడం ద్వారా చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని ప్రచురిస్తున్నారు. ఈ ఇరువురు నాయకుల సొంత మీడియాలో చేస్తున్న ప్రచారంలో నిజానిజాలఅఉ ఎలా ఉన్నా కవాలని చేస్తున్న ఈ ప్రచారం కారణంగా ప్రజల్లో విద్వేషం రెచ్చొగొటటే ప్రయత్నాలు మొదలయ్యాయి. బిఆర్ఎస్ మీడియా ప్రకారం స్వరాష్ట్రం కోసం చంద్రబాబు జల చౌర్యానికి పాల్పడుతున్నారు. జగన్ మీడియా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేస్తూ తెలంగాణకు చంద్రబాబు మేలు చేస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వారు అలాంటి కథనాలను వండి వారుస్తున్నారన్నది వేరుగా చెప్పనక్కరలేదు. పాలకులు ఎవరైనా తమ స్వరాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించలేరు. ఎంతటి జటిలమైన సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. జలవివాదాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఎపి సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనలు హుందాగా ఉన్నాయి. వివాదం పరిష్కారం కాకూడదన్న కోరిక కేసీఆర్, జగన్ రెడ్డిలకు ఉండవచ్చునుగానీ వారికి ఆ అవకాశం ఇవ్వకుండా సంయమనంతో వ్యవహరించవలసిన బాధ్యత ఇరు రాష్ట్రాల సిఎంలపై ఉంది. స్థానిక ఎన్నికలు సమీపించే కొద్దీ ఇలాంటివి మరికొన్నింటిని తెరమీదకు తెస్తారు. ఈ విషయంలో కేంద్రం కూడా చోద్యం చూడడం సరికాదు. కోర్టు గడపలు ఎక్కడం కూడా మంచిది కాదు. ఇరు రాష్ట్రాల జలవివాదాలపై ఉన్నతస్థాయి కమిటీకి పర్యవేక్షణ అప్పగించాలి. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని రాయలసీమకు తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే పోలవరం- నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్ట్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. గోదావరి బేసిన్‌లో ఆంధప్రదేశ్ దిగువ ప్రవాహ రాష్ట్రం కావడంతో, ఇతర రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా మిగిలిన వరద నీటిని వాడుకోవచ్చునని పేర్కొంన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై కేంద్రానికి నివేదిక సమర్పించారు. వారి సూచనల మేరకే మార్పులు చేస్తున్నారు. డీపీఆర్‌కు సంబంధించిన టెండర్లు కేవలం ముందస్తు సన్నాహక చర్య మాత్రమేనని పేర్కొన్నారు. చట్టపరమైన అన్ని అనుమతులు వచ్చాకే పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. గోదావరిపై పోలవరం- నల్లమల్ల సాగర్ లింక్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గోదావరి నది ప్రవహించే చివరి రాష్ట్రం ఏపీ. తెలంగాణ నుంచి ఏపీలోకి ప్రవేశించే ఈ నీరు.. అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ నీటిని వృథాగా సముద్రంలో కలిసే కంటే.. ఆ మిగులు జలాలను పోలవరం- నల్లమల్ల లింక్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ పంపడం.. ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోంది. అయితే ఈ లింక్ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దాంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ సుప్రీంకోర్టులో కొనసాగుతోంది. అయితే ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుకు సాగాల్సి ఉంది. ఇరు రాష్ట్రాలు కూర్చుని సమస్యలు పరిష్కరించాలి. ప్రజల్లో విద్వేషాలను రగిల్చేవారిపట్ల జాగ్రత్త వహించాలి.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# సేవల పంపిణీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్

**ప్రజల సంతృప్తి స్థాయి గీటురాయిగా ముందడుగు**
**పేదరిక నిర్మూలన దగ్గరి నుంచి డీప్ టెక్ వరకు పది సూత్రాలపై ప్రత్యేక దృష్టి**
**సమష్టి కృషితో జీడీడీపీ, తలసరి ఆదాయ వృద్ధికి కార్యాచరణ**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ:** ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా పాలనలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ స్ఫూర్తితో జిల్లాలో ప్రభుత్వ సేవల పంపిణీలో వేగాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం, ముఖ్యమంత్రి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు వర్చువల్‌గా హాజరయ్యారు. జీఎస్‌డీపీ, కీలక ప్రగతి సూచికలు (కేపీఐ), స్వర్ణాంధ్ర విజన్ – పది సూత్రాలు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు, పీపీపీ ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రతిపాదనలు, రియల్‌టైమ్ గవర్నెన్స్, రెవెన్యూ సేవలు, వీబీ- జీ రామ్ జీ యాక్ట్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించి ఆయా అంశాల్లో ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతో పాటు అన్ని రంగాల్లోనూ 18 శాతం సుస్థిర వృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలన–పీ4 మొదలు డీప్ టెక్ వరకు స్వర్ణాంధ్ర విజన్ పది సూత్రాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కీలక ప్రగతి సూచికల్లో జిల్లా ముందంజలో ఉందని, పేదరిక నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాల అమల్లో సమష్టి కృషితో పనిచేస్తున్నామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సేవల్లో ప్రజల సంతృప్తి పరంగానూ ముందంజలో ఉన్నామని.. ఇదేవిధంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటుచేసి రెవెన్యూ సేవలను సత్వరం అందించేందుకు, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. జీడీడీపీ, తలసరి ఆదాయ వృద్ధి లక్ష్యాలపైనా దృష్టిసారిస్తున్నామని, ఎంఎస్ఎంఈల కార్యకలాపాలను విస్తృతం చేసేందుకు కూడా కృషిచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ కవచం జనసేన పార్టీ

**ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**




**చల్లపల్లి:** ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ కవచం జనసేన పార్టీ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి, మండల పరిధిలోని వెలువోలు బీసీ కాలనీలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరికల కార్యక్రమం జరిగింది. గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు కోనేరు శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు పెనుమత్స కృష్ణారావు ఆధ్వర్యంలో వెలువోలు కుమ్మరిపాలెంకు చెందిన కైతేపల్లి వెంకటేశ్వరరావు, బొల్లా జగన్మోహనరావు, కైతేపల్లి నాగ సుధారాణి, మెరుగుమాల శ్రీనివాసరావు, వేములమడ వీర శ్రీనివాసరావు సహా ఇరవై మంది వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు జనసేన పార్టీలో చేరారు. ఘంటసాల మండలం పాపవినాశనం నుంచి జనసేన పార్టీ నాయకులు డొక్కు భీమరాజు, నెరుసు రాము, కలకండ నాగమల్లేశ్వరరావు, నెరుసు గోపీ, నెరుసు గోపీచంద్ ఆధ్వర్యంలో గొరిపర్తి పోతురాజు, కోసూరు వెంకటేష్, గొరిపర్తి రాము, కొలుసు శ్రీధర్, గోళ్ళ రాంబాబు సహా 16మంది వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ జనసేన పార్టీ కండువాలతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీలో చేరిన వారు పార్టీలో ఉన్న వారితో, టీడీపీతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమిలో సఖ్యతగా మెలగాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదేపదే చేస్తున్న దిశా నిర్దేశం ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. కూటమిలో ఉంటూనే జనసేన పార్టీని బలోపేతం చేసుకోవటం మన బాధ్యత అన్నారు. అభివృద్ధిని విస్మరించిన వైసీపీ తీరుకు విసుగు చెంది, గ్రామీణ అభివృద్ధికి బాటలు వేస్తున్న పవన్ కళ్యాణ్ ఆచరణ నచ్చి జనసేన పార్టీలో చేరిన వారిని అభినందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి తాను మంజూరు చేసి నిర్మాణ పనులు సగంలో ఉన్న అనేక రోడ్లను రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ పాలకులు రద్దు చేసి పనులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్ళీ ఆ రోడ్ల నిధులు వెనక్కు తేవటం చాలా కష్టంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే అనేక రోడ్లు నిర్మించామని, మరిన్ని రోడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. వెలువోలు గ్రామంలో కరకట్ట వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఇచ్చిన నిధుల నుంచి రూ.12లక్షలతో నిర్మించనున్నట్లు గ్రామస్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. వెలువోలు ప్రజలకు అవసరమైన మరొక ప్రధాన రహదారి అవనిగడ్డ- విజయవాడ కరకట్ట రోడ్డు అభివృద్ధికి రూ.130 కోట్లు అవసరం అన్నారు. ఈ నిధుల సాధనకు శతవిధాలుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన పార్టీ నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అతిధులను ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మత్స్యకార విభాగం కార్యదర్శి లంకె యుగంధర్, చల్లపల్లి, ఘంటసాల మండల పార్టీ అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, కోన రాజశేఖర్, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్ రాజా, చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించండి

**జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**



**విజయవాడ:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్నంగా పరిశీలించి, నిబద్ధతతో, నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్, మరో సమావేశ మందిరంలో నాన్ రెవెన్యూ పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 85 రెవెన్యూయేతర అర్జీలు రాగా వీటిలో పోలీసు శాఖకు 19, పురపాలన 15, పంచాయతీరాజ్ 10, డీఆర్‌డీఏ 8, వైద్య ఆరోగ్యం 5, పౌర సరఫరాల శాఖకు 4 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా విద్య, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు మూడు చొప్పున, రహదారులు–భవనాలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, ఇరిగేషన్, రవాణా, డ్వామాలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. కార్యక్రమంలో రెవెన్యూ క్లినిక్‌కు 88 అర్జీలు వచ్చాయి. వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి, క్షేత్రస్థాయి అధికారుల సహకారంతో నిర్దేశ గడువులోగా అర్జీలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ సూచించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
మంగళవారం 13 జనవరి 2026



యువతలో విజ్ఞాన దీపాన్ని వెలిగించిన

# మహానుభావుడు వివేకనందుడు...

**- మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు.. కొణతాల రామకృష్ణ**





**కశింకోట, జనవరి 12 మనసులో మాట..** మండలం లోని తాళ్లపాలెం గ్రామం విశ్వ వేదికపై హిందూధర్మా వైభవాన్ని వినిపించిన విశ్వ విజేత స్వామి వివేకానంద జయంతోత్సవం సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ . విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూఎఫ్ఐ డిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ , రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సోమవారం రామకృష్ణ మాట్లాడుతూ ముందుగా విగ్రహం ఏర్పాటు చేసిన గల్లా రాజుకి అభినందనలు తెలియజేసే, భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయము చేసిన ఖ్యాతి అతనిది అని, గురువు కోరిక మేరకు అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత గురించి ఎన్నో ఉపన్యాసాలు చేశాడు. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానందుడు, అతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి ఈయనే అని తూర్పు దేశాల షికాగోలో జరిగిన ప్రపంచ మత జాతర పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రెలిజియన్స్ లో 1893 లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలోను, అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని పొందారు. తిరిగి భారత దేశం వచ్చి రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు. ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించాడు. అలాంటి మహానుభావుడు విగ్రహా ఏర్పాటు చేయడం మనం అంత గర్వించదగ్గ విషయమని అన్నారు.. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద అభిమానులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



బీజేవైఎం ఆధ్వర్యంలో

## ఘనంగా వివేకానంద జయంతోత్సవాలు

### మారధాన్ లో పాల్గొన్న కరాటే కోచ్ చదరం

**అనకాపల్లి రూరల్, జనవరి 12 (మనసులో మాట):** భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతోత్సవాలలో భాగంగా యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేశ యువతకు స్ఫూర్తిదాయకమైన, ఆదర్శుడైన స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవం దేశవ్యాప్తంగా నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తుంది. గాజువాకలో నిర్వహించిన వివేకానంద జయంతి ఉత్సవాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా మారథాన్ 5 కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే పెదకంశెట్టి గణబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల నుంచి పలు రంగాలలో ప్రముఖులు, క్రీడాకారులు, కళాకారులు, సమాజ సేవకులు పాల్గొన్నారు. అనకాపల్లిలో పేరెందున జాతీయ కరాటే కోచ్ చదరం సూరి అప్పారావు తన బృందంతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్, గణబాబు ప్రశంస పత్రంతో అభినందించి సత్కరించినట్టు చదరం సూరి అప్పారావు తెలిపారు.

16 కోట్లు తో సర్వంగా సుందరంగా

# అనకాపల్లి పట్టణాభివృద్ధి

- అనకాపల్లి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- అనకాపల్లి జీవీఎంసీ జోన్ 82,83,84 వార్డులలో సీసీ రోడ్లు, కాలువలు, పార్కులకు శంకుస్థాపన
- జీవీఎంసీ 84 వ వార్డు పెరుగు బజారు, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రారంభోత్సవం
- ముఖ్య అతిధిలు గా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మెన్ లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ళ సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్





**అనకాపల్లి, జనవరి 12 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణంలో సోమవారం 16 కోట్లు రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన లు జరిగాయి. 82వ వార్డు అంజయ్య కాలనీ, 83వ వార్డు గుండాల జంక్షన్, 84 వ వార్డు గాంధీ బొమ్మ సెంటర్, రింగ్ రోడ్డు లక్ష్మీనారాయణ నగర్, రఘురామ కాలనీ, జివిఎంసి విలీన గ్రామాలు కొండకొప్పాక, సుబ్రహ్మణ్యం కాలనీ, కెఎన్ ఆర్ పేట, శిరసపల్లి లలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ,రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ విశాఖపట్నం మేయర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ తదితరులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు జరిపారు. అనంతరం సంక్రాంతి పండుగ ను పురష్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్ లో సంప్రదాయ క్రీడలను వారు ప్రారంభించారు. అంతకుముందు గాంధీ నగర్ లోని పార్క్ ను వారు పరిశీలించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు మాదంశెట్టి చినతల్లి నీలబాబు, మందపాటి సునీత జానకి రామరాజు, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షు రాలు కొణతాల రత్నకుమారి, అధికసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తలు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



గంజాయి కేసులో నిందితుడికి

## 10 సం.ల ఖైదు, జరిమాన

**- జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

విజయనగరం (మనసులోమాట ): జనవరి 12::జిల్లా ఎస్. కోట పోలీసు స్టేషన్ 2023 సం.లో నమోదైన గంజాయి కేసులో అరెస్టుకాబడిన ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా నీలకంచేరు గ్రామానికి చెందిన (ఎ-2) బిస్మా చరణ్ సుగ్రీ (33 సం.లు) అనే నిందితుడికి 10సం.ల కఠిన కారాగార శిక్ష, రూ.1లక్ష జరిమాన విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.మీనాదేవి జనవరి 12న తీర్పు వెల్లడించినట్టు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ తెలిపారు.

విజయనగరం జిల్లా ఎస్.కోట పోలీసు స్టేషన్ పరిధిలో తే. 10-04-2023 దిన అప్పటి ఎస్.కోట పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంపై రామనగర్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, అరకు నుండి కారులో వస్తున్న (ఎ-2) బిస్మా చరణ్ సుగ్రీ (33 సం.లు) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కారులోగల 50కిలోల గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం, కేసు దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్.కోట సిఐ ఎస్.సింహాద్రి నాయుడు నిందితుడిని రిమాండుకు తరలించగా, సిఐ ఎస్.బాల సూర్యారావు న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. ఈ కేసు విచారణలో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎం. మీనాదేవి 10సం.లు కఠిన కారాగార శిక్ష, రూ. 1లక్ష జరిమాన విధించారని, జరిమాన చెల్లించడంలో నిందితుడు విఫలమైతే అదనంగా మరో 1సం. సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పోలీసుల తరువున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సత్యం సాక్షులను విచారించగా, ఎం.ఖజానారావు పోలీసు వారి తరుపున వాదనలు వినిపించారన్నారు. ఎస్.కోట పోలీసు స్టేషన్ కోర్టు మహిళా కానిస్టేబులు పి. సల్మ, సి.ఎం.ఎస్. కానిస్టేబులు కే.త్రినాధరావు సాక్ష్యులను సకాలంలో హాజరపర్చి నిందితుడికి శిక్షింపబడే విధంగా వ్యహరించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడే విధంగా వ్యవహరించిన పోలీసు అధికారులని, సిబ్బందిని మరియు ఎపిపిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.

## శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స ను కలిసిన నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే



నర్సీపట్నం రూరల్, జనవరి 12, ( మనసులో మాట) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణను ఆయన సతీమణి బొత్స ఝాన్సీని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం విజయనగరంలోని బొత్స నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తు పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నర్సీపట్నం మునిసిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాకిరెడ్డి బుల్లిదొర పాల్గొన్నారు.

## మునగపాక శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి విరాళం

**- విరాళం అందజేస్తున్న సూరిశెట్టి కన్నారావు దంపతులు**



**మునగపాక, జనవరి 12, మనసులో మాట** మండల కేంద్రం మునగపాక శ్రీ వేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి మునగపాక వాస్తవ్యులు స్వర్గీయ సూరిశెట్టి వీరన్న, అప్పయమ్మ దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు సూరిశెట్టి కన్నారావు, లక్ష్మి కాంతం దంపతులు =o.1,08,001 రూపాయలు విరాళాన్ని ఇచ్చితిరి, వారికి వారి కుటుంబానికి శ్రీ శ్రీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బొడ్డేడ ప్రసాద్, ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు,ఆడారి కాశిబాబు, దాడి ముసలి నాయుడు, సూరిశెట్టి సుధారాణి, అలంక సూర్య ప్రకాశరావు, కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి అప్పలనాయుడు, బొడ్డేడ రాము నాయుడు, పెంటకోట జగ్గప్పారావు, మద్దాల వీరు నాయుడు, దాడి శ్రీరామ్ మూర్తి పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## లక్ష ప్రమిదల దీపారాధన కరపత్రాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయన్నపాత్రుడు



**నర్సీపట్నం రూరల్, జనవరి 12, ( మనసులో మాట) :** స్థానిక శ్రీ షిరిడీ సాయి ఆలయంలో ఈ నెల 29న నిర్వహించనున్న భీష్మ ఏకాదశి వేడుకలు, 24వ లక్ష ప్రమిదల దీపారాధన మహోత్సవ కరపత్రాన్ని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయన్నపాత్రుడు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జనవరి 29న ఉదయం నుండి బాబా వారికి ప్రత్యేక అభిషేకాలు, అన్నసమారాధన ఉంటాయని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యంత వైభవంగా లక్ష ప్రమిదల దీపారాధన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ సూర్య తేజ

అనకాపల్లి రూరల్, జనవరి 12 (మనసులో మాట): అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ గా మల్లవరపు సూర్యతేజను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం జాహ్నవి ప్రసూతి సెలవులపై వెళ్లారు. సూర్య తేజాను జాయింట్ కలెక్టర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్య తేజ ఇప్పటివరకు ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై అనకాపల్లి వచ్చారు.



జిల్లా కలెక్టర్లు జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

## వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం



**పాడేరు , జనవరి 12 ( మనసులో మాట):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతి సచివాలయ కార్యాలయం నుండి వర్చువల్ విధానం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్టీపీ, 10 సూత్రాలు, ఆర్టిజిఎస్,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు తో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించిందిన ఆర్టీజీఎస్, ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకున్న సమాచారం మేరకు జిల్లాకు సంబంధించి పెన్షన్ డిస్ట్రిబ్యూషన్, మ్యుటేషన్స్, మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ ద్వారా మందులు పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా వంటి విషయాలని నెగటివ్ ఫీడ్బ్యాక్ వచ్చిన సందర్భంగా వీటిలో సంబంధిత శాఖలు అన్ని చేయాల్సిన పురోగతి వారు అందించాల్సిన సేవలు వివరాలను, ఖచ్చితంగా పాటించాల్సిన నియమ నిబంధనలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వారికి అల్లూరి ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందుతున్న అంశాలపై వివరిస్తూ,అర్జీ దారులు కొంతమందిని స్వయంగా (రెండం)గా ఫోన్ కాల్ చేసి, మరికొంత మంది వద్దకు నేరుగా వెళ్ళి తెలుసుకొని కొన్ని వీడియోగ్రఫీ కూడా చేయించడం జరిగింది అని తీలియజేస్తూ, గ్రామాల్లో ఉండే గ్రీవెన్స్ పిటిషన్ దారు లతో మాట్లాడినప్పుడు వారు ఏదైతే ఒకటి ప్రెస్ చేయబోయి రెండు ప్రెస్ చేయడం వల్ల నెగటివ్ ఫీడ్బ్యాక్ వచ్చిన విషయాన్ని గుర్తించడమైనదని వివరించారు. అదేవిధంగా అల్లూరి జిల్లా ఏజెంట్ స్పేస్ డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయడం లో బాగా తక్కువగా నమోదు అయిందని చెప్పి గుర్తించడం జరిగింది. కనుక దానికి సంబంధించి డాక్యుమెంట్స్ కూడా ఏజెంట్ స్పేస్ లో అప్లోడ్ చేసే విషయమై అన్ని డిపార్ట్మెంట్స్ కి అన్ని సబ్జెక్టుల జీవోలు, మెమోలు, ప్రొసీడింగ్ లు, అన్ని విధాల కరెస్పాండెన్స్ అప్లోడ్ చేయాలని డిపార్ట్మెంట్స్ హెడ్స్ కి కూడా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఆయా డిపార్ట్మెంట్స్ ఏజెంట్ స్పేస్ తప్పనిసరిగా వారి డిపార్ట్మెంట్ సంబంధించిన అన్ని ఆర్డర్లు ప్రొసీడింగ్స్ మెమొలు జీవోలు అన్ని కరెస్పాండెంట్స్ వాళ్ళు పై అధికారులు చేసిన కరస్పాండెంట్స్ అదేవిధంగా డిపార్ట్మెంట్లో ఇంటర్నల్ కరెస్పాండెన్స్ అంతా కూడా అప్లోడ్ చేయమన్నారు. పట్టదారు పాసు పుస్తకాలు పంపిణీలో ఏవిధమైన తప్పులు దొర్లకుండా మరియు ఎటువంటి అవినీతి జరగకుండా చూడమని ఆర్డీవోలకు, తాసిల్దార్లకు, దిగువ సిబ్బందికి అందరికి జాయింట్ కలెక్టర్ తెలుపమన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, ఇంచార్జి ఆర్డీవో, స్పెషల్ డిబ్బిలిటీ కలెక్టర్ ఎంబీఎస్ లోకేశ్వరరావు, సిపిఓ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

15న కాశీపురంలో

## మెగా వైద్య, రక్తదాన శిబిరాలు

**దేవరాపల్లి, జనవరి 12 (మనసులో మాట) :** మండలంలోని కాశీపురంలో ఈ నెల 15న ప్రముఖ న్యూరో ఫిజీషి యన్ బొడ్డు దేముడుబాబు ఆధ్వర్యంలో మెగా వైద్య, రక్తదాన శిబిరం, పదవ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ను నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సంక్రాంతి వేడుకలు, ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలి పారు. ఆసక్తి ఉన్న వారు స్ఫూర్తి ఫౌండేషన్కు చెందిన 9666851102, 9603574870 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని ప్రకటించాలి...

**కె.కోటపాడు, జనవరి12 (మనసులో మాట) :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యా యులకు సంక్రాంతి కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కోలా రాజేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ కు జిల్లా అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నికయిన ఆయన మాట్లాడుతూ గత పీఆర్సీ గడువు ముగిసి రెండు సంవత్సరాల ఆరు నెలల కాలం పూర్తవుతున్నందున కొత్త పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఎన్నికల హామీలతో పాటు మధ్యంతర భృతిపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మాదిరిగా విద్యాశాఖలో కూడా ప్రత్యేక కేడర్ ను సృష్టించాలని లేదా ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేసి పదోన్నతులు కల్పించాలని రాజేంద్ర కుమార్ కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**డుంబ్రిగుడ, జనవరి 12, (మనసులో మాట):-** సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందేలు, పేకాట,గంజాయితోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారిపై శాఖ పరమైన కఠిన చర్యలు తప్పదని స్థానిక ఎస్సై సురేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంజాయి జోలికి వెళితే అటువంటి వారిపై చర్యలు తీసుకొంటామని ,యువత గంజాయి వెల్లి భవిష్యత్ పోగొట్టుకోవద్దాన్నారు.రోడ్డు ప్రమాదాలు కూడా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.పండగా సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా గతంలో గంజాయి కేసుకున్నావారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు.గంజాయి జోలికి వెళ్లకుండా ప్రభుత్వం కాఫీ,మిరియాలు వంటి ప్రంత్నామయ పంటల సాగుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## అనకాపల్లి పట్టణ పరిధిలో హెల్మెట్ ధారణను మినహాయించాలి

**- జిల్లా ఎస్పీ కి సిపిఐ వినతి**



**అనకాపల్లి, జనవరి 12 , మనసులో మాట..** పట్టణ పరిధిలో ద్విచక్ర వాహనదారుల కు హెల్మెట్ దారణ నుండి మినహాయింపు ఇవ్వాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కు సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు, వై ఎన్ భద్రం వినతి పత్రం అందజేశారు. ప్రమాదాల నివారణకు భద్రత ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిబంధనల్ని స్వాగతిస్తున్నామని వారుఎస్పీకి తెలిపారు. కాగాఅనకాపల్లి పట్టణ స్వరూపం పల్లెకన్నా పెద్దది, సిటీ కన్నా చాలా చిన్నది కావున ఇక్కడి ప్రజల జీవన పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని హెల్మెట్ కు మినహాయింపు ఇవ్వాలని వారి కోరారు. నెహ్రూ చౌక్ లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు వల్ల హెల్మెట్ ధరించని వారికి తమకు తెలియకుండానేచలానాలు పడిపోతున్నాయని దీనివల్ల పేదలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని వారు వివరించారు. త్రిబుల్ డ్రైవ్, సిగ్నల్ జంపింగ్, వంటివి కొనసాగించినా హెల్మెట్ దారణను మానవతా దృక్పథంతో ఆలోచించి మినహాయించాలని వారి ఎస్పీ నీ కోరారు. అలాగే నిర్దిష్టమైనపార్కింగ్ స్థలాలు కేటాయించకుండా రాంగ్ పార్కింగ్ చలానాలను కూడా పునః పరిశీలించాలని వారు కోరారు.

### నర్సీపట్నంలో ఘనంగా ప్రారంభమైన

# 'సంక్రాంతి కబడ్డీ' పోటీలు

**- ప్రారంభించిన స్పీకర్ తనయుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్**

**- రుత్తల లచ్చా పాత్రుడు జ్ఞాపకార్థం మండల స్థాయి పోటీల నిర్వహణ**



**నర్సీపట్నం రూరల్, జనవరి 12, ( మనసులో మాట) :** సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా నర్సీపట్నంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక వెలమవీధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, కీ.శే. రుత్తల లచ్చుపాత్రుడు జ్ఞాపకార్థం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా వేడుకను స్పీకర్ తనయుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి టాస్ వేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ నెల 12 నుండి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ కబడ్డీ పోటీలు జరుగుతాయని తెలిపారు ఈ పోటీలలో 22 జట్లు తలబడునున్నట్లు తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల తోపాటు కొయ్యూరు, రోలుగుంట, రావికమతం మండలాల నుండి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విజేతలకు ప్రోత్సాహకరంగా భారీ నగదు బహుమతులను ప్రకటించారు. ప్రథమ బహుమతి: రూ. 20,వేలు, ద్వితీయ బహుమతి: రూ. 15 వేలు ఇవ్వనున్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టణ సీఐ షేక్ గఫూర్, టిడిపి నాయకులు స్థానిక కౌన్సిలర్లు, వెలమవీధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహణ



**నక్కపల్లి, జనవరి 12 (మనసులో మాట)..** పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత గారి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో నక్కపల్లి మండలంలోని హోంమంత్రి అనిత నివాసం వద్ద నియోజకవర్గ ముఖ్య నాయకులు సమావేశమై సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై చర్చించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలో ఉన్న హోంమంత్రి గారి క్యాంప్ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.25,000, రెండవ బహుమతిగా రూ.15,000, మూడవ బహుమతిగా రూ.10,000 నగదు బహుమతులు ప్రకటించారు. అలాగే కూచిపూడి, భరతనాట్యం, కోలాటం వంటి సాంప్రదాయ నృత్యాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు 14వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ బృందం ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఆకట్టుకోనున్నాయని తెలిపారు. బోగి మంటలు, హరిదాసు కీర్తనలు, డుడూ బసవన్నల సందడితో ప్రాంతమంతా పండుగ వాతావరణంతో కోలాహలంగా మారనుందని నాయకులు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ



**ఎస్. రాయవరం, జనవరి 12 (మనసులో మాట):** స్వామి వివేకనంద జయంతి సందర్భంగా ఎస్. రాయవరం మండలం పెట్టుగోళ్ళపల్లి గ్రామంలో స్థానిక వైఎస్సార్సీపి అధ్వర్యంలో పేదలుకు నూతన వస్త్రాలు పంపిణీచేసారు. గ్రామంలో వివేకనంద విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్సీపి నియోజకవర్గ ఇన్చార్జి కంబాలజోగులు వివేకనంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగానివాళులర్పించారు. ఈసందర్భంగా వివేకానంద సేవలను కొయాడారు. పలువురు వైఎస్సార్సీపీనేతలు వివేకనంద విగ్రహానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు.వైఎస్సార్సీపి బిసి సెల్ అధ్యక్షుడు వి య్ య వ్ ు వ ం వ్ ె ల ం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పేదలకు దుప్పట్లు, తువ్వాలు తదితర వస్త్రాలు నుఅందచేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీ పి నాయుకులు మధువర్మ, వెదుళ్ళబంగారి,సర్పంచ్ కర్రిసత్యనారాయణ, వైఎస్ ఎంపిపి అప్పన్న, మాజీ సర్పంచ్ వెదుళ్ళ బంగారి, పినపోలు ప్రసాద్, మైలారు శ్రీనివాసరావు, చోప్పారాజు,నరేన్, శ్రీనివాసరావు, కె. అమ్మాజీ తధితరులు పాల్గోన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ



**నర్సీపట్నం రూరల్, జనవరి 12, (మనసులో మాట) :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో మరో సేవా కార్యక్రమం చేపట్టారు. నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నర్సీపట్నం కేంద్రంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ, తెలుగు వారికి సంక్రాంతి అతిపెద్ద పండుగ అని, ఈ పండుగ ప్రతి ఇంట్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ముఖ్యంగా మహిళలను గౌరవించి కానుకలు ఇవ్వాలనే ఉద్దేశంతో చీరల పంపిణీ నిర్వహించామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పేదలు, మహిళలు, యువతకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి పంచాడ హరినాథ్, నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శేఖర్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయురాలు నాగజ్యోతికి

# జాతీయ ఉపాధ్యాయ రత్న అవార్డు ప్రధానం



**నర్సీపట్నం రూరల్, జనవరి 12, ( మనసులో మాట) :** విద్యా రంగంలో 27 సంవత్సరాలకు పైగా అంకితభావంతో సేవలందిస్తున్న జిల్లా పరిషత్ హై స్కూల్, రోలుగుంటలో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శ్రీమతి పి.వి.ఎం. నాగ జ్యోతికి సావిత్రిబాయి పూలే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో"ఉపాధ్యాయ రత్న 2026" అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. విశాఖపట్నం ప్రెస్ క్లబ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల ప్రముఖ లు పాల్గొన్నారు. నాగ జ్యోతి విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఆదర్శ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు. ఆధునిక ఐసీటీ ఆధారిత బోధన, సృజనాత్మక బోధనా పద్ధతులు, డిజిటల్ కంటెంట్ వినియోగం ద్వారా తరగతి గదులను ఉత్సాహభరితమైన అధ్యయన కేంద్రాలుగా మార్చినందుకు అవార్డు కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించింది. అకడమిక్ రంగంతో పాటు స్కౌట్స్ & గైడ్స్ కెప్టెన్గా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెంపొందించడంలో ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తించారు. అలాగే డ్రాప్ఔట్ పిల్లలను తిరిగి బడికి చేర్చడం, సామాజిక సేవా కార్యక్రమాలు, ఎన్జీఓలతో సమన్వయం వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆమె పాత్ర ప్రశంస నీయమని వక్తలు పేర్కొన్నారు. అంతేకాక ఆమె అంతర్జాతీయ పవర్ లిఫ్టర్గా భారతదేశానికి పలు అంతర్జాతీయ పతకాలు సాధించి విద్యార్థులకు క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్య జీవన విలువలను ప్రేరణగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగజ్యోతి సోమవారం నర్సీపట్నంలో మాట్లాడుతూ, ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో విద్యాసామాజిక రంగాల్లో సేవలు కొనసాగిస్తానని తెలిపారు.



### జీవీఎంసీ స్థలాలను

# ఆక్రమణ నుండి రక్షించాలి

**ఎస్సీ సంఘం నాయకుడు మామిడి నూకరాజు**

అనకాపల్లి రూరల్, జనవరి 12 (మనసులో మాట): అనకాపల్లి జీవీఎంసీ జోన్ పరిధిలో జీవీఎంసీ స్థలాలను ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని మామిడి నూకరాజు జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవిపేట శ్రీ దుర్గమ్మ గుడి వెనుక ఉన్న విలువైన ఖాళీ స్థలాన్ని ఆక్రమించి బడ్డీ బడ్డీ నిర్మాణం చేసినట్టు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. పెద్దదిగా ఏర్పాటు చేసి స్థానికులకు ఇబ్బందికరంగా బడ్డీ నిర్మాణం ఉందన్నారు. సదరు స్థలంలో జీవీఎంసీ వారు బోర్డును కూడా ఏర్పాటు చేశారన్నారు. స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కమీషనర్ కు ఇచ్చిన వినతి లో మామిడి నూకరాజు కోరారు.

### పూర్వ విద్యార్థి జ్ఞాపకార్థం పాఠశాల అవరణలో

# మొక్కలు నాటిన కుమారులు



**ఎస్. రాయవరం, జనవరి 12,(మనసులోమాట):** ఎస్. రాయవరం మండలం పెద్దగుమ్ములూరు మోడల్ ప్రైమరీ స్కూల్ పూర్వ విద్యార్థి కీర్తి శేషులు అంగరాజు పెదజోగిరాజు కుమారుడు అంగరాజు సురేష్ కుమార్ రాజు, కుమార్తె నివేదిత వర్మ సంయుక్తంగా వారి సొంత ఆర్థిక నిధులతో సుమారు రూ.30వేలు ఖర్చుతో దేవతా వృక్ష జాతికి చెందిన మోదుగ,ఉసిరి,జమ్మి,, శతపత్ర, మారేడు,అశోక,మొదలగు మొక్కలను పాఠశాల ఆవరణం లో నాటారు.ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్ రాజు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుండి మొక్కలును వివిధ ఔషధాలు తయారీలో ఉపయోగిస్తున్నారని , దేవతా వృక్షాలు పర్యావరణాన్ని కాపాడటం తో పాటు ఆధ్యాత్మిక, ఔషధ ప్రయోజనాలను మానవులకు అందిస్తాయని, దేవతా వృక్షాలు దేవతలకు ప్రతీకలని సూచించారు. కార్యక్రమంలో సురేష్ కుమార్ రాజు ,నివేదిత వర్మ ,రఘు రాజు మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయులు, రమణ మూర్తి రాజు, శ్రీను పాల్గొన్నారు.

## కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**- ఎస్ఐ వి. సత్యనారాయణ**



**దేవరాపల్లి, జనవరి 12, (మనసులో మాట) :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ దేవతల తీర్థ మహోత్సవాల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరాపల్లి ఎస్ఐ వి. సత్యనారాయణ హెచ్చరించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విస్తృతంగా ఆటోలో ప్రచారం చేశారు. కోడి పందాలు, బల్లాటలు, పేకాట ఇతర జూదాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు, జూదాలు నిర్వహిస్తే స్థానిక ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

## మూలపేట శ్రీ కోదండ సీతారాముల గుడికి రంగుల నిమిత్తం విరాళం

**విరాళాన్ని అందజేస్తున్న కొయిలాడ శంకర్ రావు ధనలక్ష్మి దంపతులు**



**మునగపాక, జనవరి 12, మనసులో మాట..** మండలంలో గల మూలపేట శ్రీ కోదండ సీతారాముల వారి గుడికి పెయింటింగ్ కి విరాళం ఇచ్చిన దాతలు కోయిలాడ శంకరరావు ధనలక్ష్మి కుమారులు భరత్ & ఆశ దంపతులు, సాగర్ 25000/-విరాళం ఇచ్చారు. అలాగే కాండ్రేగుల గాంధీ రత్నం 25000, బీసెట్టి కేశవరావు ధనలక్ష్మి దంపతులు 12000, కాండ్రేగులో నాని సునీత దంపతులు 10000, దొడ్డి అప్పలరాజు శ్రీను 10000, పీల సాంబమూర్తి కుమారులు 5000, సరగాడు ఉమామహేశ్వరావు దంపతులు 5000, బీసెట్టి మురళి దంపతుల 5000, బొడ్డేడ రవికుమార్ దంపతుల 5000, ఎల్లపు అప్పారావు కుమారులు 5000, శరగడం పైడ్రాజు అశోక్ 5000 విరాళాలు అందజేశారు వారికి వారు కుటుంబ సభ్యులకి సీతారాముల వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నాం రైతు సంఘం నాయకులు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు కాండ్రేగుల గాంధీ ఆకాంక్షించారు.



## పూడిమడక సముద్రంలో మత్స్యకారుడు గల్లంతు

**అచ్యుతాపురం జనవరి 12 మనసులో మాట..**పూడిమడక గ్రామం శివారు కొండపురం గ్రామానికి చెందిన గనగల్ల సత్తయ్య తో పాటు ఏడుగురు మత్స్యకారులు ఆదివారం తెల్లవారుజామున వేటకు వెళ్లారు ప్రమాదవశాత్తు సముద్రం అలలు ఎక్కువ రావడంతో చాపల బోటు తిరిగి పడిపోయింది మిగతా ఆరుగురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు గనగల సత్తయ్య మాత్రం సముద్రంలో చిక్కుకున్నాడు గనగల్ల సత్తయ్య కోసం తోటి మత్స్యకారులందరూ వెతకడం మొదలుపెట్టారు ఇప్పటికీ గనగల్లు సత్తయ్య ఆచూకీ లభ్యం కాలేదు.

## రేపు తారువలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పునః ప్రారంభోత్సవం



**దేవరాపల్లి, జనవరి 12, (మనసులో మాట) :** మండలంలోని తారువలో శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ పునఃప్రారంభోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఆలయ పునః ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయంలో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తాంజనేయస్వామి ఆలయ పునః ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రజలంతా పాల్గొని స్వామి వారి కృపా కటాక్షాలను పొందాలని మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు.

## కశింకోట లో శ్రీ వేకనందుని 163 జయంతి వేడుకలు

### వివేకానందునికి పూలమాలతో నివాళులర్పించిన సీఐ.. స్వామి నాయుడు..



**కశింకోట , జనవరి 12, మనసులో మాట..** మండలంలోని కశింకోట బ్రాహ్మణ సేవా సంఘం ఆధర్యం లో స్వర్గీయ రామ్ ప్రసాద్ దంపతుల జ్ఞాపకార్థం వారీ కుటుంబ సభ్యుల చే నిర్మింపబడిన కశింకోట సంతబయలు లో గల స్వామి వివేకానంద విగ్రహం వద్ద 163వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యకర్తలు సుంకరణం వీర వెంకట సత్యనారాయణ మూర్తి , పెనమటి అప్పారావు , హరి , కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దాడి కాళిదాసు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేదుల వెంకట శాస్త్రి, వేగి గోపి మల్ల బుల్లిబాబు, దాసరి బాబు , రాంప్రసాద్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యువతకు వివేకానంద స్ఫూర్తి అని ఆయన బోధనలు ఆచరణ యోగమని అన్నారు. చికాగోలో ఆయన వినిపించిన సందేశం భారతదేశ వైదిక ధర్మానికి చిహ్నం అన్నారు. ఉక్కు పిడికిళ్ళు ఉక్కు నరాలు యువత కలిగి ఉండాలని మనోధైర్యం వారి బలమై ఉండాలని ఆయన చెప్పిన మాట మన యువతకు ఆదర్శమన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతుల పంపిణీ , పేదలకు ఆహార పంపిణీ చేశారు.

# నిర్మాణ పనులు ప్రారంభించేది ఎప్పుడు






**డుంబ్రిగుడ, జనవరి 12,(మనసులో మాట):** వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నిర్మాణ పనులు ప్రారంభించడంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తుండడంతో ప్రారంభించలేదు. దీంతో ఆ గ్రామంలో గిరిజనులకు రవాణా కష్టాలు తీరడం లేదు. మండలంలోని పోతంగి పంచాయతీ అమలగూడ మారుమూల గ్రామంలో వంతెన నిర్మాణం కోసం అడవి తల్లి బాట పథకం ద్వారా సుమారు గత 4 నెలల క్రితం వంతెన మంజురయింది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు బోర్డు ఏర్పాటు చేశారు తప్ప ఇప్పటివరకు ఎటువంటి పనులు చేపట్టలేదు. బిల్లా పుట్టు, బిజు మరవలస వలస రోడ్డు జంక్షన్ నుంచి అమలగూడకు సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. అయితే వంతెన సౌకర్యం లేకపోవడంతో రవాణాకు ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో ఆ గ్రామస్తులు గడ్డ దాటుకుని బయటికి రావడానికి మరింత ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అనారోగ్యానికి గురైన వ్యాధిగ్రస్తులను వెనువెంటనే హాస్పిటల్ కి తరలించాలన్న వంతెన సౌకర్యం లేక నాన అవస్థలు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి తల్లి బాట పథకం ద్వారా వంతెన నిర్మాణం అయినట్లు అధికారులు ప్రకటించి బోర్డు ఏర్పాటు చేయడంతో ఆ గ్రామస్తులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి పనీలు ప్రారంభించకపోవడంతో ఈ వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తారా లేక గతంలో మాదిరిగా మళ్లీ యధావిధిగా వదిలేస్తారా అనే అనుమానాలం వ్యక్తమవుతున్నాయని ఆ గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

## ఘనంగా ముగిసిన లయన్స్ క్లబ్ నవ్య హంగర్ వీక్ వారోత్సవాలు

### 3వేల మంది భక్తులకు అల్పాహారం అందజేత




**నర్సీపట్నం రూరల్, జనవరి 12, ( మనసులో మాట) :** లయన్స్ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఏపీ సింగ్ ఆదేశాలకు అనుగుణంగా నర్సీపట్నం లయన్స్ క్లబ్ నవ్య జనవరి 3 తేదీ నుంచి నిర్వహించిన "హంగర్ వీక" వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. చివరి రోజున స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుమారు 3వేల మంది భక్తులకు అల్పాహారాన్ని అందించారు. లైన్స్ క్లబ్ నవ్య సభ్యుడు లయన్ పూకా నాగేశ్వరరావు సుమారు 3వేల మంది భక్తులకు తన సొంత ఖర్చుతో అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ కార్యవర్గ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం లైన్స్ క్లబ్ నవ్య అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ నవ్య పాతిక సంవత్సరాలుగా నర్సీపట్నంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నర్సీపట్నం ప్రజలకు విద్య, వైద్య పరంగా క్లబ్ సభ్యుల సహకారంతో అనేక సేవలందించామన్నారు. లయన్స్ క్లబ్ నవ్య 25 సంవత్సరాల జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్న ఈ సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బేతిరెడ్డి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు గొలుసు శ్రీనివాస్, ప్రియాంక, చెరుకూరి సత్యనారాయణ, మళ్ల గణేష్, ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు విగ్రహం నిర్లక్ష్యం

### మాకవరపాలెం తాసిల్దార్ కార్యాలయం వద్ద అవమానకర పరిస్థితి



**మాకవరపాలెం, జనవరి 11 (మనసులో మాట):** గిరిజనుల ఆరాధ్య దైవం, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం మాకవరపాలెం మండల తాసిల్దార్ కార్యాలయం సమీపంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ బొంతు రమణ ఆరోపించారు.
2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్టించారని, అయితే ఆ రోజు నుంచి ఇప్పటివరకు విగ్రహం శుభ్రత, సంరక్షణపై సంబంధిత అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. తాసిల్దార్ కార్యాలయానికి ప్రతిరోజూ అధికారులు, ప్రజలు వచ్చి వెళ్లుతున్నప్పటికీ, విగ్రహం పరిసరాల్లో చెత్త, ఎండిపోయిన ఆకులు పేరుకుపోయి ఉండటం దురదృష్టకరమన్నారు.
అల్లూరి సీతారామరాజు వంటి మహానీయుడి విగ్రహానికి కనీస గౌరవం కూడా దక్కడం లేదని, ఇది ఆ మహానుభావుడికి చేసిన అవమానమేనని బొంతు రమణ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి విగ్రహం పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు, శాశ్వత సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.
అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించి విగ్రహానికి తగిన గౌరవం కల్పించాలని, లేదంటే ప్రజా ఉద్యమానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయంలో సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా తోటాడ హైస్కూల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**మునగపాక, జనవరి 12, మనసులో మాట..** వివేకనంద జయంతి సందర్భంగా తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో అంగరంగ వైభవంగా వారం రోజుల నుంచి జాతీయ యువజన ఉత్సవాలను1992- 93 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 18 సంవత్సరాల నుంచి ఈ ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుంది. 2008 వ సంవత్సరంలో విగ్రహం స్థాపించి పిల్లలను ఉత్సాపరచడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తోటాడ సర్పంచ్ శ్రీ దొడ్డి మంగ వేణి కోటేశ్వరావు గారు తోటాడ ఎంపీటీసీ శ్రీ కే వెంకటలక్ష్మి గారు స్కూల్ కమిటీ సభ్యులు మరి పంచాయతీ వార్డు సభ్యులు దొడ్డి రమేష్ గారు స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు గొన్న బత్తుల కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ దొడ్డి మంగ వేణి కోటేశ్వరావు గారు గత 18 సంవత్సరాల నుంచి ఈ విధంగా చెయ్యడం ఎంత ఆనందంగా ఉందని స్కూల్ అభివృద్ధిలో ఈ బ్యాచ్ పాలు పంచుకోవడం బాగుందని తెలియజేశారు. తోటాడ ఎంపీటీసీ కే వెంకటలక్ష్మి గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరీ విధంగా చేయడం ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా ఉంటుందని తెలియజేశారు . దొడ్డి రమేష్ మాట్లాడుతూ అలాగే కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 1992బ93 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు అంగులూరి రామకృష్ణ పలమరిశెట్టి వీర అప్పారావు మద్దాల నర్సింగరావు కోయిలాడ నరసింహారావు ఆడారి రామలింగేశ్వరరావు ఎర్ర కృష్ణంరాజు కొయ్య గోవింద ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పూర్వ విద్యార్థుల తరఫున ఆళ్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించడం జరిగింది.

## ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం ఆత్మీయ సమావేశం



**అనకాపల్లి రూరల్, జనవరి 12 మనసులో మాట..** ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ ఎస్టీ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశం (కలయిక) సోమవారం అనకాపల్లి బొజ్జన్న కొండ ప్రాంగణంలో జరిగింది. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి వారంతా నివాళు లర్పించారు. జిల్లా ప్రతినిధులు గాదం సామ్సన్ చక్రవర్తి, పల్లా బాబ్జీ ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లా లోని పలు ప్రాంతాల నుంచి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భీమ్ సేన ప్రతినిధులు రవి సిద్ధార్థ, బండి హేనా, పండిత పరిషత్ అధ్యక్షులు దయానంద్, పెంటాద్రి, నక్కా శ్రీనివాస్, రాణి తదితరులు పాల్గొన్నారు.

## నయనమ్మపాలెం ఎస్సీ జడ్ కాలనీలో భారీవాహనాల దుమ్ముతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు

**అచ్యుతాపురం జనవరి 12 మనసులో మాట:** మండలం లో నయనమ్మపాలెం ఎస్సీ జడ్ కాలనీలో నిరంతరం భారీవాహనాల రాకపోకల కారణంగా కాలనీ మొత్తం దుమ్ము దూళితో కమ్ముకుంది. ఈ దుమ్ము ప్రభావంతో కాలనీ వాసులు శ్వాసకోశ సమస్యలు, దగ్గు, కంటి మంటలు, చర్మ అలర్జీలు వంటి అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీ మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో సరైన రోడ్లు లేకపోవడం, రోడ్లపై నీరు చల్లకపోవడం వల్ల పరిస్థితి రోజు రోజుకు మరింత దారుణంగా మారుతోంది. దుమ్ము కారణంగా ప్రజలు ఇళ్లలో కిటికీలు, తలుపులు కూడా తెరవలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే భారీవాహనాల రాకపోకలను నియంత్రించాలి, రోజూ రోడ్లపై నీరు చల్లాలి, శాశ్వత రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



## హైకోర్ట్ ఆదేశాలు బేఖాతరు...

### కోడిపందాలు నిర్వహణకు భారీఏర్పాట్లు

**ఎస్. రాయవరం, జనవరి 12,(మనసులో మాట):** కోడిపందాలు, జూదంనిరోధంపై ఎపి హైకోర్ట్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికి స్థానిక కూటమినేతలు అధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్. రాయవరం, నక్కపల్లి మండలాల్లో కోడిపందాలు, జూదం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసారు. మూడురోజులుపాటు పందాలు నిర్వహించేందుకు పోలీసులుతో ఒప్పందం కుదిరినట్లు జోరుగాప్రచారంసాగుతుంది. పందాలు నిర్వహణకు ఇప్పటికే హోంమంత్రిగ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. జూద, జంతుహింసనిరోధక చట్టంఅమలు చేయాలంటూ హైకోర్ట్ ఇప్పటికే అధికారులుకు సూచించింది. అవసరమైతే 144 సెక్షన్ ఉపయోగించాలంటూ కోర్ట్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో పందాలు నిర్వహణకు ఏర్పాట్లు చేయటంతీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

## ప్రజా కళాకారులు, ప్రజా నాయకులు బుద్ధ శ్రీనివాసరావు వర్ధంతి



**అనకాపల్లి టౌన్ జనవరి 12 మనసులో మాట..** అనకాపల్లి ప్రాంతంలో ప్రజా కళాకారునిగా వివిధ ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేసి ప్రజానాట్యమండలి నాయకులు కామ్రేడ్ బుద్ధ శ్రీనివాసరావు ఆరవ వర్ధంతి, సభ సిఐటియు కార్యాలయంలో నేడు జరిగింది. శ్రీనివాసరావు చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు రైతు నాయకులు కాండ్రేగుల సదాశివరావులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతంలో జానపద కళాకారులు, భజన కళాకారులు, డప్పు కళాకారులు సమస్యలపై అనేక ఉద్యమాలు చేసిన శ్రీనివాసరావు మరణం ఈ ప్రాంతంలో కళాకారులకు తీరనిలోటని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ల తాలయ్యబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పొలిమేర అప్పలనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించిన కరణం ధర్మశ్రీ



**మునగపాక, జనవరి 12, మనసులో మాట..** మునగపాక శ్రీ గౌరీ పరమేశ్వరుల దేవస్థానం గౌరవాధ్యక్షులు స్వర్గీయ పొలిమేర అప్పలనాయుడు (దత్తుడు) ఆదివారంవృద్ధాప్యం కారణంగా 94 సంవత్సరాల వయసులో స్వర్గస్తులైనారు .వారి కుటుంబ సభ్యులను సోమవారం ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పరామర్శించడానికి వారి ఇంటికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుమారుడు మాజీ రైతు సంఘం అధ్యక్షులు పొలిమేర పూర్ణచంద్ర గణేశ్వర రావు మరియు వారి కుటుంబ సభ్యులు పొలిమేర కృష్ణ , పొలిమేర ఆదిసూరి అప్పారావుని పరామర్శించడం జరిగింది. ధర్మశ్రీ గారితో పాటు రాంపల్లి ఎక్స్ ఎంపీపీ తిరుపతిరావు , మునగపాక మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు , మాజీ మండల అధికార ప్రతినిధి ఆడారి కాశి బాబు, రామకృష్ణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద ఆశయాలను పాటించాలి



**కె..కోటపాడు, జనవరి 12( మనసులో మాట):** స్వామి వివేకానంద బోధనలు, ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో పాటించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలమంచిలి ధర్మారావు పిలుపునిచ్చారు. కే.కోటపాడు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కే.కోటపాడు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ చీపురుపల్లి రామారావు హాజరై వివేకానందుని జీవిత విశేషాలను గుర్తు చేశారు. అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ మాడుగుల నియోజకవర్గం సెక్రటరీ వేగి రామారావు మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు శాశ్వత ఆదర్శమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకొని దేశ ప్రగతి, అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ మాడుగుల నియోజకవర్గ ఉపాధ్యక్షులు కుబిరెడ్డి సన్నిబాబు, సభ్యులు ఎం. అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## 16న బాల సన్యాసమ్మ తీర్థ మహోత్సవం

**రాంబిల్లి జనవరి1, (మనస్సులో మాట )** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, ఉత్తరాంధ్ర భక్తి కోటి కల్పతరువు శ్రీ బాల సన్యాసమ్మ పేరంటాల వారి తీర్థ మహోత్సవం ఈ నెల 16న గురువారం అత్యంత వైభవముగా జరిగేందుకు సర్పంచ్ అగ్రహారపు ఆదిలక్ష్మ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాట్లలో నిమగ్నమై ఉంది. ఆలయ ప్రాంగణం చుట్టుప్రక్కల భారీ విద్యుత్ దీప అలంకరణ చేశారు. శ్రీ బాల సన్యాసమ్మ జీవిత గాధ చాలా దయనీయంగా స్త్రీ మూర్తులకు ఆదర్శంగా పుట్టింటికి మెట్టింటి కి గౌరవాన్ని నిలిపేదిగా ఉండి ఆనాటి ఆచార సంప్రదాయాలను నిలబెట్టిన సతీ సహగమనం చేసిన ప్రతివ్రత. శ్రీ బాల సన్యాసమ్మ పేరంటాలను జిల్లాలో నలుమూలల నుండిభక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. బాల సన్యాసమ్మ ఆరుగురు అన్నలు తర్వాత ఏడవ సంతానంగా పుట్టిన ఏడాదికే తల్లి ఆరు ఏళ్లకే తండ్రి కోల్పోయి ఆ బాల పెద్దన్న రామునాయుడు వదినమ్మ పోషన్లో శ్రీ బాల సన్యాసమ్మ నాటక ప్రదర్శనను దిమిలి గ్రామానికి చెందిన కోవిల వెంకట్రావు మాస్టారు ఆధ్వర్యంలో బాల సన్యాసమ్మ నాటకం పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చి ఆమె దివ్య గాధను ప్రచారంలోకి తీసుకువచ్చారు.



# ధనుర్మాసోత్సవాలు

**విజయనగరం (మనసులోమాట) జనవరి 12:** పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీకళ్యాణవేంకటేశ్వర స్వామిఆలయంలో ధనుర్మాసోత్సవాలు శ్రీశ్రీనివాస సేవాసంఘంఆధ్వర్యంలో వైభవంగాజరుగుతున్నాయి. భోగి పండుగ రోజున జరుగు గోదా కళ్యాణంని ర్వహిస్తున్నారు. ఈకార్యక్రమాలలోభాగంగా ఆలయం ప్రధాన ముఖద్వారంనుండి ఆలయంలోని వేదికవరకు ఉదయం మహిళలు గోదాదేవికి మంగళవాద్యాల నడుమ సారె సమర్పించారు. ఆలయప్రధధాన ఐర్చకులు పీసపాటి శ్రీమన్నారాయణాచార్యులు, రఘునాథాచార్యులు అమ్మవారికి నీరాట్టం చేసారు. ఈకార్యక్రమంలో సేవాసంఘం ఉపాధ్యక్షుడు ఏ. శివరామక్రుష్ణ, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో ఉదయం స్వామివారికి సేవాకాలం, పూజలు నిర్వహించారు. గోదాదేవికి ప్రత్యేక అలంకరణలుచేసారు. భక్తులు అధిఖసంఖ్యలో విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సబ్బవరం లో పోర్టు ఉద్యోగుల ఆత్మీయ కలయిక



**సబ్బవరం , జనవరి 12, మనసులో మాట:** సబ్బవరం మండల కేంద్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణం దండుకోనేరు గట్టుపై విశాఖపట్నం పోర్ట్ ఉద్యోగులు, దాని అనుబంధ సంస్థలు, పూల్ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు ఆత్మీయ కలక ఆదివారం ఆనందంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రో మాల, దేవుడు మాట్లాడుతూ, 1984 కు ముందు నుంచి కోర్టులో పనిచేస్తున్న సంపవరం మండల ప్రాంత ఉద్యోగులు, , పెన్షనర్లు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. గతంలో పోర్టు సహకారంతో నిర్మించిన పెదనాయుడుపాలెం పాత రోడ్డు మలుపు వద్ద శిథిలావస్థకు చేరిన పోర్టు ఉద్యోగుల విశ్రాంతిభవనం, బస్ స్టాప్ భవనాలు జీర్ణావస్థకు చేరుకున్నాయని గుర్తు చేశారు. తమ ఉద్యోగుల సంఘాలకు పూర్వ వైభవం రప్పించేందుకు, అందరి నీ ఒక చోట చేర్చి విశ్రాంత ఉద్యోగులకు సహా వైద్య సేవ లాంటి అనేక కార్యక్రమాలు సబ్బవరం కేంద్రంగా జరపాలని, పోర్టు యాజమాన్యం దృష్టికి శిధిలావస్థకు చేరిన భావన సంగతి చెప్పి వారి సహకారంతో అవసరమైతే తమ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ తో కొత్త భాగం నిర్మిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పోతల సత్యనారాయణ, రోమాల దేవుడు, సబ్బవరపు వరాహ నరసింహమూర్తి, బెయిలు పూడి శ్రీరాములు, గొర్లి సత్యనారాయణ, మిడతాడా ఈశ్వరరావు, గండి శ్రీరాములు,వెంకటరమణ, గొంప అప్పలనాయుడు, గొంప చిన్న,తది తరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

### ప్రమాదానికి నిద్రమత్తే ప్రధాన కారణం



**హుకుంపేట, జనవరి 12 (మనుసులో మాట)..** హుకుంపేట మండల కేంద్రంలోని రాళ్లగడ్డ వద్ద సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఓ కారు ప్రమాదానికి గురైంది. ఒరిస్సా నుంచి ఎలమంచిలి వెళ్తున్న కారు విద్యుత్ స్థంభాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఒరిస్సా నుంచి సొంత ఊరు ఎలమంచిలికి కారులో ప్రయాణిస్తున్న సత్యనారాయణ (65), ఆయన భార్య సత్యవతి, వారి మనవరాలు గీతిక (3) ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కారు నడుపుతున్న సత్యనారాయణకు రాత్రి సమయంలో నిద్రమత్తు రావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రమాద సమయంలో కారు పైకి విద్యుత్ స్థంభం కూలిపోవడంతో కారులో ఉన్నవారిని బయటకు తీసేందుకు స్థానికులు భయపడ్డారు. అయితే అరకు నుంచి హుకుంపేట వైపు వస్తున్న హుకుంపేటకు చెందిన బట్టల వ్యాపారి శివాజీ తన ప్రాణాలను పణంగా పెట్టి సాహసోపేతంగా గాయపడిన వారిని రక్షించారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

# అనకాపల్లి జిల్లా లో మధ్యవర్తి శిక్షణ పొందిన డాక్టర్ దొడ్డి చంద్రశేఖర్

## విశాఖ పోలీస్ కమిషనర్ శంఖ్ బ్రతబగ్చీ చే చంద్రశేఖర్ కు ప్రశంసాపత్రం అందజేత



**అనకాపల్లి, జనవరి 12 (మనసు లో మాట):** వివాద పరిష్కార రంగంలో అనకాపల్లి జిల్లా మరో ముఖ్యమైన మైలురాయిని సాధించింది. డాక్టర్ దొడ్డి చంద్రశేఖర్ అనకాపల్లి జిల్లాలో మొట్టమొదటి అధికారికంగా శిక్షణ పొందిన మధ్యవర్తి గా నిలిచారు. విశాఖపట్నం లోని డాల్ఫిన్ హోటల్ లో శిక్షణ సమావేశం జరిగింది. ఈ తొలిసారి నిర్వహించిన మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమంను కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సి ఆర్ సి) వారు ఐఎంసి సహకారంతో నిర్వహించారు. ఈ శిక్షణను అంతర్జాతీయ స్థాయి ఆర్బిట్రేటర్ మరియు మధ్యవర్తి ఎ. జె. జవాద్ మరియు వారి బృందం సమగ్రంగా నిర్వహించారు. సర్టిఫికెట్ ప్రదాన కార్యక్రమం (వాలెడిక్టరీ సెరిమనీ) అనేక ప్రముఖుల ఆశీస్సులతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు జిల్లా న్యాయమూర్తి, విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ్ బ్రత బాగ్చి (డీజీపీ ర్యాంక్), వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ, పలువురు సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణులు మరియు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దొడ్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కీలకమైన మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే కి కృతజ్ఞతలు తెలియజేశారు. అనకాపల్లి జిల్లా ప్రజలకు వివాదాలను ప్రో బోనో (ఉచిత సేవలుగా) మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. జిల్లాలో శాంతియుత, వేగవంతమైన మరియు తక్కువ ఖర్చుతో వివాద పరిష్కారానికి మార్గం చూపే కీలక అడుగుగా నిలిచిందన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా ముగిసిన

# జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

### - ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో విజేతగా నిలిచిన అనకాపల్లి జట్టు





**నర్సీపట్నం రూరల్, జనవరి 12, ( మనసులో మాట) :** నర్సీపట్నంలో జనసేన పార్టీ నాయకుడు అప్పన ఎన్ ఎస్ జి దొరబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడా సంబరాలలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిసాయి. ఉత్సాహంగా సాగిన ఈ పోటీలలో అనకాపల్లి, నర్సీపట్నం మురళి వారియర్స్ జట్లు ఫైనల్ కు చేరుకోగా, ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరులో అనకాపల్లి జట్టు విజయం సాధించి జిల్లాస్థాయి విజేతగా నిలిచింది. నర్సీపట్నం మురళి వారియర్స్ టీం రన్నరప్ గా నిలిచింది. మూడో స్థానంలో నర్సీపట్నం కి చెందిన మరో జట్టు, నాలుగో స్థానంలో గాజువాక జట్టు నిలిచాయి. విజేత అనకాపల్లి జట్టుకు జనసేన నాయకుడు అప్పన దొరబాబు, మున్సిపల్ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మీసాల సుబ్బన్న ట్రోఫీని అందించారు. ముందుగా ప్రకటించినట్లుగా విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, మూడు రోజులపాటు జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయని, ఈ పోటీలు వీక్షించడానికి నర్సీపట్నం ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ ప్రేరణతో జనసేన పార్టీ తరఫున రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్, కొప్పాక కళ్యాణ్, అప్పన సురేష్, మారిశెట్టి రాజా, గొప్ప కృష్ణ కుమార్, బైన మురళి, లంక సతీష్, పోతల గణేష్, లంక సత్యనారాయణ, నిద్ర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగునికి నెలసరి రేషన్

## అందించిన మాతృభూమి సేవా సంఘం పట్టణ అధ్యక్షులు గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షులు అలక రాజు



**అనకాపల్లి టౌన్ జనవరి 12 మనసులో మాట..** పలు సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేస్తున్న మాతృభూమి సేవ సంఘం తరపున ఒక దివ్యంగునికి నెలసరి రేషన్ అందించారు . సేవా సంఘం పట్టణ అధ్యక్షులు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు అలక రాజు, మాతృభూమి సేవా సంఘం సభ్యురాలు అనంతలక్ష్మి. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్వయం శక్తితో బ్రతకాలని కళ్ళు కనిపించకపోయినా ట్రైన్లో చిన్న చిన్న వస్తువులు అమ్ముకొని బ్రతికే రాజు కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు వల్ల ఇల్లు గడవటానికి ఇబ్బందిగా ఉందని వారి సమస్య మాతృభూమి సేవా సంఘం సభ్యురాలు అనంత లక్ష్మి ద్వారా తెలుసుకొని ఒక నెల రేషన్ వారికి సోమవారం అందజేయడం జరిగింది అని తెలిపారు. తను మొన్న జరిగిన డీఎస్సీ పరీక్ష త్రుటిలో తప్పింది అయినా పట్టు వదలకుండా మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తాను అని చెప్పాడు అన్నారు. అతని ప్రయత్నం ఫలించి ఉద్యోగం వస్తె వారి సమస్యలు తీరుతాయి అని చెప్పాడు. వారి ఆశయం నెరవేరుటకు ఎల్లప్పుడూ మాతృభూమి సేవాసంఘం తోడుగా ఉంటుందని ఈ సందర్భము గా మనందరి తరపున మాట ఇవ్వడం జరిగింది అని రాజు అన్నారు. కార్యక్రమము లో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నాయకుడు ఎం అప్పలరాజుపై

# అక్రమంగా పెట్టిన పి.డి. చట్టాన్ని ఎత్తివేయాలి

### - రైతు, కార్మిక సంఘాలు ఆందోళన



**అనకాపల్లి టౌన్, జనవరి 12, మనసులో మాట..** అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం అపాలని కోరుతూ సోమవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్ లో అఖిల పక్ష కార్మిక, రైతు సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎస్ కె ఎం జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, ఎఐటియుసి నాయకులు ఆర్ దొరబాబు లు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా రైతు నాయకుడు ఎం. అప్పలరాజుపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా పి. డి. చట్టం పెట్టి 2025 డిసెంబర్ 24 నుండి విశాఖ సెంట్రల్ జైలు నిర్బంధించింది. గంజాయి వ్యాపారులు, మానవ అక్రమ రవాణా చేసే వ్యక్తులు, భూ కబ్జాదారులు, గూండాలు, రౌడీలపై పెట్టాల్సిన పీ.డీ. చట్టాన్ని రైతు నాయకుడు ఎం. అప్పలరాజు పై ప్రయోగించి జైల్లో నిర్బంధించటాన్ని ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ వల్ల సముద్ర తీర ప్రాంతం కాలుష్య కారకంగా మారుతుంది. మత్స్య సంపద దెబ్బతింటుంది. మత్స్యకారులు ఉపాధి కోల్పోతారు. ప్రజలు, రైతుల ఆమోదం లేకుండా వ్యవసాయ భూములను పరిశ్రమల నిర్మాణానికి తీసుకోకూడదని 2013 భూసేకరణ చట్టం చెపుతున్నది. దానికి విరుద్ధంగా మిట్టల్ స్టీల్ పరిశ్రమ కొరకు, నిస్సాన్ స్టీల్ కొరకు వ్యవసాయ యోగ్యమైన రైతుల భూములను బలవంతంగా తీసుకోవడాన్ని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. వారికి అండగా ఉన్నాడన్న కక్షతో రైతు నాయకుడు అప్పలరాజు పై ప్రభుత్వం పి.డి.చట్టాన్ని ప్రయోగించింది.

విశాఖపట్నం లో విద్యార్థి సంఘాల కార్యకర్తలపై రౌడీ షీట్ ఓపెన్ చేశారు. ఈ రకంగా అనకాపల్లి జిల్లా రైతు నాయకుడు అప్పలరాజు పై పెట్టిన పి. డి. చట్టం, ఏలూరు జిల్లా ఇనుమూరు గిరిజనులపై అక్రమంగా పెట్టిన కేసులు, విద్యార్థులపై పెట్టిన రౌడీషీట్ అన్నింటిని ఎత్తివేయాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని అపాలని ప్రజాసంఘాల తరపున మీ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, గండి నాయనబాబు, రైతు నాయకులు ఆర్ శంకర్రావు, ఐద్వా నేత డి డి వరలక్ష్మి, ఎస్ బ్రహ్మాజీ, ఎఐటియుసి నాయకులు ఆర్ రాజు, ఎస్ వి నాయుడు, కాంగ్రేగుల సదా శివరావు, కాళ్ల తాళయ్య బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, సుభాషిణి, ఏ రాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## యువత వివేకానందుని మాటలు

# ఆదర్శంగా తీసుకోవాలి..

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగు జగదీశ్వరరావు

**అనకాపల్లి, జనవరి 12 , మనసులో మాట..** నేటి యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని అతని ఆశయ సాధనం కోసం నిరంతరం యువత కృషి చేయాలని, వారి అడుగుజాడల్లో నడవడం ద్వారా చక్కని భవిష్యత్తు సంస్కారం, విజ్ఞత, వివేకం, ఆదర్శంగా అలవాటు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. అక్కడ పాల్గొన్న వారిని ఉద్దేశించి నాగ జగదీష్ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న యువత గమ్యం చేరేవరకు వెనక్కి తిరిగి రాకూడదని స్వామీ వివేకానంద చెప్పిన మాటలను యువత పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. సోమవారం ఉదయం గొల్ల వీధిలో అడ్వకేట్ సాయి ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలు వేసి ఘనమైన నివాళులర్పించి పేదలకు నాగ జగదీష్ చేతుల మీదుగా బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోడి వెంకటరావు, కాంట్రేగుల సత్యనారాయణ, పి నాగ, టీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీల కార్మికులు

# పండగలో పస్తులా

### అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన



**అనకాపల్లి, జనవరి 12 మనసులో మాట..** జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద లోడర్స్ పారిశుధ్య కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బకాయిపడిన ఐదు నెలలు వేతనాలు వెంటనే ఇవ్వాలని, పండగతో పస్తులా, కాంట్రాక్టర్ దగ్గర పనిచేసిన కార్మికులందరికీ తీసుకోవాలని, అక్రమాల అప్పలకొండ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేయడం జరిగింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు క్యాబ్ వెహికల్ ని నిలుపుదల చేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకుంటే జీవిఎంసిలో లోడర్స్ కి 5 నెలలు బట్టి జీతాలు లేకపోవడంతో పండగతో పస్తులు ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది అన్నారు. పలు దపాలుగా అధికారులు దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఐదు నెలల నుంచి వేధించడం సరికాదన్నారు. అధికారులు కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకొచ్చి సమస్య పరిష్కార చేయవలసి ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం చేయలేదని గత్యంతరం లేక ఈ ఆందోళన చేపట్టడం జరిగిందని అన్నారు. కాంట్రాక్టర్ ఒక కార్మికుడికి రోజుకి 450 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా 300 రూపాయలు మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులను అక్రమంగా కాజేశాడు అన్నారు. అదేవిధంగా 2025లో ఫిబ్రవరిలో ఇద్దరును ఆగస్టులో ఒకరిని, సెప్టెంబర్ లో ఎనిమిది మందిని ఒక్కొక్కరు వద్ద 70వేలు రూపాయలు నుంచి 80 వేలు రూపాయలు అక్రమంగా వసూలు చేశారని, అయినప్పటికీ జీవిఎంసి అధికారులు చూసి చూడనట్లు వదిలివేయడం దుర్మార్గమన్నారు. నెలకి ఒక కార్మికుల నుంచి 3500 రూపాయలు నుంచి 4500 రూపాయల వరకు కోత పెట్టి 8000 రూపాయలు నుండి 9000 రూపాయలు మాత్రమే కార్మికులకి ఇవ్వడం జరిగిందని అన్నారు. వాస్తవంగా ఒకరికి 13500 రూపాయలు ఇవ్వాలన్నారు. ఇలా అక్రమంగా సుమారు 50 లక్షల రూపాయలు పేద కార్మికుల నుంచి కాంట్రాక్టర్ తో కలిసి కొంతమంది వ్యక్తులు కలిసి అక్రమాలకు పాల్పడినప్పటికి సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారన్నారు. అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్ పై జీవీఎంసీ ఉన్నత అధికారులు వెంటనే కేసులు పెట్టి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో మరింత ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్మికుల ఆందోళన పై సానుకూలంగా స్పందించిన జీవిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడంతో పాటు జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ తులసి, పారిశుధ్య సూపర్వైజర్ రవికుమార్ స్వయంగా పంపించి కార్మికులతో చర్చలు జరిపి కార్మిక సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ లోడర్ యూనియన్ అధ్యక్షులు ఎర్రంశెట్టి వరప్రసాద్, కార్యదర్శి సింగంపల్లి భారతి,బండ అప్పారావు పాల్గొన్నారు.

## కోనాం పీడర్ కు 24 గంటలు

# త్రీఫేస్ విద్యుత్తు ప్రారంభం



**చీడికాడ, జనవరి 12, (మనసులో మాట)..** మండలంలో అప్పలరాజుపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కోణం పీడర్ కు జిల్లా ఆర్డీఎస్ కన్స్ట్రక్షన్ డిఇ గౌరీ ప్రసాద్ సోమవారం ఖండివరంలో ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్తు విద్యుత్తు అందించడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు మండలంలో అన్ని గ్రామాలకు త్రీఫెస్ విద్యుత్తు అందించడానికి ఇప్పటికే లైన్లు వేస్తున్నము అన్నారు ముందుగా కోణం పీడర్ కు త్రీ ఫేసు విద్యుత్తు ప్రారంభం జరిగిందన్నారు త్వరలో అన్ని గ్రామాలకు త్రీఫేసు విద్యుత్తు గృహాలకు అందించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీఎస్ సెక్షన్ ఏడిఇ కిషోర్ బాబు వడ్డాది సెక్షన్ ఏడిఇ సురేష్ కుమార్ ఏఈ వెంకట్రావు ఎల్ ఐ భూషణం మండల లైన్మెన్ వరహాలు లైన్మెన్ సమర్పణ రావు కాంట్రాక్టర్ సకల శేషగిరి సిబ్బంది పాల్గొన్నారు

### రాజమండ్రిని క్రీడా హబ్ గా మార్చేందుకు

# తొలి అడుగు

- ఖేలో ఇండియా నిధులు రూ. 13.76 కోట్లు మంజూరు
- ఆ నిధులు మంజూరుకు ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కృషి
- తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీ
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎంపీ పురందరేశ్వరీల చిత్ర పటాలకు పాలాభిషేకం




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** నగరాన్ని క్రీడా హబ్‌గా మారుస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆ మేరకు కృషి చేస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ అన్నారు. నగరంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియాలో భాగంగా రూ. 13.76 కోట్లు మంజూరు చేయడమే అందుకు నిదర్శనమన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా కేంద్రం మంజూరు చేసిన 13.76 కోట్లతో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మించనున్న వీఎల్ పురం సమీపంలోని పాత లారీ స్టాండ్ స్థలంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరిల చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నక్కా దేవి, 23వ డివిజన్ ఇంచార్జ్, మార్కండేశ్వర స్వామి ఆలయం మాజీ చైర్మన్ యిన్నమూరి దీపు మాట్లాడుతూ దశాబ్దాల కల నెరవేరబోతోందన్నారు. సాంస్కృతికి రాజధానిగా విరజిల్లుతున్న నగరం క్రీడా హబ్‌గా కూడా మారబోతోందన్నారు. ఎవరూ సాధించలేని పని, తమ నాయకుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సాధించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ రాజమండ్రిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పిన మాట ప్రకారం మాట ఇవ్వడం కాదు... నెరవేర్చి చూపిస్తున్నారన్నారు. ఇదే నిజమైన నాయకత్వ లక్షణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి యువతకు, క్రీడాకారులకు ముందస్తు సంక్రాంతి కానుకగా ఈ నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాట ఇచ్చారు నిలబెట్టుకున్నారు.. "రాజమండ్రిని క్రీడా రాజధానిగా మారుస్తా, మల్టీపర్పస్ స్టేడియం కట్టి చూపిస్తా" అని ఎన్నికల సందర్భంగా ఆదిరెడ్డి వాసు ఇచ్చిన హామీ ఇప్పుడు అమలులోకి వస్తోందని, ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. మాట ఇస్తే నెరవేర్చడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే అసలెైన పరిపాలనకు నిదర్శనమన్నారు. ఎంపీ పురందరేశ్వరికి కృతజ్ఞతలు.. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి కృషిని ప్రత్యేకంగా చెప్పుకోవాలన్నారు. ఈ నిధులు మంజూరు కావడంలో ఎంపీ పురందరేశ్వరి చేసిన కృషి అసాధారణమని, ఢిల్లీలో ఆమె పట్టుదలతో చేసిన ఫాలోఅప్ వల్లే ఈ ఫలితం సాధ్యమైందన్నారు. గతంలో కొందరు రీల్స్ నాయకులను చూశాం..గతంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌కు పార్లమెంట్‌లో రీల్స్ చేయడం, క్యాట్‌వాక్‌లు చేయడం, పూలు జల్లించుకోవడంపైనే శ్రద్ధ ఉండేదని ఎద్దేవా చేశారు. రాజమండ్రికి నిధులు తేవడంపై నిజమైన పట్టుదల కనిపించలేదని విమర్శించారు. రోజా, బెెరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వచ్చి శిలాఫలకాలు వేశాక ఒక్క ఇటుక కూడా వేయకపోవడం వైఎస్సార్ సీపీ పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాజమండ్రి అభివృద్ధి రీల్స్‌లో కాదు, రియాలిటీలో చూపిస్తామనే సంకల్పంతోనే తమ నాయకుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బాధ్యతాయుతంగా ఎమ్మెల్యేగా తన పని చేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే ఖేలో ఇండియా నిధులు సాధించారని కొనియాడారు. పిల్ల రాజకీయాలు, పిల్ల సైకోలు చేసే చేష్టలను పట్టించుకోకుండా, కేంద్ర క్రీడా శాఖ, ఎంపీ పురందరేశ్వరి సహకారంతో నగర అభివృద్ధి కోసం పెద్ద స్థాయిలో కృషి కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. కాగా ఈ పాలాభిషేకానికి ముందుగా తెలుగు యువత నాయకులు, సభ్యులంతా నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా భారీ బెెక్ ర్యాలీ నిర్వహించుకుంటూ వీఎల్ పురం పాత లారీ స్టాండ్‌కు చేరుకుని పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాదిగా తెలుగు యువత నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




### ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల

## అమలులోవేగం పెంచండి..

**-జిల్లా ఇన్చార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వెలగపూడి సచివాలయం నుంచి నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం జిల్లా పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్ నుంచి ఈ సమీక్షా సమావేశంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్, జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశంలో వెల్లడించిన అంశాలను జిల్లా అధికారులకు తెలియ జేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని, ప్రజలకు నేరుగా లాభం చేకూరే విధంగా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా రెవెన్యూ, భూ సమస్యలు, లబ్ధిదారుల ఆధారిత పథకాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణ, డిజిటల్ సేవల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు తెలిపారు.ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని, సమస్యలను అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ దిశా నిర్దేశం చేశారు. ప్రతి శాఖ తమకు అప్పగించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలతో నేరుగా మమేకమై పనిచేయాలని అధికారులకు సూచించారు. సీఎం ఆదేశాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలన్నారు.

## నేడు జిల్లా స్థాయిలో సాంప్రదాయ క్రీడా పోటీలు

**- గోడప్రతిని ఆవిష్కరించిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** స్థానిక ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు (మంగళవారం) జిల్లా స్థాయి సాంప్రదాయ క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ పోటీలు మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి రాజమహేంద్రవరం నగరంలోని ప్రభుత్వ ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలతో ప్రజల్లో సాంస్కృతిక వారసత్వంపై అవగాహన పెంపొందించడం, శారీరిక దృఢత్వాన్ని పెంచడం లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, తూర్పు గోదావరి జిల్లా ఉత్తర్వుల మేరకు ఈ పోటీలను తూర్పు గోదావరి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నిర్వహించ నున్నట్లు జిల్లా క్రీడా అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ పోటీల్లో..మహిళలకు : స్కిప్పింగ్ రోప్ (తాడాట), తొక్కుడు బిళ్లపురుషులు – మహిళలకు : కర్రసాము, టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుడు), పురుషులకు..ఏడు పెంకులాట, గాలిపటాల పోటీలునిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి, అదనపు ఎస్పీ ఎల్ చెంచు రెడ్డి, ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, జిల్లా స్పోర్ట్స్ అధికారి డీఎంఎం శేషగిరి, పీఆర్వో ఎం లక్ష్మణా చార్యులు, డీఈవో కే వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.




### వైఎస్ ఎంపీపీ మైనరబాబుని పరామర్శించిన ఎంపీపీ శ్రీవల్లీ వీరబాబు దంపతులు

గోకవరం (మనసులో మాట), జనవరి 12 :రాజమండ్రి డెల్టా హాస్పిటల్ లో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ, కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ మడికి మైనర్ బాబుని గోకవరం మండల పరిషత్ అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లీ వీరబాబులు పరామర్శించారు. అలాగే మైనర్ బాబు యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మైనర్ బాబు కుటుంబ సభ్యులుకి ధైర్యం చెప్పడంతోపాటు ఏ సమయంలో ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని ఎంపీపీ దంపతులు శ్రీవల్లి వీరబాబు భరోసా ఇచ్చారు

### రాష్ట్ర మంత్రులు కార్యదర్శులతోని జిల్లా కలెక్టర్లతో

## సమీక్ష సమావేశం

**నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**




**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రులు, కార్యదర్శులతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. జీఎస్ డీపీ,10సూత్రాలు, కేంద్ర పథకాలు అమలు, పబ్లిక్ ప్రైవేట్ పార్టర్నర్ షిప్ కింద పెట్టుబడుల ప్రతిపాదనలు, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, ఉపాధిహామీ పథకం, తదితర అంశాలపై మంత్రులు, కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జిల్లాలలో మంజూరైన ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తిచేసేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ పథకాలకు మంజూరుచేసిన నిధులను ఈ నెలాఖరులోగా వినియోగించాలన్నారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇంచార్జి జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్,డి ఆర్ ఓ.జె.వెంకటరావు, జడ్పీ సీఈవో వి.లక్ష్మణరావు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కోలాహలంగా...

### డ్రాగన్ పడవల పోటీలు ప్రారంభం

**జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..**

కొత్తపేట, ( మనసులో మాట) జనవరి 12 ఆత్రేయపురం సంక్రాంతి సంబరాల్లో భాగంగా డ్రాగన్ పడవల పోటీలతో కోనసీమ వైభవం విశ్వవ్యాప్తం కానున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం డ్రాగన్ పడవల పోటీలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ శ్రీకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రేక్షకుల కోలాహలం మధ్య పడవల పోటీలు ఉత్సాహంగా మొదలయ్యాయి. కేరళలో సాంప్రదాయకంగా జరిగే పడవలపోటీలు మన కోనసీమలో సైతం నిర్వహించుకోవడం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయన్నారు. భవిష్యత్తులో కేరళ తరహాలో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నరు. అమలాపురం ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు, టిడిపి సీనియర్ నాయకులు మెట్ల రమణబాబు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ముల్లపూడి భాస్కరరావు పడవ పోడులను తిలకించారు.



# మహనీయులకు కలం వీరుల నీరాజనాలు

- వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- ఎంతో ఘనత గల 'రాజమండ్రి ప్రెస్ క్లబ్' కు గత వైభవం వచ్చేలా చేయాలని కోరిన జేఏసీ ప్రతినిధులు




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** రాజమండ్రి ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ రకాలుగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ' ఆదివారం 'మహనీయులకు నీరాజనాలు' కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా నగరంలోని వివిధ ముఖ్య కూడళ్ళ వద్ద నెలకొల్పిన మహనీయుల విగ్రహాలకు 'వినతి పత్రాలను' అందజేశారు. గణేష్ చౌక్ వద్దనున్న రాజమండ్రి ప్రెస్ క్లబ్ నుంచి ప్రదర్శనగా బయల్దేరి తొలుత స్థానిక గోకవరం బస్టాండు వద్దగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేశారు. అటు తర్వాత జాంపేట జంక్షన్ మహాత్మా గాంధీ విగ్రహానికి, నందం గనిరాజు జంక్షన్ వద్ద మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, గోదావరి గట్టున జ్యోతిరావు పూలే, డీలక్స్ సెంటర్ వద్ద పొట్టి శ్రీరాములు, చర్చిపేట ఎదురుగా బాబూ జగజ్జీవన్ రామ్, ధవళేశ్వరం లో వంగవీటి మోహనరంగా విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి వినూత్న తరహాలో జేఏసీ తమ నిరసనను తెలిపింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ చేబోలు రాజు, కన్వీనర్ డీ అబ్రహం లింకన్, కో కన్వీనర్ వీ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతగానో పాటుపడిన మహనీయుల స్ఫూర్తితో.. కొంతమంది స్వార్థపరుల కోరల్లో చిక్కి భ్రష్టుపట్టిన రాజమండ్రి ప్రెస్ క్లబ్ ను ఎలాగైనా కాపాడాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. న్యాయం కోసం, తమ ప్రధానమైన డిమాండ్ల సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలకు ఉపక్రమించిన విషయం తెలిసిందే అన్నారు. అయితే అధికారుల కోరిక మేరకు రిలే దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేశామని చెప్పారు. తమ ఆందోళనను మాత్రం విరమించలేదని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణలో భాగంగా "మహనీయుల కు కలం వీరుల నీరాజనాలు" కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎవరికైనా బైలా అంటే ఒక పవిత్రమైన గ్రంథం వంటిదని, అటువంటి బైలాలోని నిబంధనలను తుంగలోకి తొక్కి..ఆరేడేళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా గుత్తాధిపత్యం వహించడం దారుణం, క్షమించరాని నేరమే అన్నారు. ఏటా నిర్వహించాల్సిన ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా జరపకుండా.. ఒకరిద్దరు పెత్తందార్లుగా వ్యవహరిస్తూ మొత్తం మీడియా విలువలకు ఉప్పు పాతరేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్న లోపాలను ప్రభుత్వానికీ పాలకులకు ఎత్తి చూపే..పాత్రికేయ వ్యవస్థలోనే భరించరాని దుర్గంధం వస్తే ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. ప్రెస్ క్లబ్ పేరిట జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలకు అడ్డుకట్ట వేయకుంటే..కొన్నాళ్ళకు ప్రెస్ క్లబ్ నాదని కబ్జా చేసినా ఆశ్చర్యం లేదని, అంత వరకూ సమస్య శృతిమించకూడదనే ఉద్దేశంతో వర్కింగ్ జర్నలిస్టులు జేఏసీగా ఏర్పడి ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని చేబోలు రాజు, డీ అబ్రహం లింకన్, వీ రవికుమార్ తెలిపారు. న్యాయం కోసం ఆమరణ దీక్షలకైనా సిద్ధమే..ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, న్యాయమైన తమ డిమాండ్ల సాధన కోసం అవసరమైతే ఆమరణ దీక్షలు చేయడానికైనా సిద్ధమే అన్నారు. అయితే అధికారుల స్పందన చూస్తుంటే.. పరిస్థితి అంత వరకూ రాదనే అనుకుంటున్నా మన్నారు. ఏది ఏమైనా.. వారం పది రోజుల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. జాప్యం చేయకుండా.. పరిస్థితి చేజారకుండా ప్రెస్ క్లబ్ ను వెంటనే అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. లేకుంటే ప్రెస్ క్లబ్ కు, క్లబ్ పర్యవేక్షణలో ఉన్న నాలుగు దుకాణాలకు తాళాలు వేసి, ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని డిమాండు చేశారు. ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ కార్యకలాపాలు కొనసాగాలని, అర్హులైన పాత్రికేయులు అందరికీ సభ్యత్వాలు ఇవ్వాలని, రద్దుచేసిన సభ్యత్వాలను పునరుద్ధరణ చేయాలని, ఏడేళ్ళ జమా ఖర్చులపై సమగ్ర విచారణ చేయాలని జేఏసీ ప్రతినిధులు కోరుతున్నారు. ఈ నెల 18వ తేదీలోగా తమకు అధికారుల నుంచి స్పష్టమైన హామీ, ప్రక్షాళన దిశగా చర్యలు చేపడతారని ఆశిస్తున్నామని అన్నారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని, ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదని జేఏసీ చైర్మన్ చేబోలు రాజు, కన్వీనర్ డీ అబ్రహం లింకన్, కో కన్వీనర్ వీ రవికుమార్ తెలిపారు.

## క్షేమంగా ఉన్న సబ్బెళ్ళ కృష్ణారెడ్డి వెల్లడించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



**అనపర్తి (మనసులో మాట) జనవరి 12:** అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితిపై గత రెండు రోజులుగా కొన్ని పుకార్లు, వదంతులు ప్రచారంలోకి వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టంగా తెలియజేస్తున్నాం.సబ్బెళ్ళ కృష్ణారెడ్డి గుండెకు సంబంధించిన చికిత్సలో భాగంగా స్టెంట్ వేయించుకుని, వైద్యుల పర్యవేక్షణ అనంతరం ఆసుపత్రి నుంచి సురక్షితంగా డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఆయన వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యులు ఇచ్చిన సలహా ప్రకారం సుమారు మూడు నెలల విశ్రాంతి అవసరం. అనంతరం, గతంలోలాగే యథావిధిగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని తెలియజేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలియజేశారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారాలకు, అపోహలకు దయచేసి ఆస్కారం ఇవ్వవద్దని అందరికీ మనవి.



## నిబంధనలకు విరుద్ధంగా కోడిపందాలు నిర్వహిస్తున్న వారిని

# అరెస్టు చేయాలి

- రూ.13 లక్షలు పాట పెట్టుకుని కోడిపందాల నిర్వహించేందుకు ఏర్పాట్లు
- రాజానగరం పరిధిలో కోడిపందాలు ఆపకపోతే మహిళలతో అడ్డుకుంటాం
- హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉభయ రాష్ట్రాల చైర్ పర్సన్ ఖండవల్లి లక్ష్మీ హెచ్చరిక

రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:హైకోర్టు తీర్పును తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా కోడిపందాలు నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉభయ రాష్ట్రాల చైర్పర్సన్, టీడీపీ ఎస్సీ సెల్ మహిళా విభాగం కార్యదర్శి ఖండవల్లి లక్ష్మీ డిమాండు చేశారు. సోమవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలిసి కోడిపందాలు, జూదం, గుండాటలను నివారించాలని ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు సంతోషంగా జరుపుకుంటున్నారని అయితే కోడిపందాలు, జూదం, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వలన మహిళలకు తమ భర్తలు దూరం అవుతున్నారని పలువురు మహిళలు తనకు ఫిర్యాదు చేశారని వివరించారు. కోర్టు నిబంధనల ప్రకారం కోళ్లకు కత్తులు కట్టకుండా పందాలు వేయాలని నిర్బంధంలో ఉన్నప్పటికీ రాజానగరం పరిధిలో కొందరు టీడీపీ నాయకులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కోడిపందాలు, గుండాట నిర్వహించేందుకు ఏర్పాటు చేశారని అన్నారు. రూ.13 లక్షలకు పాట పెట్టుకుని కొబ్బరి కాయలు కొట్టి కోడిపందాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రాజానగరం నియోజవర్గం బరువులను దివాన్ చెరువు గ్రామంలోని కొందరు మహిళలు తన వద్దకు వచ్చి తన భర్తలు కోడిపందాలు గుండాట నిర్వహించడం వలన వేలాది రూపాయలు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. కోడి పందాలు నిర్వహించడం ఆపకపోతే మహిళలతో కలసి పందేలు జరిగే ప్రాంతంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా కోడిపందాలు నిర్వహిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## తాళ్ళరేవులో స్వామి వివేకానంద కు ఘన నివాళి



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 12:** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దేశం గర్వించదగ్గ మహనీయుడు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం తాళ్లరేవులో ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న వివేకానందుని విగ్రహానికి లైన్స్ క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రాజు మాట్లాడుతూ 39 సంవత్సరాల జీవిత కాలంలోనే యావత్ ప్రపంచాన్ని తన జ్ఞానంతో ప్రభావతం చేసిన మేధావి స్వామి వివేకానంద అన్నారు. ఆయన జయంతి ని "జాతీయ యువజన దినోత్సవం గా జరుపుకోవడం మన యువత చేసుకున్న అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఖతాళ్ళరేవు, కోరంగి కురంగేశ్వర లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సత్తెమ్మ తల్లికి వెండి శూలం బహుకరణ



**ముమ్మిడివరం (మనసులో మాట)** జనవరి 12:ముమ్మిడివరం మండలం సిహెచ్ గున్నేపల్లి లో వేంచేసి ఉన్న శ్రీ సత్తమ్మ తల్లి అమ్మవారికి అమలాపురానికి చెందిన తోరం రామం దంపతులు రెండు లక్షల 50 వేల రూపాయలు విలువైన వెండి శూలం అమ్మవారికి సోమవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రేపు అయ్యప్పస్వామి తిరువాభరణ మహోత్సవం

- బళ్ళ సత్యనారాయణ ఇంటి నుంచి ఊరేగింపు - మకర జ్యోతి దర్శనం
- ఈ ఏడాది ఒక లక్షా 45వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ
- పుష్కరాల నాటికి అందరూ సందర్శించేలా తీర్చిదిద్దుతాం - శ్రీ ధర్మ శాస్త్రా ఆధ్యాత్మిక కేంద్రం ధర్మకర్తల వెల్లడి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** పవిత్ర గోదావరి చెంతన దివంగత జక్కంపూడి రామమోహనరావు సంకల్పంతో రూపుదిద్దుకున్న అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతి యేటా మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వామి వారి ఆభరణాలతో తిరువాభరణ మహోత్సవం నిర్వహించ బోతున్నారు. శ్రీ ధర్మ శాస్త్రా ఆధ్యాత్మిక కేంద్రం ధర్మకర్తలు జక్కంపూడి విజయలక్ష్మి, చల్లా శంకర రావు, పొలసానపల్లి హనుమంతరావు, తదితరులు ఆలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ తన భర్త రామమోహనరావు సంకల్పంతో రూపుదిద్దుకున్న అయ్యప్ప ఆలయం ఎక్కడా లేని విధంగా జీవనది గోదావరి చెంతన ఉండటం గొప్ప విషయమన్నారు. శబరిమలై అయ్యప్ప సన్నిధి తరహాలో ఇక్కడ కూడా కార్యక్రమాలు చేస్తున్నామని, ముఖ్యంగా సంక్రాంతికి తిరువాభరణ మహోత్సవం, జ్యోతి దర్శనం కూడా జరిపిస్తున్నామని ఆమె గుర్తుచేశారు. జనవరి 14 న ఉదయం స్థానిక ప్రకాశ్ నగర్ లోని తమ నివాసం దగ్గర తిరువాభరణాలకు పూజలు నిర్వహించి, మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రకాశ్ నగర్ దానవాయి పేట.. బైపాస్ రోడ్డు లోని బళ్ళ సత్యనారాయణ స్వామి, రాధామాధవి దంపతుల ఇంటి నుండి తిరువాభరణాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు విజయలక్ష్మి చెప్పారు. కేరళ పంచారి మేళం వాయిద్యాలు, కోలాటం, డోలు సన్నాయి, మేళ తాళాలు, మాలధారులైన స్వాములతో ఊరేగింపు బయలుదేరుతుందని తెలిపారు. నగరంలోని జాంపేట, నందం గనిరాజు జంక్షన్, కంబాల చెరువు జక్కంపూడి చౌక్, దేవీ చౌక్, లక్ష్మీవారపు పేట, కోట గుమ్మం, మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, విశ్వేశ్వర స్వామి ఆలయం మీదుగా సాయంత్రం 6గంటలకు అయ్యప్ప ఆలయానికి చేరుకుంటారని వివరించారు. తిరువాభరణాలు 6.15 గంటలకు అలంకరిస్తారని అనంతరం దర్శనం 6.45 గంటలకు మకరజ్యోతి దర్శనం ఉంటాయని వివరించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. పుష్కరాల నాటికి మరిన్ని హంగులు సమకూర్చి ఈ ఆలయాన్ని అందరూ సందర్శించేలా తీర్చిదిద్దనున్నట్లు విజయలక్ష్మి చెప్పారు. చల్లా శంకరరావు మాట్లాడుతూ విజయ దశమి నుంచి సంక్రాంతి వరకూ అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తూ వస్తున్నామని, ఈ ఏడాది ఒక లక్షా 45వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించామని చెప్పారు. ఎంతో మంది దాతలు నగదు రూపంలో, చెక్కు రూపంలోనే కాకుండా పెరుగు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల రూపంలో విరాళాలు ఇచ్చారని ఆయన తెలిపారు. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకే కాకుండా శివమాల, దుర్గామాల, శ్రీ వేంకటేశ్వర స్వామి మాల ఇలా మాలధారణ చేసినవారందరికీ ఉచితంగా భోజన వితరణ చేశామని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ తీసుకుని ఆఫీసు పైభాగంలో దాతల సాయంతో డార్మెటరీ నిర్మాణం చేపట్టారని, అలాగే అయ్యప్ప మాలధారణ సమయంలో శివాలయం లేదని భక్తులు భావించడంతో పొలసానపల్లి హనుమంతరావు సహకారంతో శివాలయం నిర్మించామని, అలాగే మన్యం బాబ్జి సౌజన్యంతో వీరభద్రుని ఆలయం కూడా నిర్మాణం అవుతోందని తెలిపారు. అలాగే దుర్గాదేవి ఆలయం కూడా నిర్మించనున్నట్లు తెల్పారు. పొలసానపల్లి హనుమంతరావు మాట్లాడుతూ దివంగత జక్కంపూడి రామ్మోహనరావు సంకల్పంతో రూపుదిద్దుకున్న ఈ ఆలయంలో ధర్మకర్తగా ఉండటం తాను చేసుకున్న అదృష్టమని అన్నారు. కృష్ణా జిల్లా ఉంచి వంటవాళ్ళను తీసుకొచ్చి శుచిగా, శుభ్రంగా భక్తులకు అనువైన భోజనాన్ని అందించామని తెలిపారు. బళ్ళ సత్యనారాయణ మాట్లాడుతూ తన ఇంటి నుంచి తిరువాభరణ మహోత్సవం నిర్వహించే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు విరాళాలు .. ఈ సందర్భంగా అన్నదానానికి సీమకుర్తి మదన్ కిషోర్ రూ. 51,116 లు విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అలాగే సబ్బెళ్ల జనార్ధన రెడ్డి మణిమాల దంపతులు రూ.50 వేల విరాళం ప్రకటించి, తొలి దశలో రూ.25 వేలు అందజేశారు. అదే విధంగా తుమ్మలపల్లి కళ్యాణ్ చక్రవర్తి తరపున రూ.50 వేలు విరాళం ప్రకటించి, ముందుగా రూ.25 వేలు శ్రీనివాస్, పుష్పవతి దంపతులు అందజేశారు. వంటమాస్టర్ శ్రీకాంత్ కి సత్కారం .. దసరా నుంచి భక్తులకు శుచిగా, శుభ్రంగా భోజనం వండినందుకు వంట మాస్టర్ శ్రీకాంత్ ని దుశ్శాలువాతో సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. చల్లా శంకరరావు తనవంతుగా రూ. 5 వేలను బోనస్ గా అందజేశారు. వాలంటరీగా సేవలు చేసిన వాళ్లకు శంకరరావు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. 13న అయ్యప్ప పడిపూజ ... కాగా ఈ నెల 13న గురు స్వాముల ఆధ్వర్యంలో ఆలయం దగ్గర అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించనున్నట్లు ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. పెద్ద ఎత్తున స్వాములు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇమంది మోహనరావు, చలపతి గురుస్వామి, అయ్యల గోపి, దవులూరి రామకృష్ణ, మన్నె సుబ్బారావు, బాలనాగు సుభాష్, పిచ్చుక సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు

# శారీరక దృఢత్వాన్ని పెంచుతాయి

- క్రీడాకారుల క్రీడా దుస్తులకు రూ.20 వేలు ఆర్థిక సాయం
- దివ్యాంగులకు క్రీడా వీల్ చైర్స్ అందించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ధవళేశ్వరం గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ దివ్యాంగ బాస్కెట్ బాల్ అసోసియేషన్ యొక్క దివ్యాంగుల బృందం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో బెంగళూరుకు చెందిన హెచ్సీఎల్ సంస్థ వారికి 15 క్రీడా వీల్ చైర్ లను మంజూరు చేసింది. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ రాజవోలు హై స్కూల్ వద్ద గల బాస్కెట్ బాల్ గ్రౌండ్ లో దివ్యాంగ క్రీడాకారులకు ఎమ్మెల్యే గోరంట్ల చేతుల మీదుగా వీల్ చైర్స్ అందించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ అంగవైకల్యం అనేది శరీరానికే కానీ మనసుకు కాదని, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చు అన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అందిస్తోందని వాటితో పాటు ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. బెంగళూరుకు చెందిన హెచ్సీఎల్ సంస్థ ఒక వీల్ చైర్ రూ.45 వేలు విలువ ఉంటుందని.. అలాంటివి 15 మంది క్రీడాకారులకు సుమారు రూ.7 లక్షలు విలువ చేసే వీల్ చైర్లు అందించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాస్కెట్ బాల్ టీం సభ్యులందరికీ క్రీడా దుస్తులు నిమిత్తం వారికి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, నిమ్మలపూడి రామకృష్ణ, వల్లూరు చెంచురాజు, వాసిరెడ్డి బాబి, వల్లూరు శ్రీరామ్ చౌదరి, బండి గోపాలకృష్ణ, గాలి వెంకటేశ్వరరావు, చాపల వెంకటరావు, దివ్యాంగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ కుమ్మరి తాతాజీ, ప్రవీణ్, ఎంపీడీఓ సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎంఈఓ తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

## బదిర విద్యార్థుల కేరింతలతో

# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

- బదిర విద్యార్థులకు సంక్రాంతి కానుకగా రూ. 50వేలు అందించిన ఎమ్మెల్యే గోరంట్ల
- 'పలుకు' సంస్థ నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల, ఎమ్మెల్సీ వీర్రాజు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** స్థానిక స్వరాజ్య నగర్ సంకల్పమ్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బదిరుల ఆశ్రమ పాఠశాల స్థాపించి 15వ వార్షికోత్సవము, సంక్రాంతి సంబరాలు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాజ్యమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. వారితో పాటు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ముందుగా సంకల్పమ్ సర్వీస్ ఆర్గనైజేషన్ పలుకు ఆశ్రమం పాఠశాల యాజమాన్యానికి 15వ వార్షికోత్సవం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. "నేను నా జీవితంలో చాలా మంది స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలకు హాజరయ్యాను.. కానీ ఈ పలుకు నిర్వాహకులు ఒక చక్కని ప్రణాళికతో ప్రతి అంశాన్ని కూడా క్రమశిక్షణతో ముందుకు తీసుకువెళ్తూ పిల్లల భవిష్యత్తు కు కృషి చేస్తుంటారని, అందుకే రాజమహేంద్రవరం లో ఎన్ని స్వచ్ఛంద సంస్థలు ఉన్నప్పటికీ ఈ సంస్థ ప్రముఖ సంస్థగా గుర్తింపు తెచ్చుకుంద న్నారు. వీరికి ఎప్పుడు ఏ సాయం కావాలన్నా నేను ముందుంటానని, ఇటువంటి సంస్థలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సంక్రాంతి సందర్భంగా బదిర విద్యార్థులకు నేను కూడా రూ.50 వేలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ప్రతి ఒక్కరు కూడా సంస్థను ప్రోత్సహించాలని, ఈ సంస్థ మరింత మంచి పనులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, ఆత్రేయపురం గ్రామ సర్పంచ్ గెడ్డం సుధా, రొంపిచర్ల ఆంటోనీ, ఆళ్ల ఆనందరావు, పేరూరు గంగాధర్, అక్కిని ఆనంద్ బాబు, ఎడ్ల రమేష్, ఒంటెద్దు స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 12:** కే. జగన్నాథపురం గ్రామంలో స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు గని శెట్టి వెంకటేశ్వరరావు ( బాబీ) ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద 163 వ జయంతి ఉత్సవాలు జరిగాయి.బాబీ మాట్లాడుతూ యువతి, యువకులు వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు. స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు మరియు విద్యానిధి ప్రిన్సిపల్ సుధీర్,నాగ మాధవి దంపతుల సహకారంతోతదనంతరం గ్రామంలో పక్షవాతం తో బాధపడుతున్న కటికిదల బాలయ్య కుటుంబానికి భర్తను కోల్పోయిన కొప్పిశెట్టి దుర్గ కుటుంబానికి హిందూ ధర్మానికి కృషి చేస్తున్న తాడినాటి వెంకటేశ్వరరావు కుటుంబానికి ఒక నెలకు సరిపడే నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూరపరెడ్డి సురేష్, మల్లాది సూర్య మల్లికార్జునరావు, నల్లా సత్తిబాబు, యనమదల వెంకటరమణ, మోర్త సత్తిబాబు,మిద్దె నూతన రవిరాజు, గోలకోటి కృష్ణారావు నల్లా మణికంఠ,యర్రంసెట్టి కృష్ణ,శ్రీకాకుళపు రాధాకృష్ణ, మొగలి దుర్గారావు, నల్లా శ్రీరామ్, నల్లా చరణ్, భీమవరపు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## సిబ్బంది అంకితభావంతో

# పనిచేయాలి

- పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందజేసిన పీజీఆర్ఎస్ అర్జీలతో పాటు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో అందిన వినతులను ఆర్డీవో స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, సమగ్ర పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని స్పష్టం చేశారు.పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి, క్షేత్ర స్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపాలని, అర్జీలు మళ్లీ రీఓపెన్ అయ్యే పరిస్థితి రాకుండా చూడాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 2 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్ ద్వారా 3 దరఖాస్తులు, మొత్తం 5 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మంగారాణి నిత్య విద్యార్థిని

- విద్యా శాఖ జేడీ ఎస్ అబ్రహాం



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:స్థానిక లాలా చెరువు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయిని గా పనిచేస్తున్న మోటూరి మంగా రాణి నిత్య విద్యార్థినిగా.. నిరంతరం బోధనా నైపుణ్యాన్ని మెరుగు పరచుకుంటున్నారని విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) ఎస్ అబ్రహాం అన్నారు. స్థానిక వై జంక్షన్ లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో అబ్రహాం దంపతులు మంగా రాణిని సన్మానించారు. మంగారాణి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి అమరావతి వరకూ విద్యా శాఖ నిర్వహించే అన్ని శిక్షణా కార్యక్రమాలకూ రిసోర్స్ పెర్సన్ గా సమర్థవంతంగా విధులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, నవీన, తదితర వార్డు పెద్దలు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## హరి దాసులై...
## సంస్కృతి సారధులై

### సంక్రాంతి లో వీరి ప్రాధాన్యత అధికం

**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 12..** ధనుర్మాసం అంటేనే తెలుగువారి పండుగలకు ఆహ్వానం పలికే మాసం. దీనికి ప్రతీకగా పట్టణాల్లో, పల్లెల్లో హరిదాసుల సందడి ఉంటుంది. గలగల గజ్జెల చప్పుడు, అలరించే హరినామ సంకీర్తనలతో గ్రామాలకు సంక్రాంతి శోభ తెచ్చింది. శిరస్సుపై అక్షయపాత్ర ధరించి ఒక చేత్తో వీణ, మరో చేత్తో చిడతలు వాయిస్తూ హరినామ సంకీర్తనలను ఆలపిస్తూ సంచరించే హరిదాసులు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు. వారి గానం వినిపిస్తే చాలు ప్రతి ఇంటి ముందు అతివలు బియ్యం, పండ్లు, పూలతో వేచి ఉంటారు. హరిదాసు వస్తే శిరస్సుపై ధరించిన అక్షయపాత్రలో ఆ బియ్యం పోసి సాక్షాత్తు ఆ నారాయణుడే తమ ఇంటికి వచ్చినట్లు భావించి చేతులు జోడించి నమస్కరిస్తారు. ఇదంతా ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతి గ్రామంలో 33 రోజులపాటు కొనసాగుతోంది. సంస్కృతీ సంప్రదాయాలను ఇనుమడింపజేసే వారి వెనుక పడే కష్టం పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. కేవలం 33 రోజులు ఇలా హరిదాసులుగా తిరిగే వీరు మిగిలిన 11 నెలలపాటు సామాన్యుల్లా కాయకష్టం చేసి కడుపు నింపుకుంటారు. మోయలేని భారమైనా తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయాలను కొనసాగించాలనే పట్టుదలే వీరిని హరిదాసులుగా కొనసాగిస్తుందనడంలో సందేహం లేదు. కోనసీమ జిల్లాలో వంద మందికి పైగా హరిదాసులు పర్యటిస్తున్నారు.అక్షయపాత్రదే ప్రథమ స్థానం:కలశం లేదా అక్షయపాత్రగా పిలిచే ఆ పాత్రకు ప్రజలు అధిక ప్రాధాన్యమిస్తారు. ఈ పాత్రలో భిక్ష వేయడం ద్వారా నారాయణుడికి నైవేద్యం సమర్పించినట్లు భక్తులు భావిస్తారు. అదీ ధనుర్మాసంలో హరికి కొత్తగా పండిన ధాన్యాలు సమర్పించడం ద్వారా పాడిపంటలు అభివృద్ధి చెందాలని భక్తులు కోరుకుంటారు.నేను వారసత్వంగా మా తాతల కాలం నుంచి 20 ఏళ్లుగా హరిదాసుగా తిరుగుతున్నా. శ్రీమద్మారామణ గోవిందా హరి అనే హరినామమే మాకు ప్రాణం. విష్ణుమూర్తి స్వరూ పమైన హరికి దాసులుగా కొనసాగడం వల్లే మేము హరిదాసులుగా పేరు పొందాం. హరికి ప్రీతిపాత్రమైన ధనుర్మాసం, మాఘమాసంలో హరినామ సంకీర్తనలను ప్రసరింప చేస్తున్నాం. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల నుంచి మా సంకీర్తన ప్రారంభ మవుతుంది. ఇలా 33 రోజులు హరికి దాసులుగానే జీవిస్తాం. గ్రామాల్లో కొంత మార్పు వచ్చినా ఆదరణ బాగుంది.

## పెదపూడిలో కోలాహలంగా పల్లె పండగ



**పెదపూడి, (మనసులో మాట)జనవరి 12;** అనపర్తి నియోజకవర్గం మండల కేంద్రమైన పెదపూడి లో సోమవారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రిగా పల్లె పండగ కోలాహలంగా జరిగింది. ఒక కోటి 30 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు నిర్వహించారు. రాజుపాలెంలో గెద్దాడ రాంబాబు, పెదపూడి లో పుట్టా గంగాధర్ చౌదరి, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, అచ్యుతాపురంలో కార్యదర్శి తరుణ్, పెండెం అప్పన్న, కరకుదురు గ్రామంలో సానా శ్రీనివాసరావు, కరకుదురు దత్తుడు, రామేశ్వరంలో కుటికలపూడి సత్తిబాబు, కోలా సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిబాబు రాజు ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులు ప్రసన్నాంజనేయులు, తరుణ్, పెదపూడి కార్యదర్శి ప్రతాప్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు

### తెలుగు సాంప్రదాయాలు ఉట్టిపడేలా
# జగ్గంపేటలో సంక్రాంతి సంబరాలు

- రంగురంగుల ముగ్గులతో పండుగ సంబరాలకు ప్రత్యేక శోభ
- హాజరైన జ్యోతుల నెహ్రూ దంపతులు, జ్యోతుల నవీన్ దంపతులు
- ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేత





**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 12..** సంక్రాంతి అంటే మొదటగా గుర్తుకు వచ్చేది రంగవల్లులు, గొబ్బెమ్మలేనని, పల్లెల్లో సంక్రాంతి పనులు మొదలు అయ్యేది కూడా నెల ముగ్గు పెట్టడం తోనే అని, రంగవల్లులు భారతీయ సంస్కృతికి అద్దం పట్టేవిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. జగ్గంపేటలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల నృత్యాలు, భోగి మంటలు, రంగవల్లులు గొబ్బెమ్మలు, కోలాటాలు, కూచిపూడి నృత్యాలు ఇలా అన్ని రకాల సంక్రాంతి సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయ మానంగా జరిగింది. ఈ కార్యక్రమాలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు ప్రారంభించారు. మరో అతిథిగా జనసేన పార్టీ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ పూర్ణిమ, జగ్గంపేట మహిళా శక్తి ఆధ్వర్యంలో పిండివంటలు వండి ఎంతో చక్కగా ఏర్పాటు చేశారు తంటికొండ దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర ఆధ్వర్యంలో వచ్చిన వారందరికీ ప్రసాదం పంపిణీ, వివిధ వర్ణాలతో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులను ఆయనపరిశీలించారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి, పండుగ సంబరాలకు ప్రత్యేక శోభను చేకూర్చడానికి, తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడానికి ఈ సంక్రాంతి సంబరాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే అన్నారు.అనంతరం విజేతలకు, పాల్గొన్న వారందరికీ కన్సిలేషన్ బహుమతులను జ్యోతుల లక్ష్మీదేవి అందజేశారు. వివిధ రకాల కూచిపూడి నృత్యాలు, కోలాటాలు, బుర్రకథలు, ఉయ్యాలలు ఆహుతులను అలరించాయి. జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు కోడిపందాలు నిర్వహించి కోడిపందాలు సాంప్రదాయ క్రీడని దానిని కొంతమంది బెట్టింగ్ రాయుళ్లు జూద క్రీడగా మార్చారని అందరూ సంతోషంగా కుటుంబంతో సంక్రాంతి సంబరాలు నిర్వహించుకోవాలని ఎవరూ కూడా జూధాలకు పాల్పడవద్దని కోరారు. ఈ కార్యక్రమాన్ని నాలుగు మండలాల ఎంపీడీవోలు ఎంతో చక్కగా ఏర్పాటు చేసినందుకు వారిని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట జగ్గంపేట నియోజకవర్గం లోని తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నాయకులతోపాటు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఔషధ మాంత్రికుడు, నవయుగ ధన్వంతరి డాక్టర్ యల్లాప్రగడ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** ప్రపంచ మానవాళి ఆరోగ్యానికి ఆజన్మాంతం కృషిచేసి ఎన్నో రుగ్మతలకు ఔషదాలు కనిపెట్టిన నవయుగ ధన్వంతరి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అని ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ (హైదరాబాదు) ప్రొఫెసర్ డాక్టర్ ముద్దు సురేంద్ర నెహ్రూ అన్నారు. సోమవారం డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 131వ జయంతోత్సవం స్థానిక హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్ లో మ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్- రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సురేంద్ర నెహ్రూ మాట్లాడుతూ 1895 జనవరి12 జన్మించిన యల్లాప్రగడ తన జీవితమంతా దివ్యౌషధ అన్వేషణ కొరకే వెచ్చించారని, ఈయన కనిపెట్టిన టెట్రాసైక్లిన్, ఆరోమైసిన్, ఫోలిక్ యాసిడ్, హెట్రాజన్, మెథాట్రెక్సేట్ వంటి ఔషధాలతో నేటి వైద్య రంగానికే మార్గదర్శకుడయ్యారన్నారు. అలాగే నేటి కాలంలో ఎక్కువగా ఇబ్బంది పడుతున్న మధుమేహం గురించి చాలా అర్థవంతమైన వివరణ తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒకరు షుగర్ పేషెంట్ ఉన్నారని, వారికి ఏ విధమైన ప్రాథమిక వైద్యం అందించాలో తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ సతీష్ శర్మ మాట్లాడుతూ నేటి వైద్యులు డాక్టర్ యల్లాప్రగడను ఆదర్శంగా తీసుకుని సేవలందించాలని, ఆయన జీవితాన్ని మానవాళి కోసం త్యాగం చేసిన మహనీయులని అన్నారు. స్థానిక ఫస్ట్ ప్లస్ హాస్పిటల్ కు చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ బీఆర్ కళాధరరెడ్డి మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధులు గురించి వివరించారు. అత్యవసర సమయంలో చేసే ప్రాథమిక చికిత్సల గురించి వివరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ డాక్టర్ సురేంద్ర నెహ్రూ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో మధుమేహం పై ఎంతోమందికి అవగాహన కల్పించిన ఆయన రాజమండ్రి వచ్చి అవగాహన కల్పించడం చాలా అదృష్టం గా భావిస్తున్నామని అన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎన్ జయసూర్య, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యూ ప్రసాద్ బాబు, పశ్చిమ గోదావరి జిల్లా కోశాధికారి ఎం జితేంద్ర, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, ఏ సురేష్ బాబు, సుంకర శ్రీనివాస్, కోల లక్ష్మీనారాయణ, ఎం బాపూజీ, కేఎన్ రాజు లతో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

## నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించండి : డీఆర్వో



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా స్వీకరించిన అర్జీలు, అలాగే రెవెన్యూ క్లినిక్‌లో అందిన అర్జీలను సంబంధిత అధికారులు శ్రద్ధతో స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కార మార్గం చూపడంలో పూర్తి బాధ్యత వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్లను రెండు వేదికల ద్వారా నిర్వహించి అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్ లో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో మొత్తం 129 దరఖాస్తులు అందగా, వీటిలో హక్కుల రికార్డు (ఆర్ఓఆర్)కు సంబంధించి 50, రీ-సర్వేలో ఫిర్యాదులు 26, 22 (ఏ) నుండి తొలగింపు అభ్యర్థనలు 10, రీసర్వే (ఎస్ఎస్ఎల్ఆర్), భూసేకరణపై ఫిర్యాదులు చెరో 9, ఇతరాలు, ఆక్రమణలు చెరో 6, నమోదు సేవలు 3, ఎఫ్ రేఖలు (సరిహద్దు సమస్యలు) 2, అలాగే భూసేకరణ సమస్యలు, ఈనామ్స్, లంక భూముల సమస్యలు, రెవెన్యూ అధికారులపై ఫిర్యాదులు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడం (ఒకే సారి పరిష్కారం), ప్రభుత్వ భూముల సరిహద్దుల నిర్ధారణ, జీఎస్డబ్ల్యూఎస్, మీ సేవా (ఆదాయం) ఫిర్యాదులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 227 అర్జీలు స్వీకరించగా, వాటిలో శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ రెవెన్యూ క్లినిక్‌కు 129, పంచాయత్ రాజ్- గ్రామీణాభివృద్ధి 44, హోమ్ శాఖ 20, మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ, వ్యవసాయం, సహకారం, రవాణా, రోడ్లు-భవనాలు, పర్యావరణం, అటవీ, శాస్త్ర, సాంకేతికత శాఖలకు , ఫైనాన్స్ , పశు సంవర్ధకపాడి పరిశ్రమ అభివృద్ధిమత్స్య శాఖ, పరిశ్రమలు- వాణిజ్యం, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం తదితర శాఖలకు చెందిన 34 అర్జీలు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి, ఇతర జిల్లా అధికారులు స్వీకరించగా, రెవెన్యూ క్లినిక్ అర్జీలను జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి మహ్మద్ అలీ, ఎస్డీసీ భాగ్యవతి తదితర రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్వీకరించారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**అయినవిల్లి (మనసులో మాట) జనవరి 12:** స్వామి వివేకానంద జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రజ్ఞ 2026 పేరిట నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశారు. సోమవారం అయినవిల్లి మండలం నేదునూరు రావి ఫౌండేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో రావి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రావి బాల కృష్ణ బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రావి ఫౌండేషన్ లో విద్యార్థులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం రావి ఫౌండేషన్ లో కంప్యూటర్ విద్యలో పిజి డిసిఏ కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు పెద్దాపురం సీఐ ఆర్ అంకబాబు,కార్యదర్శి గొవ్వాల నాగరాజు సలాది శ్రీరామచంద్రమూర్తి అంగర శివ సాయి గౌడ్ కోయ్యాపు రామకృష్ణ అంబటి భీమరాజు సెక్రటరీ పాలగుమ్మి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మల్లి శాలలో వాలీబాల్ స్టేడియం

- ప్రారంభించిన జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్
సొంత స్థలంలో రెండు లక్షల అరవ వేల రూపాయలతో వాలీబాల్ స్టేడియం నిర్మించిన ఇంజరపు దుర్గ బాబు

**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 12..** జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో టిడిపి యువనేత ఇంజరపు దుర్గ బాబు తన సొంత స్థలంలో 2,60,000 రూపాయలతో ఫెడ్లైట్లతో, నెట్ కాంపౌండ్ వాల్ తో వాలీబాల్ స్టేడియం నిర్మించారు. ఈ స్టేడియం ను సోమవారం కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు,జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ప్రారంభించి యువతకు అంకితం చేశారు.అనంతరం యువత కు స్టేడియం నిర్మించిన దుర్గ బాబును నవీన్ అభినందించారు.ఈ సందర్భంగా దుర్గ బాబు, రేఖ బుల్లి రాజులు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడా స్ఫూర్తితో వాలీబాల్ ఆడుకుంటారని తద్వారా దేహ దృఢత్వం స్పోర్ట్స్ కోటాల ఉద్యోగాలు వంటి అవకాశాలు లభిస్తాయని ఈరోజు నా సొంత స్థలం లో రెండు లక్షల అరవై వేల రూపాయలతో ఈ స్టేడియం నిర్మించామని మా యువనేత జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, అత్తులూరి నాగబాబు, దేవరపల్లి మూర్తి, పల్లెకొండ భద్రం, సర్వసిద్ధి రాము,ఎస్సై టి. రఘునాథరావు, అత్తులూరి శ్రీనుబాబు, సియాదుల పెద్దకాపు, ఎస్ఎ గఫూర్, ఆకుమర్తి గణేష్, చింతా భద్ర రావు, వి సుబ్రహ్మణ్యం, కురుమళ్ళ శ్రీను, ఎన్ వీరబాబు, కొండేపూడి వెంకటరమణ, గానింకల లకు, కొండేపూడి భీమరాజు అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## మన శంకర వరప్రసాద్ సక్సెస్ తో జగ్గంపేటలో అభిమానుల సంబరాలు

- చిరంజీవి కటౌట్ కి పాలాభిషేకం చేసిన తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 12..** చిరంజీవి యాక్టింగ్, కామెడీ, డాన్స్ తో పాత చిరంజీవి ని చూసినట్టు ఉందని తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ఈ రోజు విడుదల అయ్యి బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడం తో జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో సినిమా థియేటర్ వద్ద అభిమానులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.ఈ సినిమా భారీ విజయం సాధించడంతో జనసైనికులు నాయకులు తో కలిసి థియేటర్ వద్ద స్వీట్స్ పంచి చిరంజీవి కటౌట్ కి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మన శంకర వరప్రసాద్ చిత్రం చాలా బాగుంది అని, ఫ్యామిలీ అందరూ కలిసి చూడవాల్సిన సినిమా అని, వెంకటేష్ కాంబో లో వచ్చే సీన్స్ చాలా బాగున్నాయ్ అని, ఫ్యాన్ బాయ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి అభిమానులు చిరంజీవి ని ఎలా చూడాలి అనుకుంటున్నారో ఆలా చూపించారని అన్నారు.ఈ కార్యక్రమం లో టౌన్ అధ్యక్షుడు గవర సుధాకర్,ఎంపీటీసీ దొడ్డా శ్రీను,కురుమల్ల నాగేశ్వరావు, భద్ర, కిర్లంపూడి మండల ఉప అధ్యక్షుడు గంధం ప్రభాకర్, దాడి చిన్న బుజ్జి, మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్ గంధం శ్రీను,చిక్కాల కల్కి భగవాన్,గుంటముక్కల చిన్న,మండపాక పాపన్న దొర,వంశీ, చిరంజీవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు

### కోడి పందాలు- జూదాలు జరిపితే
# కఠిన చర్యలు

- చింతూరు డివిజన్ ఏ ఎస్పీ హేమంత్




**ఎటపాక( మనసులో మాట ), జనవరి 12:** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడిపందాలు కానీ, పేకాటగుండాట, పేకాట వంటి జూదాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని చింతూరు డివిజన్ ఏఎస్పీ బి. హేమంత్ పత్రిక ముఖంగా తెలిపారు. పోలవరం జిల్లా పరిధిలోని ఎక్కడ కూడా ఎటువంటి జూదా క్రీడలు జరగకుండా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని, ముందస్తు గా అనుమానితులను బైండవర్ చేశామని అలాగే డ్రోనలా ద్వారా అన్ని ఏరియాలను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఎక్కడైనా కోడి పందాలు జరిగిన ఎడల వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంద ని అన్నారు. అలాగే ప్రజలందరూ సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో గడపాలని, ప్రజలందరికీ ప్రజలందరికీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## వివేకానంద బోధన లు ఆదర్శనీయం



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 12:** యువత స్వామి వివేకానంద బోధనలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం పళ్ళవారిపాలెం లో జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు . ఈ కార్యక్రమంలో బద్రి రమా సత్యనారాయణ, రంకిరెడ్డి రాంబాబు,గోదాశి పుండరీష్, పాణంగపల్లి కృష్ణ, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు



అర్చకుడు రామశర్మకు జడ్పిటిసి సామ్యూల్ సాగర్ పరామర్శ

# రూ. 5000 ఆర్థిక సహాయం

తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 12: ఇటీవల కత్తిపోట్లకు గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జార్జిపేట వెంకటేశ్వరస్వామి దేవాలయ అర్చకులు ఇంద్రకంటి సుబ్రమణ్య సుందర రామశర్మను తాళ్ళరేవు జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పరామర్శించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.

# పన్నులు పేరుతో నిలువు దోపిడీ చేసిన వైసీపీ ప్రభుత్వం

ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందుల పాలు చేసిన జగన్15 ఏళ్ల పాటు కూటమి ప్రభావం అధికారంలో ఉంటుంది



తణుకు జనవరి 12(మనసులో మాట ). ఇంటి పన్ను, చెత్త పన్ను పేరుతో రాష్ట్ర ప్రజలను నిలువు దోపిడీ చేసిన దుర్మార్గమైన పాలన చేసిన గత ఐదేళ్ల వైయస్సార్సీపి ప్రభుత్వం అని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలు గమనించాలని కోరారు. తణుకు మండలం తేతలి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ అనంతరం గ్రామ సర్పంచ్ సరేళ్ళ క్రాంతి ప్రియ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఖాతాల్లో డబ్బులు వేసిన జగన్ మోహన్ రెడ్డి వివిధ పన్నుల రూపంలో తిరిగి లాక్కునేవాడని విమర్శించారు. బస్ చార్జీలు, విద్యుత్ చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పేరుతో ప్రజలను ఆర్థికంగా దోచుకునేవాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా విద్యుత్తు చార్జీలు తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు అధికారములోకి వస్తే పెన్షన్లు ఇవ్వరని జగన్మోహన్ రెడ్డి ప్రచారం చేశారని గుర్తు చేశారు .అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్లు రూ. 3000 నుంచి రూ. 4000 కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి దక్కుతుందని పేర్కొన్నారు. 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటే అభివృద్ధి సంక్షేమం కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో కూటమే నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'జన్మభూమి' ఎక్స్ ప్రెస్

# విలువ కోల్పోతోందా?

- రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం
- రైలులో అసౌకర్యాలపై రైల్వే అధికారులను ప్రశ్నించిన జర్నలిస్టు రవి..







**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** రైల్వే శాఖలో తీవ్ర సంచలనం సృష్టించిన 'జన్మభూమి' సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ .. రైల్వే అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ అంటే..చాలా శుభ్రంగా ఉంటుందనే వారు. సూపర్ ఫాస్ట్ తో అత్యంత త్వరగా గమ్యాన్ని చేరుకోవచ్చుననే ఉద్దేశంతో ఛార్జీలకు వెనుకాడకుండా ప్రయాణించేవారు. ఈ రైలులో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉంటాయి. ఇది ఒకప్పటి ప్రయాణికుల అభిప్రాయం. ఇప్పుడు..అదే జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12805) రైలులో శుభ్రత పూర్తిగా లోపించింది. విశాఖ నుంచి లింగంపల్లి (హైదరాబాదు సమీపంలో) రెండు జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12805, 12806) సర్వీసులు అందిస్తున్నాయి. అయితే ఇప్పుడు ప్రస్తావన..12805 నెంబర్ జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు గురించి. ఆ రైలులో సౌకర్యాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో, ప్రయాణికుల ఇబ్బందులను గురించి రాజమహేంద్రవరం జర్నలిస్టు వీ రవికుమార్ స్వీయ అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రాజమండ్రి నుంచి విజయవాడకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన జర్నలిస్టు రవి కుమార్ కి ఈ ప్రయాణం ఒక చేదు అనుభవంగా మిగిలింది. ప్రయాణికుల సౌకర్యాలకే పెద్దపీట వేస్తామని చెప్పే రైల్వే శాఖ వాస్తవ పరిస్థితిని కళ్లారా చూసి ఆయన విస్మయానికి, ఆగ్రహానికి గురయ్యారు. రైలులోని చిరిగిపోయిన బెర్తులు, మురికి నీటితో నిండిపోయిన వాష్‌బేసిన్లు,అధ్వానంగా మారిన టాయిలెట్లు ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయని ఆయన గమనించారు. ముఖ్యంగా సుదూర ప్రయాణంలో ఉండే మహిళలు, వృద్ధులు, పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూసి ఆయన తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈ పరిస్థితులను మౌనంగా తట్టుకోకుండా, జర్నలిస్టుగా తన బాధ్యతగా భావించిన రవి కుమార్ ఫొటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో పోస్టు చేసి ప్రజల దృష్టిని ఆకర్షించారు. అంతటితో ఆగకుండా సంబంధిత రైల్వే అధికారులకు ఫోన్ చేసి నేరుగా సమాచారం అందించారు. అధికారులు ఇచ్చిన కాంట్రాక్టర్ ఫోన్ నెంబర్లను కూడా సేకరించి, ఈ నిర్లక్ష్యంపై రైల్వే ఉన్నతాధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ప్రజా ధనంతో నడిచే రైళ్లలో కనీస శుభ్రత లేకపోవడం ఎంత వరకు సమంజసం? అన్న ప్రశ్నను ఆయన బలంగా లేవనెత్తారు. ఈ ఫిర్యాదు తర్వాత స్పందించిన సంబంధిత కాంట్రాక్టరు జర్నలిస్టు రవి కుమార్ కు ఫోన్ చేసి "ఇవన్నీ సరి చేస్తాం, సమస్యలను పరిష్కరిస్తాం" అంటూ ఒక్క మాటలో సమాధానం చెప్పడం గమనార్హం. కానీ మాటలకే పరిమితమవుతుందా? లేక నిజంగా మార్పు కనిపిస్తుందా? అన్నది ప్రయాణికుల ప్రశ్నగా మారింది. ఈ ఘటన మరోసారి రుజువు చేసింది..ప్రశ్నించే జర్నలిజం ఉంటేనే పాలనలో చలనం వస్తుంది. ఒక ప్రయాణికుడిగా కాకుండా, సమాజానికి గొంతుకగా నిలబడి రవి చేసిన ప్రయత్నం, రైల్వే శాఖను కదిలించిందన్నది స్పష్టమే. ఇప్పుడు చూడాల్సింది ఒక్కటే.. సదరు కాంట్రాక్టర్ మాటలు కార్యరూపం దాల్చుతాయా? లేదా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు ఇంకా అదే అస్తవ్యస్త పరిస్థితులను భరించాలా? అనేది. ఏపీ- తెలంగాణా మధ్య రోజువారీ ప్రయాణికుల అవసరాలను తీర్చగలదని బాగా ప్రాచుర్యం పొందింది ఈ జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు. ఇది దాదాపు 711 కిలోమీటర్ల దూరాన్ని దాదాపు 13 గంటల్లో కవర్ చేస్తుంది. అంటే గంటకు 50 కిలోమీటర్ల సగటు వేగంతో ప్రయాణిస్తుంది. అందుకే ఈ జన్మభూమిలో ప్రయాణానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. కాకపోతే ప్రస్తుతం ఈ 'జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్'..పైన పటారం- లోన లొటారంలా తయారైంది. ఇప్పటికైనా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లో నెలకొన్న అసౌకర్యాలను గుర్తించి పరిష్కరించాలని జర్నలిస్టు రవికుమార్ తో ప్రయాణికులు రైల్వే శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## వికసిత్ భారత్ కొరకు పది సూత్రాలు రెవెన్యూ అంశాలు కేంద్ర ప్రభుత్వ పథకాల

# అమలుపై పురోగతి సాధించాలి - కలెక్టర్





**అమలాపురం (మనసులో మాట) జనవరి 12:** జిల్లాలో పెండింగ్లో ఉన్న అన్ని ఇ.ఆఫీస్ ఫైళ్లను పరిష్కరించి నిరుపయోగంగా ఉన్న ఫైళ్లను తొలగిస్తామని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, వివిధ శాఖల కార్యదర్శులు అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి. స్థూల జాతీయోత్పత్తి వికసిత్ భారత్ కొరకు పది సూత్రాలు అమలు, రెవెన్యూ అంశాలు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలులో పురోగతి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ మోడల్ లో పెట్టుబడుల ప్రతిపాదనలు, రియల్ టైం గవర్నెన్స్ విధానంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి స్థాయిలు విశ్లేషణ పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ రీ సర్వే గ్రీవెన్స్ పరిష్కార చర్యలు సర్వీసులు నమోదు వికసిత్ భారత్ రోజ్గార్ అజీవిక మిషన్ గ్రామీణ్ వికసిత్ భారత్ జి రామ్ జి చట్టం 2025, తల్లికి వందనం దీపం 2, అన్నదాత సుఖీభవ , రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ స్త్రీ శక్తి పథకం అమలు తదితర అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో అధికారులు పూర్తి సమన్వయంతో చిట్ట చివరి లబ్ధిదారుని వరకు సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చి సంతృప్తి స్థాయిలను మెరుగుపరుస్తూ జిల్లాను మొదటి గ్రేడులో నిలపాలని సూచించారు. సంక్షేమ అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయికి తీసుకుని వెళ్లి చిత్తశుద్ధితో పారదర్శకంగా అమలు చేస్తూ ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా అంకితభావం జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. పూజారులు ఇమాములు పాస్టర్లకు గౌరవ వేతనాన్ని సజావుగా అందించి ప్రభుత్వ పనితీరు పట్ల విశ్వసనీయతను పెంపొందించాలన్నారు. లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను మెరుగుపరి చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం తో వ్యవహరిస్తూ ఆర్ టి జి ఎస్;ఐ విఆర్ఎస్ ద్వారా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ రాకుం డా జాగ్రత్తగా సంక్షేమ లబ్దిని అందించాలని స్పష్టం చేశా రు. భావితరాల వారికి భూ వివాదాల పట్ల ఎటువంటి సమస్యలు ఒప్పందం కాకుండా డిజిటల్ విధానంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తోందని భవిష్యత్తులో భూ వివాదాల సమస్యలు పూర్తిగా తొలగి పోతాయన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందేలా ఫ్యామిలీ కార్డు విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. సుపరిపా లన అందించేదిశగా ప్రభుత్వం ఈ ఆఫీస్ విధానాన్ని తీసుకుని వచ్చిందన్నారు. జిల్లాలో ఈ ఆఫీస్ పోర్టల్లో నిరుప యోగంగా ఉన్న ఫైళ్లను డిస్పోస్ చేసి రెండు రోజులలో క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి కే మాధవి జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి కోడి పందేలు, గుండాటలు వంటి జూదాలు పై చట్టపరమైన చర్యలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట) జనవరి 12..** తూర్పు గోదావరి జిల్లా, మండపేట నియోజక వర్గం లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాబోయే సంక్రాంతికి కోడి పందేలు, గుండాటలు, పేకాటలు, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే పోలీస్ లు తీవ్ర చర్యలు తీసుకుంటారని తహసీల్దార్ జి. శ్రీనివాస్,అంగర సబ్ ఇన్స్పెక్టర్ హరీష్ కుమార్ లు హెచ్చరించారు. తూర్పు గోదావరి జిల్లా,మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామంలో గల ఎంపీడిఓ కార్యాలయంలో నిర్వహించిన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరణ అనంతరం అంగర సబ్ ఇన్స్పెక్టర్ హరీష్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ భానూజీ లు ఈ సమావేశంలో పాల్గొన్న గ్రామ సచివాలయ కార్యదర్శులు, వి ఆర్ ఓ లకు కోడి పందేలు అరికట్టడంలో తీసుకోవలసిన చర్యలు పై తగు సూచనలు చేశారు.కోడి పందేలు, గుండాటలు,పేకాటలు వంటి అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషేధం విధించారని, ఎవరైనా నిషేధ ఆజ్ఞలు ఉల్లంఘనకు పాల్పడితే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని గ్రామాలలో దండోరా వేయించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వి ఆర్ ఓ లు,సచివాలయ సిబ్బంది ఒక కమిటీ గా ఏర్పడి ప్రెసిడెంట్ లు,ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు తో సమావేశం ఏర్పాటు చేసి కోడి పందేలు, గుండాటలు అరికట్టడానికి సహకారం కోరాలన్నారు.కోడి పందాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే నిర్వాహకులు పైనా, స్థల యజమానులు పైనా చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## వివేకానంద విద్యా సంస్థల్లో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవ వేడుకలు

**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 12 ..**స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జగ్గంపేటలోని శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివేకానంద విద్యాసంస్థల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి ఒమ్మి రఘురామ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతదేశ ఆధ్యాత్మిక ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహానుభావుడు స్వామి వివేకానంద అని అన్నారు. యువతలో దాగి ఉన్న శక్తిని గుర్తించి, దానిని దేశాభివృద్ధికి వినియోగించుకోవాలన్నదే ఆయన ఆశయమని వివరించారు. స్వామి వివేకానంద బోధించిన ఆత్మవిశ్వాసం, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వం నేటి యువత తప్పనిసరిగా అలవర్చుకోవాల్సిన లక్షణాలుగా పేర్కొన్నారు. "లేచెను, మేలుకొనుడి, గమ్యాన్ని చేరేవరకు ఆగకండి" అన్న వివేకానంద వాక్యాలు యువత జీవితానికి దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి యువకుడు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అందరికీ జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, స్వామి వివేకానంద ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వివేకానందకు ఘన నివాళులు అర్పించారు.

# కోడిపందాలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

గొల్లపాలెంలో ఎస్సై ఎం. మోహన్ కుమార్ దాడులు ట్రాక్టర్లతో పందెం బరులు ధ్వంసం



**కాజులూరు మనసులో మాట జనవరి 12..** సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే కోడిపందాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్ కుమార్ తెలిపారు. సోమవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ఎం. మోహన్ కుమార్ డిప్యూటీ తాహసిల్దార్ శ్రీనివాస్ నేతృత్వంలో విస్తృత దాడులు నిర్వహించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన కోడిపందెం బరులను గుర్తించిన పోలీసులు ట్రాక్టర్ల సహాయంతో వాటిని పూర్తిగా ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ , కాకినాడ రూరల్ ఇన్స్పెక్టర్ డి.ఎస్ కృష్ణ చైతన్య ఆదేశాల మేరకుపండుగల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా కోడిపందాలు, జూదం నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తమకు సమాచారం అందిందనీ గ్రామీణ ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసామని పందేల కోసం తయారు చేసిన బరులను ట్రాక్టర్లతో గుణించామని, ఏర్పాట్లను తొలగించి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడిపందాలు మరియు జూదం అనేవి చట్ట విరుద్ధమైనవని, వీటి వల్ల కుటుంబాలు నాశనం కావడంతో పాటు యువత తప్పుదోవ పట్టే ప్రమాదం ఉందని అన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామస్తులు కూడా పోలీసుల చర్యలను అభినందిస్తూ, అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని పోలీసులు కోరారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి దాడులు కొనసాగుతాయని, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తారని తెలిపారు.

# పి.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఫుడ్ ఫెస్టివల్



**పల్నాడు,జనవరి 12,(మనసులో మాట):** పిడుగురాళ్ల పట్టణంలో కె.ఎన్.ఆర్ విద్యాసంస్థలు, కొండమోడు పిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు,బాడిశ మస్తాన్ రావు ఆద్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండవ రోజు భోగి మంటలు వేసి,సంప్రదాయ బద్దంగా పాలు పొంగించి పొంగల్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ గుర్తొచ్చేలా విద్యార్థులు వేసిన ముగ్గులు బాగా ఆకట్టుకున్నాయి. సాంప్రదాయపద్ధంగా తెలుగింటి ఆడపడుచు భక్తి శ్రద్ధలతో దీపారాధన చేస్తున్నట్టు వేసిన ముగ్గు పలువురి బాగా ఆకట్టుకుంది. చెరుకు గడలు, నెమలి బొమ్మ,పాలు పొంగించి నట్టు వేసిన ముగ్గులు, రంగురంగుల రంగ వల్లికలు చాలా బాగున్నాయి. కోడిపందాలు,సరదా డాన్సులతోఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా విద్యార్థుల భాగస్వామ్యంతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ లో వెజ్, నాన్ వెజ్ బుల్ తో తయారుచేసిన వంటల వెరైటీలు చాలా రుచికరంగా బాగున్నాయి. వెజిటేరియన్ ఫుడ్స్ ఇన్ని రకాలుగా తయారు చేయవచ్చా అనే విధంగా అనేక విధాలుగా తయారు చేశారు. ఈ విధంగా కళాశాలలో సంక్రాంతి సంబరాలతో ముందుగానే సంక్రాంతి పండుగ వాతావరణం కళాశాలలో కనిపించింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### రౌతులపూడి మండలం లో

# భారీ అగ్నిప్రమాదం

రౌతులపూడి, (మనసులో మాట)జనవరి 12: మండలంలోని గిరిజన ప్రాంతమైన సార్లంక గ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒక ఇంటిలోని గ్యాస్ బండ లీకై ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఈ ప్రమాదంలో 30 ఇల్లు పూర్తి కాలి బూడిదయాయని స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని వారు తెలిపారు. కట్టు బట్టలు కూడా లేకుండా పూర్తిగా కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

### పోలీసులు అందించే ఎల్ హెచ్ ఎం ఎస్ సేవను ప్రజలు

# సద్వినియోగం చేసుకోవాలి

- తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద సీసీ కెమెరాలతో పోలీసులు ప్రతిష్ట పర్యవేక్షణ ఏర్పాటు
- ఇళ్ల పరిసర ప్రాంతాల్లో భద్రత బలోపేతంతో నిరంతర గస్తీ
- ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకునే విధంగా ప్రణాళిక
- పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు



**పల్నాడు, జనవరి 12,(మనసులో మాట):** సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులకు ప్రజలు వివిధ గ్రామాలకు వెళుతూఉంటారు. ఆ సమయంలో తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిన కొన్నిసార్లు దొంగతనాలు వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోవచ్చని ఇటువంటి వాటిని నిరోధించాలనే లక్ష్యంతో పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తాళాలు వేసి ఉన్న ఇళ్ల భద్రతను మరింత పటిష్టం చేయాలని ఉద్దేశంతో ఎల్ హెచ్ ఎం ఎస్ ను పల్నాడు జిల్లా పోలీసు వారు అమల్లోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ తరుపున అమర్చిన సీసీ కెమెరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న పోలీస్ కంట్రోల్ కేంద్రం ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగ వ్యాపార వివాహాలు పండగలు ఇతర అవసరాలు కారణంగా కొంతకాలం ఇంటికి తాళం వేసి వెళ్లే ప్రజలకు పూర్తి భద్రత కల్పించడమే లక్ష్యం అని అన్నారు. ఈ విధానంలో భాగంగా తాళం వేసి ఉన్న ఇళ్ల వివరాలను, సంబంధిత యజమానులు అందించిన వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లో నమోదు చేయబడతాయని, గస్తీ పోలీసులు, సీసీ కెమెరాలు నైట్ పెట్రోలింగ్ ద్వారా ఆ ఇళ్లను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తారని, అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు కనిపించిన వెంటనే ఇళ్లలో అమర్చిన సీసీ కెమెరాల లోని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అట్టి విషయాన్ని కనిపెట్టి వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కి సమాచారం అందిస్తుందన్నారు. ఈ విధానం వలన చోరీలు అక్రమ ప్రవేశాలు నివారించబడతాయని, ప్రజల ఆస్తులకు సంబంధించి పోలీస్ శాఖ పటిష్ట భద్రత కల్పించగలుగుతుందన్నారు. నేరాల నివారణలో ప్రజలు పోలీసుల మధ్య సమన్వయం బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఎల్ హెచ్ ఎం ఎస్ ను వినియోగించుకొని తమ ఆస్తులను సురక్షితంగా కాపాడుకోవాలని ఎస్పీ కోరారు. అవసరమైన వివరాల కోసం సమీప పోలీస్ స్టేషన్ గాని డయల్ 112 అనే నెంబర్ ద్వారా గాని సంప్రదించాలని సూచించారు.

# కొవ్వూరులో రోడ్డు భద్రతా మాసోత్సవాలు




**కొవ్వూరు (రాజమహేంద్రవరం), మనసులో మాట, జనవరి 12:** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎన్ఆర్ఎస్ఎం2026 కార్యక్రమాన్ని సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించారు. కొవ్వూరు ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టాండ్ సెంటర్ నుంచి నగర వీధుల గుండా రైల్ కమ్ రోడ్డు బ్రిడ్జి వరకు ద్విచక్ర వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ద్విచక్ర వాహనంపై ర్యాలీలో పాల్గొని రోడ్డు భద్రతకు సంబంధించిన సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం అనివార్యమని తెలిపారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, చిన్న పిల్లలకు భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు కేవీవైఎస్ ప్రసాద్, సీహెచ్ సంపత్ కుమార్, ఎం రవి కుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వీ లక్ష్మీ ప్రవీణ, స్థానిక డీఎస్పీ జీ దేవకుమార్, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విశ్వం, ఎస్ఐ అలెగ్జాండర్, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు కాంతామణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

# కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ వద్ద అన్నదానం



**జగ్గంపేట (మనసులోమాట) జనవరి 12..** ప్రతి సోమవారం కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్న క్యాంటీన్ ఈ వారం జగ్గంపేట కాకతీయ కమ్మ సంఘం ఆర్థిక సహాయంతో నిర్వహించిన అన్నా క్యాంటీన్ సంక్రాంతి సంబరాలు సందర్భంగా గోకవరం రోడ్డులోని ట్రావెల్స్ బంగ్లాలో అన్నా క్యాంటీన్ నిర్వహించారు. ఈ అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట ఎమ్మెల్యే టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ మణి దంపతులు అన్నం వడ్డించి అన్నా క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం ప్రతినిధి పాలచర్ల నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని ఈ వారం అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట కాకతీయ కమ్మ సంఘం ఆర్థిక సహాయంతో నిర్వహించామని తొందర్లోనే గోకవరం రోడ్డులోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని అన్ని హంగులతో భవనం పూర్తయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### కోడి పందాలు ఆసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే

# కఠిన చర్యలు - ఎస్పి రాహుల్ మీనా



**అమలాపురం (మనసులో మాట) జనవరి12..** సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందాలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సంక్రాంతి పండుగ మూడు రోజులు ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని, పండుగ ముసుగులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ,కోడి పందాలు జూద క్రీడల నిర్మూలన కోసం ఎస్పీ ఆదేశాలు మేరకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడిపందాలు, పేకాట వంటి జూద క్రీడల నిర్వహణ కోసం సిద్ధం చేసిన బరులను పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ట్రాక్టర్ల సహాయంతో పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని చట్టవిరుద్ధమైన ఏర్పాట్లు ఎక్కడ జరిగినా వాటిని ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. కోడిపందాలు, గుండాట, పేకాట వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రజల్లో మార్పు తెచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని దీనికోసం ఆటోల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్లు, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. యువత మరియు సామాన్యులు జూదానికి బానిసలై తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టవద్దని పోలీసులు అధికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించి కోడిపందాలు లేదా ఇతర జూద క్రీడలు నిర్వహించే వారిపై, వాటికి సహకరించే వారిపై చట్టప్రకారం కఠినమైన కేసులు నమోదు చేయడమే కాకుండా, బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. మీ గ్రామంలో లేదా పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే కింది మార్గాల ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారుసమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు.

# స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగిద్దాం

### - తొగరు మూర్తి



**రామచంద్రపురం (మనసులోమాట) జనవరి 12..** స్వామి వివేకానంద మాటల్లో యువత అంటే కేవలం శారీరక వయస్సు కాదు.ధైర్యం ఆత్మవిశ్వాసం త్యాగబుద్ధి మరియు సేవాభావం...ఆయన అన్నమాటలు నేటికీ ప్రతీ హృదయంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.నాకు పదిమంది నిజాయితీగల యువకులు కావాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని, బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు తొగరు మూర్తి అన్నారు. పట్టణంలోనా ఏరియా హాస్పిటల్ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన యువకులను తొగరు మూర్తి అభినందించారు. ఈ సందర్భంగా తొగరు మూర్తి మాట్లాడుతూ దేవయువశక్తిపై స్వామి వివేకానందకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమన్నారు. .డిగ్రీలతోపాటు ఆత్మగౌరవం మన వ్యక్తిత్వంలో భాగం కావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మీ రక్తదానం అత్యవసర సమయంలో పేషెంట్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.1893 సెప్టెంబర్ 11న అమెరికా చికాగో పట్టణంలో జరిగిన సమావేశానికి భారత ప్రతినిధిగా స్వామి వివేకానంద హాజరై మాట్లాడుతూ మై డియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా అంటూ ఉపన్యాసం ప్రారంభించిన పదాలు వినగానే అమెరికా తో పాటు ప్రపంచ దేశాలన్నింటిలోనూ భారతదేశం పట్ల అమితమైన గౌరవం ఏర్పడిందన్నారు. అంతటి ప్రతిభావంత శాలి స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకొని తమ లక్ష్యాలు నెరవేర్చుకుంటూ దేశభక్తి కలిగి త్యాగబుద్ధి కలిగి సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాన్ని ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రధర్, ఏ ఆర్ టి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శేఖర్, నర్సింగ్ సూపరిండెంట్ జయప్రద, ఎన్జీవో సభ్యులు,బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ చింతపల్లి వాసు, చక్రధర్, బి వాసు తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ లో ఘనంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు



**అమలాపురం (మనసులో మాట) జనవరి 12..** జాతీయ యువజన దినోత్సవ. వేడుకలను సోమవారం అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల లో ఘనంగా నిర్వహించినట్లు కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య తెలిపారు.హిందూ ధర్మ విశిష్టత ను, భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద జన్మ దినాన్ని పురస్కరించుకొని ఈ జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నామని, వారి సిద్ధాంతాలను యువత స్ఫూర్తిగా తీసుకొని అనుసరించి జీవితంలో విజయం సాధించాలని డా.గోదాసి గంగ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపల్లి సుబ్బరాయ శాస్త్రి,వివేకానంద స్వామి గురించి తమ ప్రసంగంతో ప్రేక్షకులను ఉత్తేజపరిచారు.మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. సుబ్బారావు మాట్లాడుతూ స్వామి వివేకానంద మత సామరస్యాన్ని ప్రబోధించారని, భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతం ద్వారా భారత దేశ ఐక్యత సాధించారని తెలిపారు.అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. అబ్దుల్ సలాం మాట్లాడుతూ వ్యక్తిగత,ఉద్యోగ సామాజిక బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే దేశ సేవ చేసినట్లే అని స్వామి వివేకానంద సూచించారని, యువత దీనిని గుర్తు పెట్టుకొని పాటించాలని తెలిపారు. కిమ్స్ వైస్ ప్రిన్సిపల్ డా. రేణు సులాఖే మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కోసం శారీరక ఆరోగ్యం చాలా అవసరం అని, ఈ రెండు సామాజిక ఆరోగ్య సాధనకు తప్పనిసరి అని స్వామి వివేకానంద సూచించారని, దానిని నేటి యువత తెలుసుకొని ఆచరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్య ఉపాధ్యాయులు, వైద్య విద్యార్థులు, వివేకానంద సేవా సమితి సభ్యులు, అమలాపురం రామకృష్ణ సమితి సభ్యులు పాల్గొన్నారు.ఇటువంటి స్ఫూర్తి దాయక కార్యక్రమ నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కెవివి. సత్యనారాయణ రాజు, ఎండి. రవి కిరణ్ వర్మ, అభినందించారు.



# కోడిపందాలు జూదాలపై పిఠాపురం పోలీసుల ఉక్కు పాదం

**పిఠాపురం,( మనసులో మాట) జనవరి 12:** కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పిఠాపురం సర్కిల్ పరిధిలో పోలీసులు నిఘా పెంచారు. సోమవారం పిఠాపురం సర్కిల్ సీఐ శ్రీ జి. శ్రీనివాసు ఆధ్వర్యంలో, రూరల్ ఎస్ఐ రెవెన్యూ అధికారులు కలిసి మండలంలోని విరవాడ, విరవ గ్రామాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించారు.సంక్రాంతి పండుగ సాంప్రదాయం పేరుతో కోడి పందాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పందాల కోసం సిద్ధం చేస్తున్న మైదానాలు, స్థావరాలను గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు.ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసు మాట్లాడుతూ:"ప్రజలు సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా, ప్రశాంతంగా జరుపుకోవాలి. చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన కోడిపందాలు, పేకాట, గుండాట, అశ్లీల నృత్యాలు నిర్వహించడం నేరం. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గ్రామాల్లో ఎక్కడైనా ఇటువంటి జూద క్రీడలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలి" అని కోరారు.ఈ తనిఖీల్లో రూరల్ ఎస్ఐ జానీ భాషా, సిబ్బంది రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### పురోహితుని పై దాడిచేసిన వ్యక్తిపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

### బాధిత పురోహితున్ని పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ



**తాళ్ళరేవు ( మనసులో మాట) జనవరి 12 :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం జార్జీపేట గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న పురోహితునిపై కొండమూరు శివయ్య అనే వ్యక్తి దాడి చేయడం పట్ల ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కోఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీతారామ శర్మను పొన్నాడ పరామర్శించి ఓదార్చారు. ఘటనకు సంబంధించిన విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురోహితుడు ఇంద్రగంటి సీతారామయ్య శర్మ పై కొడవలితో దాడి చేసిన వ్యక్తిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆలయ ప్రాంగణంలో పురోహితుని పై కొడవలితో గాయపరిచటం దారుణం అన్నారు. పురోహితునిపై దాడి చేసిన కొండమూరి శివయ్యను కఠినంగా శిక్షించాలని, పురోహితులపై దాడులు జరగకుండా చూడాలని కోరారు. పరామర్శించిన వారిలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు కాదా గోవింద్ కుమార్, బూరెల వెంకట్రాజు, పిన్నమరాజు శ్రీను రాజు, వేలూరి వెంకట కామేశ్వర శర్మ, వల్లుబుని దొరబాబు, వ్యవసాయ శాఖ రిటైర్డ్ జేడీ పెట్ల సూర్యనారాయణ రాజు, పందిరిపల్లి రాజేష్, వెంటపల్లి నూకరాజు, కామాడి భైరవమూర్తి, పేర్ని ఆదినారాయణమూర్తి, రెడ్డి నాగేశ్వరరావు, శీలి రాజు తదితరులు ఉన్నారు.

### కాట్రావులపల్లి గ్రామ వైసీపీ అబ్జర్వర్ గా

# కరటూరి శ్రీనివాస్



**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 12..** మాజీ మంత్రి మాజీ పార్లమెంటు సభ్యుడు జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం తోట శ్రీ రాంజీ ఆదేశాల మేరకు కాట్రావులపల్లిలో గ్రామ సభ నిర్వహించిన గ్రామ అబ్జర్వర్ కరటూరి శ్రీనివాస్.ఈ సందర్భంగా కరుటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని, గ్రామ కమిటీ లలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించాలని, మీరందరూ కూడా సమిష్టిగా కృషి చేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో బలమైన నాయకులుగా తయారవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా పాల్గొని తోట నరసింహం ,తోట శ్రీ రాంజీ కరుటూరి శ్రీనివాస్ ను కాట్రావులపల్లి గ్రామానికి అబ్జర్వర్ గా నియమించారని ఈయన నేతృత్వంలో మీరందరూ కూడా కష్టపడి పనిచేసి 2029 లో తోట నరసింహం ను అధిక మెజారిటీతో గెలిపించాలని, ప్రతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు, బడుగు, బలహీన వర్గాలకు మంచి రోజులు రానున్నాయని, జగన్మోహన్ రెడ్డి 2029 లో సీఎం అవ్వడం జరుగుతుందని, కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారే అసలులైన కార్యకర్తలని, మీరందరూ కూడా ఎంతో ధైర్యంగా ముందుకు వచ్చి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.కాట్రావులపల్లి గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బిందానపు పేర్రాజు కాట్రావులపల్లి గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కలిసి ఎన్నుకోవడం జరిగింది. బృందావనపు పేర్రాజు మాట్లాడుతూ మీరందరూ కూడా నాకు చేదోడుగా ఉండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని, రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తోట నరసింహం ను అధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్ట సుగుణ రావు, సూరిమిల్లి నాగేశ్వరరావు, సప్ప సూరిబాబు, ఏలేటి ధనరాజు, మాదపోయిన సూర్యచంద్ర, పైలా చైతన్య, కాటే జగపతి, బండారు శ్రీను, గుడాల శాంతి ప్రసాద్, వర గంగాధర్, సోడాసాని కృష్ణ , గండికోట అరుణ, పురంశెట్టి చంద్రబాబు, కందుల బుజ్జి, గుల్లింకల బాబ్జి, పురంశెట్టి కృష్ణ, పురంశెట్టి శ్రీను,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## షాక్ కొడుతున్న నాటు కోడి

### - ఆకాశాన్ని అంటుతున్న ధరలు

ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 12:సంక్రాంతి పండగ సమీపించడంతో నాటుకోడి మాంసానికి డిమాండ్ భారీగా పెరిగింది. పండగ రోజుల్లో నాటుకోడితో వంటలు చేసుకోవడం ఆనవాయితీగా ఉండటంతో మార్కెట్లలో కొనుగోళ్లు ఒక్కసారిగా పెరిగాయి.అయితే ఉత్పత్తి పరిమితం కావడం, నాటుకోడి పెంపకం చేసే రైతుల సంఖ్య తగ్గిపోవడం వల్ల సరఫరా తగ్గి ధరలు విపరీతంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.గోదావరి జిల్లాల్లో కేజీకి రూ.2,500 వరకు ధర ఉందిజనవరి 2026 నాటికి గోదావరి జిల్లాల్లో నాటుకోడి ధరలు కేజీకి రూ.2,000 నుంచి రూ.2,500 వరకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ధరలు భారీగా పెరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాటుకోడి అందుబాటులోకి రావడం కష్టంగా మారింది. సంక్రాంతి రోజులు కావడం తో ముమ్మిడివరం లో బొండాయి కోడు తూము, అనాతవరం హైవే రోడ్డు పక్కన గత వారం రోజులగా నాటు కోళ్లను అమ్ముతున్నారు పెరిగిన ధరలు:గ్రామాలకే పరిమితం కాకుండా మండలాల్లో కూడా నాటుకోడి మాంసం ధరలు గణనీయంగా పెరిగాయి. నగర మార్కెట్లలో కేజీ నాటుకోడి ధర రూ.500 నుంచి రూ.1,000 వరకు పలుకుతోంది. ఈ రేట్లు మటన్ ధరలను కూడా మించిపోవడం గమనార్హం.వినియోగదారులపై భారం :ధరల పెరుగుదలతో సాధారణ వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు వ్యాపారులు మాట్లాడుతూ, మేత ఖర్చులు పెరగడం, రవాణా వ్యయాలు అధికమవడం, నాటుకోడి పెంపకం లాభదాయకంగా లేకపోవడంతో రైతులు ఈ రంగం నుంచి దూరమవుతున్నారని వివరించారు. డిమాండ్-సరఫరా మధ్య వ్యత్యాసమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వారు అంటున్నారు.

### గోకవరం రాజా పబ్లిక్ స్కూల్లో...

## సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు తెలియజెప్పే సంక్రాంతి సంబరాలు




గోకవరం (మనసులో మాట), జనవరి 12 :భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలు మన తరవాతి తరాలకు తెలియచేయాలనే ఉద్దేశ్యతో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు రాజా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం వెల్లడించారు. దీని లో భాగంగా మండల కేంద్రమైన గోకవరంలోని రాజా పబ్లిక్ స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పిల్లలు రంగవల్లుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థి హరిదాసు వేషం ధరించి అలరించాడు. పాఠశాల ప్రాంగణం మొత్తం మామిడి తోరణాల, అరటి చెట్లు, చెరుకు గడలతో అలకరించి భోగి మంటలు, సంక్రాంతి పాటలతో విద్యార్థులు సంతోషంగా గడిపారు. అనంతరం విద్యార్థుల చే ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకర్షణ గా నిలిచింది. కార్యక్రమంలో రాజ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పి సూర్య ప్రకాష్ రావు, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పి రామా నాగ లక్ష్మి, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు






## రాబోయే నాలుగేళ్లలో 16 లక్షల ఉద్యోగాలు కల్పనకు కృషి

### స్వామి వివేకానంద ఆలోచనలకు అనుగుణంగా యువత నడుచుకోవాలి



**తణుకు జనవరి 12 (మనసులో మాట)..** రాష్ట్రంలో రాబోయే నాలుగేళ్ల కాలంలో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడితో సుమారు 16 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తణుకు ఎమ్మెల్యే,పిఏసి సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. దేశ ఆత్మ గౌరవ నినాదంతో యువశక్తి నిర్మాణంపై దృష్టి కేంద్రీకరించి వివేకానంద స్వామి ఇచ్చిన సందేశాన్ని యువత ఆచరించాలని అన్నారు. సోమవారం వివేకానంద స్వామి జయంతి పురస్కరించుకుని తణుకు జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ ఓటమి ఎదురైనప్పటికీ కెరటంలా పైకి ఎగిసిపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా యువత ముందుకు సాగాలని కోరారు. ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం భారతదేశంలో వివేకానంద స్వామి చెప్పిన విధంగా యువత మంచి ఆలోచనలతో మానసిక స్థైర్యంతో ఉక్కు సంకల్పంతో చేపట్టిన పనిని సాధించేలా ఎలాంటి మార్గాన్ని ఎంచుకోవాలనే వివేకానంద స్వామి ఆలోచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సంకల్పంతో యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఇందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ సమన్వయంతో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలని ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత 18 నెలల కాలంలో దేశానికి వచ్చిన పెట్టుబడిలో 23 శాతం పెట్టుబడిలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. స్వామి వివేకానంద ఆలోచన కలుగును గా ప్రతి ఒక్కరూ దృఢ సంకల్పంతో సేవా భావంతో ముందుకు వెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సంక్రాతి లో భాగంగా పరిశుద్ధ పనులు



**కపిలేశ్వరపురం (మనసులో మాట) జనవరి 12..** తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో స్వచ్ఛ సంక్రాంతి లో భాగంగా సోమవారం పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.మోహన్ రావు ఆధ్వర్యంలో పరిశుద్య నిర్వహణ పనులు ప్రారంభించారు.. జే సి బి , ట్రాక్టర్ సహాయంతో గ్రామంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలును, డ్రెయినేజీ లలో పూడిక తొలగించ డానికి పరిశుద్య కార్మికులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ శాఖా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు మేరకు సంక్రాంతి నాటికి సంపూర్ణ పరిశుభ్రత గ్రామంగా తీర్చిదిద్దుతామని పంచాయతీ అభివృద్ధి అధికారి మోహన్ రావు తెలిపారు. ఈ స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమాన్నిసర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ యర్రా వీరన్న బాబు, ఎం గంగరాజు తదితరులు పర్యవేక్షించారు..

## అన్ని దానాల్లో రక్తదానం మిన్న

### - ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మా రెడ్డి

### - స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మాచర్లలో బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**పల్నాడు, జనవరి 12,( మనసులో మాట):** మాచర్ల పట్టణ ప్రభుత్వ వైద్యశాలలో స్వామి వివేకానంద 164వ జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"అన్ని దానాలలో రక్తదానం అత్యుత్తమమైనది. రక్తాన్ని దానం చేయడం అంటే ప్రాణాన్ని దానం చేసినట్లే" అని పేర్కొన్నారు.స్వామి వివేకానంద భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహానీయుడని, ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా గుర్తించిందని తెలిపారు. యువత సేవాభావంతో ముందుకు వచ్చి సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కేతన బోయిన హనుమంతు యాదవ్ మాట్లాడు తూ, స్వామి వివేకానంద స్ఫూర్తిని యువత తమ జీవితాల్లో అమలు చేసి దేశ నిర్మాణంలో భాగ స్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:ప్రోగ్రాం ఆర్గనైజర్ బొగ్గవరపు మస్తాన్ రావు,వైద్య శాఖ పి.ఎల్.టి.ఓ మాధవి లత,ప్రభుత్వ వైద్యశాల సూపరింటెం డెంట్ కేపీ చారి,బీజేపీ నాయకులుపట్టణ ప్రధాన కార్యదర్శి ఏచూరి అమర సురేష్,సీనియర్ నాయకులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, పోకూరి కాశీపతి,ఉపాధ్యక్షులు మారం వంశీ, శివ కోటయ్య, యువమోర్చా నాయకులు నీరజ్, జెట్టిపల్లి గణపతి,మాచర్ల అసెంబ్లీ మాజీ కో-కన్వీనర్ పోకూరు కాశీపతి,వెల్దుర్తి మండల అధ్యక్షుడు పీట్ల లక్ష్మణ్,మాచర్ల రూరల్ మండల అధ్యక్షుడు సన్నాయిలు బ్రహ్మం,కోశాధికారి గోపవరపు కేశవ,సీనియర్ నాయకులు కొమర కాశయ్య,ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కన్నెగంటి కోటేశ్వరరావు,అన్నవరపు ఏడుకొండలు, అన్నవరపు వెంకటేష్, ఉపాధ్యక్షులు ఇందిరా, జ్యోతి,ఏటుకూరు స్వామి, లాల, బాబురావు, శ్రీహరి, మహేష్, దుర్గారావు, మైనార్టీ నాయకుడు ఖాజా,టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకునే వ్యాఖ్యానం చేయడం ఎలా పుస్తకావిష్కరణ



**పిఠాపురం (మనసులో మాట) జనవరి 12:** పిఠాపురం పట్టణంలోని చారిత్రక సూర్యరాయ గ్రంథాలయం సోమవారం ఒక సాహిత్య వేడుకకు వేదికైంది. విశ్రాంత ఉపాధ్యాయుడు పైండా శ్రీనివాసరావు రచించిన 'ఆకట్టుకునే వ్యాఖ్యానం చేయడం ఎలా' అనే పుస్తకాన్ని పుర ప్రముఖులు, సాహితి వేత్తలు కలిసి ఘనంగా ఆవిష్కరించారు. బాదం ఉదయ సూర్య ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యుడు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎస్.వి.ఎస్.ఎన్. వర్మపుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ, సమర్థవంతమైన వ్యాఖ్యానం అనేది నేటి కాలంలో ఒక అద్భుతమైన నైపుణ్యమని, దీని ద్వారా యువత మంచి ఉపాధి అవకాశాలను పొందవచ్చని అన్నారు. రచయిత తన అనుభవాలను రంగరించి ఈ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు.రచయిత పైండా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తాను విద్యాశాఖలో పనిచేసిన కాలంలో ఎదురైన అనుభవాలను, వివిధ కార్యక్రమాల నిర్వహణలో నేర్చుకున్న మెళకువలను క్రోడీకరించి ఈ పుస్తకాన్ని రూపొందించానని తెలిపారు. నేటి తరం విద్యార్థులు, యువత సభా వేదికలపై ధైర్యంగా, ఆకట్టుకునేలా మాట్లాడటానికి ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. పుస్తకావిష్కరణలో భాగంగా పిల్లా సత్యనారాయణ మాస్టారు శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రంథాలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.ఈ కార్యక్రమంలో కె.వి.ఎస్. ప్రసాద్ మాస్టారు, దువ్వాడ సాల్మన్ రాజు, వరద వీరభద్రరావు, 'మన ఊరి - మన బాధ్యత' అధ్యక్ష కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, పెమ్మరాజు సత్య రామచంద్రరావు, టి. సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి చిన్న, పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్ సహా పట్టణ ప్రముఖులు, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడలతోనే యువతకు మానసిక వికాసం



**పిఠాపురం (మనసులో మాట) జనవరి 12:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని డీసీసీబీ చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు పిలుపునిచ్చారు. సోమవారం పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణంలో నిర్వహించిన 'గొల్లప్రోలు లీగ్ 4' క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, ఇరు జట్లకు అభినందనలు తెలిపారు.అనంతరం జరిగిన సభలో తుమ్మల బాబు మాట్లాడుతూ.. యువత క్రీడలపై దృష్టి సారించడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు ఉన్నత చదువులకు అవసరమైన మేధోశక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. క్రీడలు క్రమశిక్షణను నేర్పుతాయని, తద్వారా కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావచ్చని హితవు పలికారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి నిన్నటి రోజున 'గోల్డెన్ డ్రాగన్' సంస్థ వారు "టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్" అనే ప్రతిష్టాత్మక బిరుదును అందించారని రామస్వామి బాబు గుర్తు చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నియోజకవర్గ యువత క్రీడల్లో రాణించాలని కోరారు. ఆ గౌరవానికి నిదర్శనంగా ఈరోజు పిఠాపురంలో యువకులందరూ కలిసి ఈ క్రికెట్ లీగ్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు లీగ్ నిర్వాహకులు గండే కిరణ్,దమ్మల అంజి, మొగలి మణి, సింగూలూరి శివ జనసేన నాయకులు కడారి తమ్మయ్య నాయుడు, బస్వా చిట్టిబాబు, బాలరెడ్డి గంగబాబు, మొగలి రాజా నాయుడు, మొగలి రాజా , తలారి శ్రీనివాస్, అన్నం దొర పట్టాభిరామయ్య, గరగ తాతాజీ పెద్ద ఎత్తున కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పీజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో వచ్చిన అర్జీలు పరిష్కారం

## వేగవంతం చెయ్యాలి..

### - జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు

**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో అందిన అర్జీలకు వేగవంతమైన పరిష్కారాలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో అందిన అర్జీల పరిష్కార పురోగతిపై ఆయన.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ.. రెవిన్యూ సమస్యలు పరిష్కారానికి రెవిన్యూ క్లినిక్ లు చక్కనివేదిక అని, ఈ అవకాశాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీజీ ఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో అందిన అర్జీలు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. ఒకే అంశంపై మళ్ళీ మళ్ళీ దఖలయ్యే దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సత్య సాయి సమితి ఆధ్వర్యంలో

## సంక్రాతి సంబరాలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట)జనవరి 12..** కపిలేశ్వరపురం మండలం వెదురుముడి శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులతో శన?సోమవారం తో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలు కు భోగి పళ్ళు వేయడం, గోబ్బిళ్ళుపెట్టించడం, భజన పాటలు పాడించడం, రంగవల్లుల పోటీలు, సంక్రాంతి పండగ కు సంబందించిన చిత్రాలేఖనం పోటీలు,తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కూచిభోట్ల హేమంత్ అనూష, కనుమూరి బ్రహ్మాజీ రావు అందించడం జరిగింది. పిల్లలు కు స్వీట్స్ సుంకర వీరవేణి ఇచ్చినారు ఈ కార్యక్రమం లో వెదురుముడి సత్య సాయి సేవా సమితి కన్వీనర్ డి.వి.సిద్ధాంతి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు సూచించిన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస మార్గాలను చిన్నారుల అలవర్చుకోవాలని ఉద్బోదిశీచారు. సాయిభక్తులు గ్రంధి సాయి గుణసుందరి, కాకి కమల, సిద్దిరెడ్డి పవన్ వల్లూరి చిరంజీవి,తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ఫిర్యాదు దారుల నుండి 264 స్వీకరణ

### ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు...



**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎన్. శ్రీధర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో రామ్ కుమార్, డీఎల్డీఓ పి.వాసుదేవరరావు, ఎస్డీసీ భారతి తదితర అధికారుల కాకినాడ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డు లలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 264 అర్జీలు అందాయి.రెవెన్యూ క్లినిక్ కు 74 అర్జీలు.. రెవిన్యూ అంశాల పరిష్కారం నిమిత్తం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలు పైన నిర్వహించిన రెవిన్యూ క్లినిక్ కార్యక్రమంలో డీఆర్వో వెంకటరావు, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణితి కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రెవెన్యూ అంశాలపై 74 అర్జీలు అందాయని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కోడిపందెములు నిర్వహించుట పాల్గొనుట

# చట్టరీత్య నేరం

- జూదం నిర్వహించిన,పందెం బరులు ఏర్పాటు చేసిన కఠిన చర్యలు
- ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10
- ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974సెక్షన్ 34 జంతు హింస నివారణ చట్టం 1960ల ప్రకారం క్రిమినల్ చర్యలు
- జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ క్రీడలు ముద్దు




కాకినాడ (మనసులో మాట) జనవరి 12రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు, జంతు క్రూరత్వ నిరోధక, గేమింగ్ చట్టాల ప్రకారం హింసాత్మకమైన కోడి పందాలు పూర్తిగా నిషిద్ధమని, వీటిని అతిక్రమించి ఏవరైన కోడిపందాలు నిర్వహిస్తే కఠిన శిక్షలు చేపట్టడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంక్రట్రావు స్పష్టం చేశారు.సోమవారం ఉదయం కలెక్టరేట్ గ్రివెన్స్ హాలులో డిఆర్ఓ జె. వెంకట్రావు, అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించి సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదాల నిషేధంపై జిల్లా యంత్రాంగం చేపట్టిన కార్యాచరణలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సాంప్రదాయాల పేరిట కోడి పందాల నిర్వహణ క్రూరమైన వినోదమని, వీటిని నిషేధంపై రాష్ట్ర హైకోర్టు నిర్థిష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అలాగే జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం, 1960 , ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం , 1974 ప్రకారం కోడిపందాలు, జూదాలు శిక్షార్హమైన నేరాలని ఆయన తెలిపారు. కోడిపందాల నిర్వహణకు వ్యవసాయ భూములు, తోటలు, ప్రయివేట్ స్థలాలు ఎక్కడా నిర్వహణకు అనుమతి లేదని, కోడిపందాలు, జూదాల నిర్వాహకులతో బాటు, వాటిలో పాల్గొనేవారు , ప్రోత్సహించేవారు, బరులు ఏర్పాటు చేసిన భూమి యజమానులు, పందేలు ఒడ్డేవారు, బరుల వద్ద మద్యం విక్రయించేవారు ఈ చట్టల క్రింద కఠిన శిక్షలకు పాత్రులౌతారని డిఆర్ఓ సుస్పష్టం చేసారు. కోడిపందాలు, జూదాల నిర్వహణను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, పశుసంవర్థన తదితర శాఖల సమన్వంతో జిల్లా యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణ అమలుకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందుకు మండల స్థాయిలో తహసిల్దారు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, మండల పశుసంవర్ధక అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఫొటోగ్రాఫర్ల తో ఏర్పాటు చేసిన బృందాలు కోడిపందాలు, జూదాలపై నిశతమైన నిఘా, విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్డిఓలు, ఎస్డిపిఓలు నిషేధ అమలును పర్యవేక్షిస్తారని, జిల్లా స్థాయిలో పశుసంవర్థక శాఖ జాయింట్ డైరక్టర్ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారని తెలియజేసారు. గ్రామ స్థాయిలో పంచాయితీ సెక్రటరీలు, గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందితో నిఘా ఉంచామన్నారు. నిషేధ అమలుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోలు రూమ్ ఏర్పాటు చేసామని, కోడిపందాల నిర్వహణకు సంబంధించిన సమాచారం తెలిసినా వారెవరైనా ఈ కంట్రోల్ రూమ్ కు గాని, మండల టీములకు గాని తెలియజేయాలని డిఆర్ఓ కోరారు. కోడి పందాలు జరిగే ప్రాంతాలలో భారతీయ నాగరిక సురక్షా సంహిత , 2023, సెక్షన్ 163 ప్రకారం ముందస్తు నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. హింసాత్మకమైన కోడిపందాలు, కుటుంబాలను ఆర్థికంగా కుప్పకూల్చే జూదాలకు బదులు ప్రజలు సంక్రాంతిని మమతలు, మానవీతలతో సంతోషంగా జరుపు కునేలా ప్రోత్సహిస్తూ డిఆర్డిఏ ఆద్వర్యంలో కబడ్డి, రంగోలీ తదితర సంప్రదాయ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహించడం జరుగు తోందన్నారు. అడిషనల్ ఎస్పి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కోడిపందాలకు పాల్పడుతున్న నేరస్తులపై ప్రివెంటీవ్ గా బైండోవర్ చర్యలు కూడా చేపడు తున్నామన్నారు. కోడి పందెం బరులు సిద్దం చేస్తున్న సమాచారం అందిన చోట్ల దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేస్తున్నామని, అనుమానిత ప్రాంతాలలో డ్రోన్లు ఎగరువేసి నిశితంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. కోడిపందాల ఏర్పాట్లు లేదా నిర్వహణకు సంబంధించి ఎటువంటి సమాచారం అందిన వెంటనే తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాల్ పోస్టర్ ఆవిష్కరణఈ సందర్భంగా కోడిపందాల నిషేదం, సంబంధిత చట్టాల సమాచారంతో పశు సంవర్ధక శాఖ ప్రచురించిన పోస్టర్ ను డిఆర్ఓ జె.వెంకట్రావు, ఎఎస్పి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఎస్పిలు మనీష్ దేవరాజ్ పాటిల్, కె.వి.సత్యన్నారాణ, బి.శ్రీహరిరాజు, పశుసంవర్ధక శాఖ జేడి డా.వెంకటేశ్వరరావు, సమాచారశాఖ ఇంచార్జి డిడి ఆర్విఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.

# జూద క్రీడలకు దూరంగా ఉండండి..

## -అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొన్నా, నిర్వహించినా చర్యలు తప్పవు

## -తూర్పు గోదావరి జిల్లా ఈస్ట్ జోన్ డీఎస్పీ బీ విద్య



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** సంక్రాంతి పండుగలను సాంప్రదాయ ప్రకారం కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా జరుపుకోవాలని తూర్పు గోదావరి జిల్లా ఈస్ట్ జోన్ డీఎస్పీ బీ విద్య జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు పోలీసు స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ విద్య రాజమహేంద్రవరం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజే శారు. పండుగను ప్రజలు సుఖ శాంతులతో జరుపుకోవాలన్నారు. పండుగ సమయంలో ప్రజలు ఎవరూ చట్ట విరుద్ధమైన పేకాటలు, గుండాటలు, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొనరాద న్నారు. అటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొన్న, నిర్వహించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. చట్ట విరుద్ధమైన పేకాటలు, గుండాటలు, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన ప్రదేశము లేక స్థల యజమానుల మీద కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగ సెలవుల్లో ఇంటి దొంగతనాలను నివారించడానికి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్హెచ్ఎంఎస్) ను వినియోగించుకోవాలన్నారు. ఈ సౌకర్యం పూర్తిగా ఉచితమని, ప్రజలు ఈ యొక్క పోలీసు సేవలను వినియోగించుకొని తమ విలువైన సామాగ్రిని క్షేమంగా ఉంచుకోవాలని సూచించారు. సెలవుల కోసం మీ ఇంటి నుండి బయలుదేరేటప్పుడు మీ ఆభరణాలు, విలువైన వస్తువులను భద్రపర్చుకోవాలని హితవు పలికారు. మీ ఇంటి చుట్టు పక్కల ప్రదేశాలలో ఎవరైనా అనుమానంగా తిరుగుతుంటే వెంటనే సమాచారాన్ని దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్ కు తెలియజేయాలన్నారు. బైక్, కార్ నడిపే వారు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక పెట్టుకోవాలని, రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ ప్రజలు వారి గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవాలన్నారు. పండుగ రద్దీలో ప్రయాణాలు చేసేవారు వారి యొక్క నగలు, నగదు, ఫోన్లు, ఇతర వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అత్యవసర సమయాలలో డయల్ 100 లేక 112 కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందాలని డీఎస్పీ బీ విద్య విజ్ఞప్తి చేశారు.

# హెచ్ ఎం ఎస్ యూనియన్ కార్మిక సభ్యులకు సంక్రాంతి బోనస్ పంపిణీ

## - శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** సంక్రాంతి సందర్భంగా హెచ్ఎంఎస్ యూనియన్ కార్మిక సభ్యులకు హెచ్ఎంఎస్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమడి కొండబాబు చేతుల మీదుగా కార్మిక సభ్యులకు సంక్రాంతి బోనస్ లను అందజేశారు. అనంతరం సాయంత్రం శాసనసభ్యులు వారి స్వగృహం నందు నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మీ డిపోటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్, వినాయక డిపోటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్, డబ్బింగ్ బోర్డ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు బోనస్లను శాసనసభ్యులు వనమాడి కొండబాబు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ పోర్టుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మిక సభ్యులు ప్రతి ఒక్కరు సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని సదుద్దేశంతో ప్రతి సంవత్సరం బోనస్తులు అందజేయడం జరుగుతుందని, నేడు ఎమీా యూనియన్ కార్మికుల కళాశీలకు 7,000 సరంగలకు 10,500 చెప్పున మొత్తం 1500 మంది కార్మికులకు, లక్ష్మీ యూనియన్ కార్మికులకు 10,000 చొప్పున 517 మంది కార్మికులకు, వినాయక యూనియన్ కార్మికులకు 5000 చొప్పున 365 కార్మికులకు, టవ్వింగ్ గ్ బోట్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు 8,000 చొప్పున 192 మంది కార్మికులకు బోనస్ లను అంద చేయడం జరుగుతుందని కొండబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పినపోతు రాము, పినపోతు జీవరత్నం, లక్ష్మీ డిపోటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పట్టా ధనలక్ష్మి, పాలెపు రాజు, వినాయక డిపోటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఓలేటి పాండురంగడు, బలసాడి శ్రీను, టవ్వింగ్ బోట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆదం సతీష్, పినపోతూ రాము, మల్లాడి గంగాధరం, కర్రీ రాజారావు, సేరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణి



**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** కాకినాడ నర్సన్ నగర్లో వున్న ప్రభుత్వ అంధ వయోజన బాలుర హాస్టల్ నందు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా, శ్రీ జన చైతన్య సేవా సంఘం అధ్వర్యంలో నిత్యావ సర సరుకులు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కర్రి రాజు మాట్లాడుతూ "మానవసేవే మాధవ సేవ " గా తమ సంస్థ సభ్యుల సహకారంతో పేదలకు సహాయసహకారాలు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు వివేకానంద స్వామి సందేశాలు వినిపించారు. వివేకానంద 163 వ జయంతి సందర్భంగా గంజి సత్యనారాయణ, ఏడిద వెంకటరత్నం, పొనుగుపాటి చిన సుబ్బారావు, కామిరెడ్డి అచ్చుతరామయ్యలను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్వ్యారీ సత్యనారాయణ, జొన్నాడ వెంకటరమణ, సుంకర రామకృష్ణ, సామలూరి శ్రీనివాస్, రెడ్నం గంగాధర రామారావు, చెలికాని వెంకట శ్రీనివాస్, పల్లా త్రిమూర్తులు, సంగ నేడి వెంకట కృష్ణారావు, సాహ్ని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్ లో ఇటువంటి సేవకార్యక్రమాలు మరిన్ని చేయగలమని కర్రి రాజు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 అర్జీలు...




పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 12: పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) శ్రీనివాసరావు పాల్గొని, పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈరోజు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 25 అర్జీలు అందాయని తెలిపారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఫిర్యాదుదారులు తమ అర్జీల నమోదు గురించి లేదా వాటి పరిష్కార స్థితి తెలుసుకోవాలనుకుంటే నేరుగా 1100 (వన్ వన్ జీరో జీరో) నంబర్కు కాల్ చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి, మునిసిపల్ కమిషనర్లు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యర్రవరంలో స్వామి వివేకానంద163వ జయంతి వేడుక

## - వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం

## - రూ 10 లక్షలు రూపాయల నిధులతో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన



**ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 12..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాని మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు స్థానిక నాయకుల సమక్షంలోప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరం లో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేపట్టారు. స్వామి వివేకానంద ను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఈ సందర్భంగా నేతలు తెలిపారు. ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో నాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామములో 10లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సి సి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి కుమార్ వర్మ, రామరాజు వర్మ, నాయకులు బస్వా ప్రసాద్, మైరాల కనకారావు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్, గంగిరెడ్ల మణికంత, శెట్టి చిన్న, మైరాల నాగేశ్వరరావు, వివేకానంద సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం రూరల్ మండలంలో వివిధ గ్రామాలలో......

# సిసి రోడ్లకు శంకుస్థాపనలు

## చేసిన మండల అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహామూర్తి



**ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 12..** ఏలేశ్వరం మండలం రూరల్ గ్రామ పంచాయతీల సిరిపురం భద్రవరం పెద్దనాపల్లి ఎర్రవరం గ్రామాలలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులడు గొల్లపల్లి నరసింహామూర్తి అలియాస్ బుజ్జి రోడ్లకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. రూరల్ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయని మండల అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు. ఏలేశ్వరం మండలంలో పలు గ్రామాలలోని సీసీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను అందజేసిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సాకారంతో గ్రామీణ ప్రాంతంలో లింకు రోడ్లకు నిధులు మంజూరు చేయించారన్నారు. ఆయా గ్రామాల్లో నిర్మాణం అవుతున్న సిసి రోడ్ల శంకుస్థాపన శంకుస్థాపన కార్యక్రమాలలో ఏలేశ్వరం టిడిపి మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు పెద్దనాపల్లి గ్రామ సర్పంచ్ బుద్ధ సూర్యప్రకాష్ రావు మాజీ ఎంపీటీసీ బుద్ధ ఈశ్వరరావు లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్ బద్రవరం గ్రామ సర్పంచ్ కోనపు రెడ్డి సుబ్బారావు ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జి తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు జిగటాపు సూరిబాబు కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ దనేకుల అదృష్టదీపుడు టిడిపి సీనియర్ నాయకుడు దనేకుల వీరభద్రరావు బచ్చల శివ బిజెపి నాయకుడు హరే రామ్ మాజీ ఎంపీటీసీ ఓనం మంగా వివేకానంద సేవా సమితి సభ్యుడు మైదాల నాగేశ్వరరావు గంగిరెడ్ల మణికంత శెట్టి చిన్న ఎంపీడీవో రవివర్మ బిజెపి టిడిపి జనసేన పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# లేవండి మేల్కొనండి గమ్యం చేరే వరకు విశ్రమించకండి



**పిఠాపురం, ( మనసులో మాట ) జనవరి 12:** భారతీయ యువత ఆరాధ్య దైవం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని, సోమవారం పిఠాపురం పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. "శరీరాన్ని, బుద్ధిని, ఆధ్యాత్మికతను నిర్వీర్యం చేసే దేన్నైనా విషంలా తిరస్కరించాలని" వివేకానంద ఇచ్చిన సందేశాన్ని యువత గుర్తుంచుకోవాలని కోరారు. 'నందానంద వివేకానంద' అంటూ చేసిన నినాదాలు మార్మోగాయి. కార్యక్రమంలో పాల్గొన్న వారికి మిఠాయిలు పంపిణీ చేసి పండుగ వాతావరణంలో జయంతిని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సెక్రటరీ సైతన సత్తి కుమారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడబాల వీరమోహన్, ఓబీసీ మోర్చా ట్రెజరర్ ఏలూరి సూర్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షుడు గరగ వీరబాబు, పట్టణ సెక్రటరీ వానపల్లి రమణ, బ్రహ్మాజీ వరద తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి పండుగ కానుక



**నిడదవోలు జనవరి12(మనసులో మాట)..** నిడదవోలు మున్సిపాలిటీలో మొట్ట మొదటి సారిగా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి పండుగ కానుకగా కార్మికులకు సబ్బులు కొబ్బరి నూనె పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణకి కమీషనర్ టీ. కృష్ణ వేణి కి శానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజుకి యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు యూనియన్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కార్మికులకు తక్షణమే మరుగు దొడ్లు నిర్మాణం చేపట్టాలని చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులను ఆదేశించారు.



## ఘనంగా పెండెం దొరబాబు పుట్టినరోజు వేడుకలు

**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 12:** పిఠాపురం మాజీ శాసనసభ్యులు, జనసేన నాయకుడుపెండెం దొరబాబు జన్మదిన వేడుకలను దొరబాబు యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజావారి కోటలో గల దొరబాబు నివాస గృహం నందు భారీ కేక్ కట్ చేసారు. అనంతరం పలువురు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. దొరబాబు యూత్ సభ్యులు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెండు మార్లు ఎమ్మెల్యేగా సేవలు అందించిన దొరబాబు కి భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, ఆయన మరింత ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆగంటి ప్రభాకరరావు, బాలిపల్లి రాంబాబు, రెడ్డం జనార్ధన్, బొజ్జా దొరబాబు,కొత్తపల్లి వీర వెంకట సత్యనారాయణ (బుజ్జి ) మారిశెట్టి బుజ్జి, పాలిక ప్రవీణ్ కుమార్, కొత్తెం సుందర్, కన్నా బత్తుల కామేశ్వరరావు, చెల్లుబోయిన సతీష్ , చల్లా లక్ష్మి, తోలేటి శిరీష, పిల్ల రమ్య జ్యోతి , తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ లో లౌడ్ తైలన్సులపై ప్రత్యేక డ్రైవ్...

### అక్క మార్పులు చేసిన వాహనపై పోలీస్ కఠిన చర్యలు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** లౌడ్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవ్ అక్రమ మార్పులు చేసిన వాహనాలపై కఠిన చర్యలుకాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ప్రజా శాంతి, రహదారి భద్రత శబ్ద కాలుష్య నియంత్రణ దృష్ట్యా కాకినాడ జిల్లా వ్యాప్తంగా లోడ్ సైలెన్సర్లు (లౌడ్ /మోడిఫైడ్ సైలెన్సర్స్ ) అమర్చిన ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించబడింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, వాహనాలకు అక్రమంగా అమర్చిన లోడ్ సైలెన్సర్లను గుర్తించి, వాటిని తొలగించడం జరిగింది. సంబంధిత వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సైలెన్సర్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. లౌడ్ సైలెన్సర్ల వల్లప్రజలకు తీవ్ర శబ్ద కాలుష్యం కలగడం,రోగులు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడడం,రహదారి ప్రమాదాలకు అవకాశాలు పెరగడం జరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి వాహనాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయనున్నట్లు పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ప్రజలు తమ వాహనాల్లో ఎలాంటి అక్రమ మార్పులు చేయకుండా, తయారీదారు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారమే వాహనాలను ఉపయోగించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని కాకినాడ జిల్లా పోలీసులు తెలిపారు.

## లయన్స్ క్లబ్ దాతృత్వం




**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 12:** కొత్తపల్లి మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన చింతపల్లి శేషారత్నం కుటుంబానికి అండగా నిలిచేందుకు కాకినాడకు చెందిన శ్రీకారం లయన్ క్లబ్ స్వయంకృషి లయన్ క్లబ్ సంఘాలు ముందుకు వచ్చాయి. నెల రోజుల వ్యవధిలో భర్తను, కోడలిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబానికి ఈ క్లబ్‌ల ఆధ్వర్యంలో రూ. 6,000 నగదు సహా రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమానికి కాకినాడ శ్రీకారం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కర్రి వినీత రెడ్డి, అడ్మిన్ కొడాలి ఉమాదేవి, స్వయంకృషి లయన్ క్లబ్ అధ్యక్షురాలు పట్టా శ్రీరామ ఈశ్వరి, సత్తి సురేందర్ రెడ్డి హాజరై బాధితురాలికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టి, తమ మండలంలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా లయన్ క్లబ్ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కాజులూరి శ్రీరామ్ రెడ్డి, కాజులూరి నేరేళ్ల రెడ్డి, పెనుమల్లు పాపిరెడ్డి, బోడపాటి రాజేష్, తాతపూడి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల విజనరీ ప్రతిబింబించాలి
- ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలి
- అధికారులకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఆదేశాలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల దిశ, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజా సాధికారతను ప్రతిబింబించే విధంగా 77వ గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ లో జిల్లా స్థాయి వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ (ఎఫ్ఏసీ), జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా వేడుకలు రూపకల్పన చేయాలని సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమన్వయ సమావేశంలో ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత కాలంలో చేపట్టిన ప్రాధాన్యత కలిగిన సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాల సారాంశంగా వేడుకలు ఉండాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను మాత్రమే ప్రతిబింబించే శకటాల ప్రదర్శనతో పాటు వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయవలసి ఉందని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా డీఆర్డీఏ, డ్వామా పీడీ లు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమాల ఏర్పాట్లు, జాతీయ జెండా ఆవిష్కరణ, పరేడ్ తదితర అంశాలను పోలీసు అధికారులు ఏర్పాటు చేయాలని, రాజమహేంద్రవరం ఆర్డీవో, అర్బన్ తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని పర్యవేక్షించాలని సూచించారు. స్టేడియంలో జరిగే ఏర్పాట్లు ఆర్ఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సీటింగ్ , గ్రౌండ్ ప్రిపరేషన్, గ్యాలరీ తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టడం పై సమన్వయం చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి, రాజ్యాంగ , దేశభక్తి విలువలు ప్రతిబింబించేలా ఉండే విధంగా జిల్లా పాఠశాల విద్యా శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫైర్, వైద్య, ఆరోగ్య, మున్సిపల్, పోలీస్ శాఖలు సమగ్ర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రసంగ పాఠం డీపీఆర్వో - సీపీవో తో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అలాగే అవార్డుల ఎంపికలో రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన అధికారులు, ఉద్యోగులు, ప్రతిభ కనబరిచిన వారి పేర్లను మాత్రమే సిఫార్సు చేయాలని స్పష్టం చేశారు. వేడుకలు పూర్తిగా పారదర్శకంగా, క్రమబద్ధంగా, ప్రజలకు ప్రభుత్వ విజన్‌ను తెలియజేసేలా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ టీ సీతారామమూర్తి, అదనపు ఎస్పీ ఎల్ చెంచిరెడ్డి, ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ ఎన్ వీవీఎస్ మూర్తి, ఆర్మ్ డీఎస్పీ రవికుమార్, హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ఐసీడీఎస్ పీడీ టీ శ్రీదేవి, డీఎస్వో వీ పార్వతి, సీపీవో ఎల్ అప్పలకొండ, డీఈవో కే వాసుదేవరావు, డీటీవో ఆర్ సురేష్, డివిజనల్ పీఆర్వో ఎం లక్ష్మణా చార్యులు, డీటిడబ్ల్యూడబ్ల్యో కేవన్ జ్యోతి, బీసీ సంక్షేమ అధికారి బీ శశాంక ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో మస్తరు మాయాజాలం

- పని వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేసామంటూ వేల రూపాయల దోపిడీ
- క్షేత్ర పర్యవేక్షణలో లోపాలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు



**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 12:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక పనుల్లో అనేక అవకతవకలు జరిగినట్లు సోషల్ ఆడిట్ లో బహిర్గతమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి అధ్యక్షతన 2024-25సం కు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్ ల ద్వారా 1203 పనులకు గాను కూలి చెల్లింపులు రూ12కోట్ల62 లక్షల38వేలు, మెటీరియల్ కు రూ 8 కోట్ల 82 లక్షల 85వేలు, మొత్తం వెరసి రూ 21కోట్ల45 లక్షల23 వేల నగదు చెల్లింపులు జరిగినట్లు సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి లక్ష్మణరావు తెలిపారు. గత ఏడాది నవంబర్18 నుండి జనవరి 11 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు,జాబ్ కార్డులు పొంది పనులు చేసిన వారి వివరాలు వాటిలో ఉన్న అవకతవకలు, ఫిర్యాదులను నివేదికను సోషల్ ఆడిట్ నందు వివరించారు. గ్రామాల్లో జరిగిన పనులు వివరాలు తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయవలసి ఉండగా అవి ఎక్కడ పూర్తిస్థాయిలో పెట్టలేదని, మండలంలోని పి రాయవరం,పి.తిమ్మాపురం,పి దొంతమూరు, మంగితుర్తి గ్రామాల్లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా నగదు చెల్లింపులు ఇచ్చినట్లు ఆడిట్ బృందాలు గుర్తించారు. కుమారపురం గ్రామంలో మస్తరు లో కొట్టి వేతలు ఎక్కువగా ఉన్నాయని,నవఖండ్రవాడ లో కూలీలకు సౌకర్యాలు కల్పించలేదని,మంగితుర్తి గ్రామంలో రూ79 వేలు విలువైన మొక్కలు పెంచుకునేందుకు నగదు చెల్లించినట్లు రికార్డ్ లో ఉందని ఆ ప్రాంతంలో ఎటువంటి మొక్కల పెంపకం లేకుండా ఖాళీ స్థలం మాత్రమే ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. పి దొంతమూరు గ్రామంలో పనికి వెళ్లకుండా వేరేచోట పని చేసుకునే వారిని, పక్షవాతంతో మంచాన ఉన్న వారిని సైతం పనికి వెళ్లినట్లు వారికి చెల్లింపులు చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. అయితే పిడి వెంకటలక్ష్మి సదరు ఫీల్డ్ అసిస్టెంట్ ఇప్పటికే సస్పెన్షన్ లో ఉన్నట్లు తెలిపారు. మండలంలో పలు గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా చేసిన పనుల యొక్క వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేశామని బిల్లులు డ్రా చేశారని క్షేత్ర పర్యటనలో బోర్డులు కనబడలేదని విజిలెన్స్ బృందం గుర్తించినట్లు తెలిపారు. మండలంలో 11చోట్ల క్యాటిల్ షెడ్లు నిర్మించినట్లు సాంకేతిక సమస్య వల్ల వారికి నగదు చెల్లింపు జరగాల్సి ఉందని పీడీ తెలిపారు. పలుచోట్ల నకిలీ మస్తర్లు నమోదు అయినట్లు సోషల్ ఆడిట్లో తెలిపారు. పి రాయవరం గ్రామంలో 8 ఎకరాల చెరువు సరిహద్దుల్లో బ్లాక్ ప్లాంటేషన్ చేసేందుకు అనుమతులు ఇవ్వాలని గ్రామానికి చెందిన వ్యక్తి అడగ్గా పీడీ అనుమతించారు. సోషల్ ఆడిట్ ద్వారా రూ46,048 రికవరీ చేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన్నా బత్తులు కామేశ్వరరావు,ఏపీడి వసంత మాధవి,ఎంపీడీవో కె స్వప్న,ఉపాధి హామీ విజిలెన్స్ హెచ్ఆర్ మేనేజర్ రాజేష్, విజిలెన్స్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు,ఏపీవో నాయుడు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య,ఫీల్డ్ అసిస్టెంట్లు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మీ సేవలకు వెలకట్టలేం - గొల్లపల్లి



**అనపర్తి (మనసులో మాట) జనవరి 12:** పారిశుద్ధ్య కార్మికుల సేవలకు వెలకట్టలేమని, గ్రామాలు, పట్టణాలకు వీరు చేస్తున్న సేవలు వల్లే ఆరోగ్యంగా ఉంటూన్నాయని, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ మిషన్ విజయవంతం అవుతున్నాయని, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ అన్నారు. కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన ఎనిమిది మంది పారిశుద్ధ్య కార్మికులకు,10,000 రూపాయల తన సొంత నిధులతో నూతన వస్త్రాలు, నగదు, ఫలాలతో గ్రామపంచాయతీ వద్ద వీరిని ఘనంగా సత్కరించారు. ఊరు నిద్ర లేవక ముందే గ్రామాన్ని శుభ్రం చేస్తూ గ్రామానికి మంచి పేరు తెస్తున్నారని, సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి వెంకటేశ్వర్లు అన్నారు. ఒకరోజు పారిశుద్ధ్య కార్మికులు పనిచేయకపోతే, మన పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలన్నారు. మురమండ సహకార బ్యాంక్ అధ్యక్షులు వట్టికూటి జానకి రామయ్య. ప్రతి ఒక్కరూ వీరు సేవలను గౌరవించాలని, వీరి అభివృద్ధికి ప్రభుత్వాలు, ప్రజలు పాటుపడాలని ఎంపీటీసీ సభ్యురాలు మెల్లిమి మంగ గంగరాజు అన్నారు. గ్రామ ప్రజలు పారిశుద్ధ్యం పట్ల అవగాహన కలిగి సహకరించాలని గ్రామ టిడిపి అధ్యక్షులు దేవళ్ళ రామ్మోహన్ రావు (రాంబాబు) అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దూడల రాఘవ, ఉపసర్పంచ్ యర్రంశెట్టి వీరబాబు, మెల్లిమి గంగరాజు, ముంగమూరి చినబాబు, తూలురి శేషు, గొల్లపల్లి వీర సత్యనారాయణ, పల్లి ప్రసాద్ కార్మికుల సేవలను కొనియాడారు. తూలూరి రవి, పోలమాటి భాస్కర్ ఎ.శశిధర్, పంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సాంప్రదాయ పండుగల విశిష్టతను తెలుసుకోవాలి

### ఎం.ఎన్.ఆర్. కాలేజీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు - ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శనలు కాలేజీలో సంక్రాంతి శోభ




**అనపర్తి (మనసులో మాట)జనవరి 12:** తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతి పండుగ సంబరాలు సందర్భంగా ఎం.ఎన్.ఆర్. కాలేజీలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే పండుగ సంబరాలను అనపర్తిలో ఎం.ఎన్.ఆర్ కాలేజీ విద్యార్థులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో పండుగ సంబరాలు ఉట్టిపడే విధంగా రంగురంగుల అలంకరణలు, సాంప్రదాయ వాతావరణంతో ప్రాంగణం అంతా పండుగ కళను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.ఎన్.ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు ప్రజలు అనాదిగా జరుపుకుంటున్న పండుగల ప్రాముఖ్యతను, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ అవగాహనా చేసుకుని , భారతీయ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని భావి తరాలకు అందించాలని కోరారు. అదేవిధంగా కాలేజ్ ప్రిన్సిపాల్ తాడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పండుగ వెనుక ఉన్న ఆచారాలు, విలువలు సమాజాన్ని ఐక్యంగా నిలబెట్టే శక్తిగా పనిచేస్తాయని , ముఖ్యంగా సంక్రాంతి పండుగ రైతు సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రకృతితో మనిషి అనుబంధాన్ని చాటే పండుగగా సంక్రాంతి ని అభివర్ణించారు. విద్యార్థులు విద్యతో పాటు పండుగల విశిష్టత, సాంస్కృతిక , ఆధ్యాత్మిక ఆచారాలు, విలువల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని, సంప్రదాయాలు, సంస్కృతి మన వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులచే గొబ్బెమ్మలు, పతంగులు ఎగురవేయడం, హరిదాసు వేషధారణ, కోడి పందెం, ముగ్గుల పోటీలు వంటి సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించి అందరిని విశేషంగా ఆకట్టుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థుల ప్రదర్శనలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్స్ తేతలి రామభద్రారెడ్డి, ఎన్.నవీన్ మరియు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



## ఘనంగా సహృదయ మిత్ర మండలి రజతోత్సవ వేడుకలు

**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 12:** పట్టణంలోని స్థానిక శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలోని ఆదివారం సహృదయ మిత్రమండలి స్వచ్ఛంద సేవా సంస్థ 25 వసంతాల రజితోత్సవ సభ ఘనంగా జరిగింది. తొలుత మహాకవి రచయిత గురజాడ వెంకట గురజాడ అప్పారావు,స్వామి వివేకనంద ల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళు లర్పించారు. అనంతరం మిత్రమండలి అధ్యక్షులు తోట శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా కార్యదర్శి పి గంగా పావని ఆలపించిన "దేశమును ప్రేమించుమన్నా" అనే గురజాడ గేయంతో సభ ప్రారంభమైనది. ప్రధాన వక్తగా హాజరైన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ నేటి యువత చిన్న వయసులోనే తాగుడుకు,మత్తు పానీయాలకు బానిసలవుతూ , తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థుల,యువతు అలాంటి చెడు వ్యసనాలు మాని,యువజన దినోత్సవం సందర్భంగా వివేకానందుని ఆదర్శంగా తీసుకొని మంచి పౌరులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మిత్రమండలి వ్యవస్థాపకులలో ఒకరైన ఊటుకూరి కేశవరావు రజితోత్సవ సావనీర్ ను ఆవిష్కరించారు. సాహితీ వేత్త అవధానుల మణిబాబు సావనీర్ ను విశ్లేషణాత్మకంగా సమీక్షించారు. ఈ పుస్తకంలో సంఘ చరిత్ర మాత్రమే కాక,సైన్స్,సాహిత్యం,కళలు, పీఠికాపుర చరిత్ర మొదలగు ఎన్నో అంశాలతో కూడిన విజ్ఞాన భాండాగారంగా తనకు తోచుచున్నదని కొనియాడారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన అన్నపూర్ణ తల్లిపిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ పిఎన్ రాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సోమరితనాన్ని విడనాడాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కష్టించే తత్వాన్ని అలవరుచుకోవాలని అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని పిలుపునిచ్చారు. రజితోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, గీతాలాపన పోటీలలో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, పుస్తకాలను బహుకరించారు. 25 సంవత్సరాలుగా మిత్రమండలికి సహాయ సహకారాలు అందిస్తున్న పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా సత్కరించారు. ప్రముఖ వేణుగాన విధ్వంసులు గట్టి శ్రీకృష్ణదేవరాయలు గురజాడ వేషధారణలో సభికులను అలరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సూర్యరాయ గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి కొండేపూడి శంకరరావు,ఆంగ్ల అధ్యాపకులు కట్టా కృష్ణారావు, కాకినాడ జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కేఎంఎంఆర్ ప్రసాద్, జెవివి సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్,జాతీయ సైంటిఫిక్ మెజీషియన్ బుద్ధా శ్రీనివాసు, మేకా మన్మధరావు,శ్రీఆదర్శ హై స్కూల్ కరస్పాండెంట్ పిఎన్ వసంతా ప్రసాద్, నామా ఏసుదాసు, వరదా వీరభద్రరావు,కొమ్మనాపల్లి అప్పారావు,నక్కా సూర్యనారాయణ, మిత్రమండలి ఉపాధ్యక్షులు పోతుల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి చిన్నారి సతీష్,వై కరుణ కుమార్,సుబ్రహ్మణ్యేశ్వర రావు,సాల్మన్ రాజు,సహృదయ మండలి సభ్యులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కరపమండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక




**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** కాకినాడ కల్వరి సందేశ్ చర్చి నందు బిషప్. మేడపాటి రాజ కుమార్ అధ్యక్షతన కరపమండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కరపమండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ గా రెవరెండ్. మోసా థామస్ , వైస్. ప్రెసిడెంట్ గా రెవరెండ్. గాబ్రియేల్ , సెక్రటరీగా పాస్టర్. సవిలే కీర్తి , జాయింట్ సెక్రటరీగా రెవరెండ్. ఎం. డానియల్ , ట్రెజరర్ గా పాస్టర్.ప్రభుదాస్ ,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా సిస్టర్ సుమ సామ్యూల్ , రెవరెండ్. ఎస్. విజయ్ కుమార్ గ , రెవరెండ్. చెక్కా యేసేబు ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రదర్ కనికెళ్ళ రాజ బాబు దైవ సందేశాన్ని అందించారు. సిస్టర్ సుమ సామ్యూల్ కమిటీ సభ్యులకు ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు.

## స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయం



ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి12: స్వామి వివేకానంద 163 వ జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామ సచివాలయం వద్ద బీజేపీ సీనియర్ నాయకులు కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి గారు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వివేకానంద బోధనలు అనుసరించాలని, భారత దేశ సంస్కృతిని చికాగో సర్వమత సమ్మేళనం లో చాటి చెప్పిన మహనీయుడని, ఇనుప కండరాలు, ఉక్కు నరాలు,వజ్ర సంకల్పంతో ఉన్న యువత ఈ దేశానికి చాలా అవసరమని చెప్పిన ఆదర్శ పురుషుడు నరేంద్రుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, మండల టీడీపీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, ఎన్డీయే కూటమి నాయకులు ధనేకుల వీర భద్రరావు, సొసైటీ డైరెక్టర్ అదృష్ట దేవుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ వనుం మంగ,వెలుగురి హరేరామ,సాగి బంగార్రాజు, అచ్చే వీరబాబు, బచ్చుల శివ,దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుండి ఇద్దరు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 11:** తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పీ జయకర్ రాష్ట్ర కార్యదర్శిగా, ఐడీకేడీ రాజేశ్వరి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లాలో జరుగుతున్న యూటీఎఫ్ రాష్ట్ర 51వ కౌన్సిల్ సమావేశంలో భాగంగా ఆదివారం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఇప్పటి వరకు తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన జయకర్ రాష్ట్ర కార్యదర్శి గాను, రాష్ట్ర కౌన్సిలర్ గా పని చేస్తున్న రాజేశ్వరిని కార్యవర్గ సభ్యులుగాను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా నుంచి వీరి ఎంపిక కావడం పట్ల రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎన్ అరుణకుమారి, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వీవీ రమణ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈవీఎస్ఆర్ ప్రసాద్, ఏ షరీఫ్, ఉపాధ్యక్షులు జే రూపస్ రావు, ఎం విజయ్ గౌరీ, యూటీఎఫ్ రాష్ట్ర పత్రికా ఉప సంపాదకులు చిలుకూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు అభినందనలు తెలియజేశారు.

## గత సంవత్సరం కొట్లాట్లో రక్తం చిందింది

### ఈ సంవత్సరం ఏర్పాటులకుసన్నాహాలు



గోకవరం (మనసులో మాట), జనవరి 12 :గోకవరం మండలం కొత్తపల్లి గ్రామం లో ప్రభుత్వ స్థలములో సంతమార్కెట్ వద్ద కోనేరు ఆవరణలో పేకాట, గుండాట జూద క్రీడలు ఏర్పాట్లుకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయ్యాని కొత్తపల్లి గ్రామానికి చెందిన, కాకినాడ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, ఆర్ టి ఐ వింగ్ నున్నం రాంబాబు ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే ప్రాంతంలో సంక్రాంతి పేరుతో జరిగిన కోడిపందాలో కొట్లాట్లో రక్తము చిందిందన్నారు. ఈ సంవత్సరమైనా పోలీసులు తక్షణం స్పందించి ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి ప్రభుత్వ స్థలములో ఆడకుండా నిరోధించాలని నున్నం రాంబాబు డిమాండ్ చేశారు.

### శాస్త్రోక్తంగా నీరాటోత్సవ వేడుకలు

## భక్తిశ్రద్ధలతో గోదాదేవికి అభిషేకాలు..



**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 12:** ప్రముఖ వైష్ణవ దివ్యక్షేత్రమైన శ్రీ కుంతీ మాధవ స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కనువిందుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం గోదాదేవి అమ్మవార్లకు 'నీరాటోత్సవాన్ని' ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ఆచార్యులు అమ్మవారికి విశేష అభిషేకాలను, అర్చనలను వైదికంగా పూర్తి చేశారు. ధనుర్మాస వ్రతంలో భాగంగా నిర్వహించే ఈ నీరాటోత్సవాలు ఐదు రోజులు నిర్వహించడం జరుగుతుందని నేడు మూడవ రోజు అని ఆలయ పండితులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, తీర్థప్రసాద వినియోగం ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. ఐదో రోజున గోదా కళ్యాణం కన్నుల పండగగా జరుగుతుందని భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో బొడ్డేపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు.

# సంక్రాంతికి ముందే సందడి..

- ►► పల్లె శోభతో అలరారిన లలితా నగర్-కనువిందు చేసిన రంగవల్లులు
- ►► పార్టీ రహితంగా తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు
- ►► పంతం కొండల రావు సారథ్యంలో.. వేడుకలు అదరహో




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:** నగరానికి తరకివచ్చిన పల్లె వాతావరణాన్ని రాజమహేంద్రవరం వాసులు ఆస్వాదించారు. సోమవారం సాయంత్రం స్థానిక లలితా నగర్ కనకదుర్గ జంక్షన్ వద్ద పంతం సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్టు, నామన వాసు, లలితా నగర్ ఫ్రెండ్ సర్కిల్ సంయుక్త సారథ్యంలో నిర్వహించిన 'సంక్రాంతి ముందస్తు సంబరాలు' చూపరులను గ్రామీణ ప్రాంతాలలో తిరుగాడుతున్న అనుభూతిని కల్పించాయి. ఒక వైపు గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, హరిదాసుల కీర్తనలు, సాంప్రదాయ కోడి పందాలు, భోగి మంటలు, ఎడ్ల బండ్లు, గరగలు, చెరకు గడలతో అందమైన అలంకరణలు, మట్టి కుండల తయారీ..ఇలా అచ్చం పల్లె వాతావరణాన్ని సీసీసీ ఎండీ పంతం కొండలరావు ప్రత్యేక పర్యవేక్షణలో సృష్టించేశారు. అక్కడ అడుగడుగునా పంతం కొండలరావు మార్క్ స్పష్టంగా కనిపించింది. దీనికి తోడు మహిళల రంగవల్లుల పోటీలు ప్రత్యేక ఆకర్షణను తెచ్చాయి. ఈ ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించేందుకు పార్టీ రహితంగా నగరంలోని వివిధ రాజకీయ ప్రముఖులు తరలివచ్చి..సీసీసీ ఎండీ పంతం కొండలరావును, ఆయన అనుచర బృందాన్ని, సహకరించిన ప్రతీ ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందించారు. గత 13 సంవత్సరాలుగా "సంక్రాంతి సంబరాలను" రెండు మూడు రోజులు ముందుగా నిర్వహించి, నగరంలో సందడి వాతావరణాన్ని తీసుకొస్తున్న పంతం కొండలరావు నిజంగా అభినందనీయుడని వక్తలు మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ సంబరాలలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి, చల్లా శంకరరావు, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు తదితర నగర ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



## కాకినాడ జిల్లాలో కోడిపందాల నిరోధానికి చర్యలు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** రాబోవు సంక్రాంతి పండుగ సందర్భంగా హైకోర్టు ఆదేశాల తో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలు మరియు సూచనల మేరకు, కాకినాడ జిల్లా వ్యాప్తంగా కోడిపందాలు, జూదం మరియు ఇతర అక్రమ కార్యకలాపాలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుంది. ఈ క్రమంలో జిల్లా లోని గ్రామీణా ప్రాంతాలలో పోలీసుల ద్వారా విస్తృతస్థాయి పర్యటనలు, తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. కోడిపందాలు నిర్వహించే అవకాశం ఉన్న ప్రదేశాలలో పోలీసు సిబ్బంది బ్యానర్ల ద్వారా, ఆటోలతో ప్రచారం మరియు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, కోడిపందాలు నిర్వహించడం చట్టవిరుద్ధం అని అంతేకాకుండా కోడి పందేలు నిర్వహించుటకు అవకాశం ఉన్న ప్రదేశాలను ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలోని పోలీస్ సిబ్బంది సదరు ప్రదేశాలను ట్రాక్టర్లతో దున్నించి పాడుచేయటం జరిగింది. రాబోవు సంక్రాంతి పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని మరియు ఇతర క్రీడల వైపు దృష్టి పెట్టి మంచి వాతావరణంలో సంక్రాంతి ని జరుపుకోవాలని స్పష్టంగా తెలియజేశారు. ప్రజలకు తెలియజేయునది ఏమనగా కోడిపందాలు, జూదం, గుండాటలు మరియు జంతువులపై హింస పూర్తిగా నిషేధితం. కోడిపందాలు నిర్వహించినా, పాల్గొన్నా, ప్రోత్సహించినా సంబంధిత నిర్వాహకులు, పాల్గొనేవారు, భూయాజమానుల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. అక్రమ కార్యకలాపాలకు వినియోగించిన ట్రాక్టర్లు, వాహనాలు మరియు ఇతర పరికరాలు స్వాధీనం చేసుకోబడతాయి. అవసరమైతే అనుమానితులపై బౌండ్ ఓవర్ చర్యలు మరియు ఇతర నిరోధక చర్యలు చేపట్టటం జరుగుతుంది. కాకినాడ జిల్లా పోలీసు ప్రజలను శాంతియుతంగా, చట్టబద్ధంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని కోరుతున్నది. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే, సమీప పోలీస్ స్టేషన్‌కు వెంటనే తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళల అభ్యున్నతికి కూటమి సర్కార్ పెద్దపీట

### ప్రధానమంత్రి ఉజ్వల యోజన 3.0 ఉచిత గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి

### పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలి



**రంపచోడవరం (మనసులో మాట) జనవరి 12..** మహిళలు గ్యాస్ వినియోగం పై మంచి అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. జిపి సీఎం సొసైటీ భారత్ గ్యాస్ ఏజెన్సీ -రాజవొమ్మంగి బ్రాంచ్ ఆధ్వర్యంలో డివిజనల్ మేనేజర్ ఎమ్. విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం ప్రధానమంత్రి ఉజ్వల యోజన 3.0 ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమెకు గిరిజన సహకార సంస్థ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కట్టెలు పొయ్యితో మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నా రన్నారు. వీటితో పొగ ద్వారా ఆరోగ్యాలు పాడైపోయే అవకాశాలు ఉన్నందున పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ మహిళా గ్యాస్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. దానిలో భాగంగా ఇప్పటి వరకూ గ్యాస్ కనెక్షన్లు పొందని మహిళలను గుర్తించి ఉచితంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన 3.0 పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత గ్యాస్ పథకం అందించినట్లు తెలిపారు. ఏదైతే హామీలు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిందో అంతకంటే ఎక్కువే పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంక్రాంతి కానుకగా ఈ పథకంలో మహిళలకు లబ్ది చేకూర్చినట్లు స్పష్టం చేశారు. దీనిలో భాగంగా అడ్డతీగల సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు 238 మంది లబ్ధిదారులకు ఉజ్వల యోజన పథకంలో గ్యాస్ కనెక్షన్లు మంజూరు అయినట్లు తెలిపారు. అడ్డతీగల-69, రాజవొమ్మంగి -155, గంగవరం-1, మరియు వై.రామవరం-11 మంది లబ్దిదారులకు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. ఆయా లబ్ధిదారులకు ఉచితంగా సిలిండర్, రెగ్యులేటర్, స్టవ్, రబ్బరు ట్యూబ్, గ్యాస్ పుస్తకం అందజేశారు. వాస్తవముగా అవి కొనుగోలు చేయాలంటే ఒక్కో లబ్దిదారునికి 4552 రూపాయల ఖర్చు అవుతుంది కానీ కూటమి ప్రభుత్వం ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. వాటిని లబ్ధిదారులకు ఆమె చేతులు మీదుగా పంపిణీ చేశారు. గ్యాస్ సరఫరా, గ్యాస్ కనెక్షన్లు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది చూడాలని సూచించారు. కార్యక్రమం లో ఏ పి ఐ ఐ సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఏ ఎం సి చైర్మన్ లోతా లక్ష్మణరావు, ఏ ఎం సి డైరెక్టర్ గట్టి మాణిక్యం, స్థానిక సర్పంచ్ రమణి, ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు ముప్పన సావిత్రి,, మండలపార్టీ ఉపాధ్యక్షులు జెట్టి మధు,ముప్పన మోహన్, పెడిరెడ్ల సత్తిబాబు, రాజవొమ్మంగి ఎంపీడీఓ లోకుల యాదగిరీశ్వరరావు, జీసీసీ సిబ్బంది బుచ్చిరాజు, రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పలు శాఖల సిబ్బంది కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## స్వామి వివేకానందకి ఘన నివాళి

### - వివేకానంద మెమోరియల్, స్పోర్ట్స్ క్లబ్, రీడింగ్ రూం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 12:భారత దేశపు గొప్ప ఆధ్యాత్మిక సామాజిక నాయకులలో ఒకరైన స్వామి వివేకానంద 164వ జయంతి, జాతీయ యువజన దినోత్సవ వేడుకలను సోమవారం అన్నపూర్ణమ్మ పేటలోని స్వామి వివేకానంద మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ అండ్ రీడింగ్ క్లబ్బు సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ సభ్యులందరూ హాజరై వివేకానందుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సూర్యనారాయణ,జాంశెట్టి గాంధీ, ప్రసాదుల హరినాథ్, ఆవాల దుర్గాప్రసాద్, ఎం చంద్రశేఖర్, ఏ మల్లికార్జునరావు, బురిడి త్రిమూర్తులు, వీ శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## 7 లక్షల రూపాయలు విలువైన చెక్కుల పంపిణీ



**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 12:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్యానికి, ఆపదలో ఉన్న కుటుంబాలకు అభయ హస్తంలా నిలుస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ పేర్కొన్నారు. సోమవారం యు.కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి, సుమారు రూ. 7 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మాయపట్నం, సుబ్బంపేట, కొమరగిరి, రమణక్కపేట తదితర ప్రాంతాలలో వర్మ పర్యటించారు..ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా ఖరీదైన వైద్య ఖర్చులతో ఇబ్బంది పడుతున్న వారికి ఈ నిధి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. సకాలంలో అందించే ఈ ఆర్థిక సహాయం అనేక కుటుంబాలను అప్పుల ఊబి నుంచి కాపాడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కోనసీమలో టూరిజం అభివృద్ధికి ఆత్రేయపురం ఉత్సవం దోహదం

### డ్రాగన్ పడవల పోటీలు మంగళవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహణ - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట (మనసులో మాట) జనవరి 12..** కోనసీమలో టూరిజం అభివృద్ధికి ఆత్రేయపురం ఉత్సవం, డ్రాగన్ పడవల పోటీలు దోహదపడతాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆకుల రామకృష్ణ అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోటీదారులతో సోమవారం జరిగిన డ్రాగన్ పడవల పోటీలు అద్భుతంగా సాగాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ,కేరళ, మహారాష్ట్రలకు చెందిన జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయన్నారు. ఉచ్చిలి నుంచి తాడిపూడి వంతెన వరకు 1000మీటర్ల దూరం సాగిన ఈ పడవల పోటీల్లో టైం ఆధారంగా విజేతలను నిర్ణయించారు. ఈ పోటీల్లో మొత్తం 22 జట్లు పోటీ పడగా 6 జట్లు సెమీఫైనల్స్ కు ఎంపికయ్యాయని తెలిపారు. ఎంపికైన జట్లను అభినందించారు. కేరళ (అలెప్పీ), బండారు, కోనసీమ, పల్నాడు -1, కర్నూలు, ఎర్ర కాలువ జట్లు మంగళవారం సెమీఫైనల్స్ లో పోటీపడనున్నాయని తెలిపారు. సెమీఫైనల్స్, ఫైనల్స్ మంగళవారం నిర్వహిస్తామన్నారు. గాలిపటాల పోటీ సైతం మంగళవారం జరుగుతుందన్నారు. లొల్ల లాకుల వద్ద ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్, ఎగ్జిబిషన్లను పరిశీలించారు. లొల్ల లాకుల వద్ద ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్, ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుందన్నమని. ముగ్గుల పోటీలు మహిళల ఆదరణ పొందాయన్నారు. ఆత్రేయపురం ఉత్సవం ముగిసిన తరువాత సైతం లొల్ల లాకుల వద్ద పర్యాటకులు తరలివచ్చేలా, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరంగా గడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. లొల్ల లాకుల వద్ద శాశ్వతంగా టూరిజం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వైభవం టెంపుల్ టూరిజానికి దోహదపడుతుందని, లొల్ల, ఆత్రేయపురం పరిసర ప్రాంతాలను ఎకో టూరిజంలో అభివృద్ధి చేసుకుని ఈ ప్రాంతం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు.




### జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో

## స్వచ్ఛంద రక్తదానం

**కాకినాడ (మనసులో మాట) జనవరి 12..** జిల్లాలో జాతీయ యువజన దినోత్సవం మరియు స్వామి వివేకానంద జన్మదినము సోమవారం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు స్వచ్ఛంద రక్తదాన శిబిరములను ఏర్పాటు చేయడము జరిగినది. ఈ కార్యక్రమములో భాగముగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎఫ్.ఎ.సి.) జిల్లా లేప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డా.ఎస్.చలమయ్య ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రభుత్వ రక్త నిధి కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్త దాన శిభిరాములో పాల్గొని, రక్తదాతలకు ప్రశంస పత్రములను అందించుట జరిగినది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 10 రక్తదాన శిబిరాలలో 298 యూనిట్ల రక్తాన్ని సేకరించుట జరిగినది. ఈ రక్తదాన శిబిరాలలో వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు మరియు యువత పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
మంగళవారం 13 జనవరి 2026


# రక్తదాన శిబిరమునకు విశేష స్పందన..

## - ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తిపేంద్ర నాయక్



**ధర్మవరం జనవరి 12 (మనసులో మాట)..** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరమునకు విశేష స్పందన రావడం జరిగిందని ప్రభుత్వాసుపత్రి సూపర్డెంట్ తిపేంద్ర నాయక్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూజాతీయ యువజన దినోత్సవ సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ధర్మవరం నందు రక్త దాన శిబిరం నిర్వహించడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు హాజరుకావడం జరిగింది అన్నారు. రక్త శిబిరానికి విశేష స్పందన రావడం పట్ల రక్తదాతలకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేయడం జరిగిందన్నారు. అనంతరం హరీష్ బాబు మాట్లాడుతూ జీవసేవనే శివ సేవ గా భావించి సాటి మనిషి హృదయం లో సంతోషాన్ని ఆనందాన్ని నింపగల్గిన మానవుని జన్మ ధన్యము అని, స్వామి వివేకానందుని స్ఫూర్తితో ఇవాల ధర్మవరం నందు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వారి ఆద్వర్యం లో రక్త దాన శిబిరం నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి మైత్రి మహిళా సంగం, అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కలశాల విద్యార్థులు , ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఆర్ఎంఓ హరి, శ్రీనివాసులు, డాక్టర్ వైష్ణవి , జిల్లా కుష్టు వ్యాధి ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ అనుపమ, జెమ్స్ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం , మురళి క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ రమణ, రక్త నిల్వ కేంద్రం హరి ,నారాయణమ్మ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## స్వామి వివేకానంద సేవలు

# చిరస్మరణీయం..

## ముఖ్యఅతిథి హిందీ పండిట్ వేణుగోపాలాచార్యులు.

**ధర్మవరం జనవరి 12 (మనసులో మాట)..** స్వామి వివేకానంద సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోయా యని హిందీ పండిట్ వేణుగోపాలాచార్యులు తెలిపారు. స్థానిక రేగాటిపల్లి రోడ్డు నందు గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో వారు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతులైన యువతి యువకులు దేశ సేవ కోసం ఎలా పాటుపడాలి అన్నది తెలిపిన మహోన్నత వ్యక్తి వివేకానందుల వారు అని, అటువంటి మహనీయుడి దినోత్సవాన్ని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాల అకడమిక్ ఇంచార్జి కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా మన దేశ ఔన్నత్యాన్ని, క్రమశిక్షణతో కూడిన విద్య గురించి అలాగే మన సంస్కృతి సంప్రదాయాలను ఎలుగెత్తి చాటి చెప్పిన వ్యక్తి వివేకానందుల వారు అని, వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి కేకును కట్ చేసి, మిఠాయిలను అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి రమేష్, ఎన్ఎస్ఎస్ పిఓ శ్రీనివాసులు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీనివాసులు మెమోరియల్

# అండర్ 12 బాలుర క్రికెట్ టోర్నమెంట్



ధర్మవరం జనవరి 12 (మనసులో మాట) పట్టణంలోనిఆర్డిటి గ్రౌండ్లో అండర్ -12 బాలుర మండల స్థాయి టోర్నమెంట్ ఘనంగా జరిగింది.ఈ టోర్నమెంట్ లో భాగంగా మొదటి మ్యాచ్ లో ఆర్డిటి ధర్మవరం, బత్తలపల్లి జట్ల మ్యాచ్ ని టిడిపి నాయకులు సంధా రాఘవ , కొత్తపేట ఆది , జింక పురుషోత్తం జింకల రాజన్న , రాఘవ మిత్రబృంధం, ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ హనుమంతప్ప , బత్తలపల్లి ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు , ఆర్ డి టి ధర్మవరం ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు పిల్లల తల్లిదండ్రులు హాజరు కావడం జరిగింది. అనంతరం కోచ్ రాజశేఖర్ మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్ హోరాహోరీగా నిర్వహించగా,టాస్ గెలిచిన బత్తలపల్లి జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది అని, ధర్మవరం జట్టు 20 ఓవర్లలో 242/1 పరుగులు చేసింది అని తెలిపారు. గోవర్ధన్ 50 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్ తో 101పరుగులు చేశాడు అని తెలిపారు. బద్రీనాథ్ 27 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 64 పరుగులు చేశాడన్నారు. వేద వ్యాస్ 38 బంతుల్లో 6 ఫోర్లతో 61 పరుగులు చేశారన్నారు. బత్తలపల్లి 20 ఓవర్లలో 81/5 పరుగులు చేసిందన్నారు. బ్యాటర్ తౌఫిక్ 51 బంతుల్లో 8 ఫోర్లతో 42 పరుగులు చేశాడని, ధర్మవరం మ్యాచ్లో 161 పరుగుల తేడాతో విజయం సాధించింది అని తెలిపారు. అనంతరం విజేతలకు సంద రాఘవ బహుమతులను, ట్రోఫీలను అందజేశారు. తదుపరి క్రికెట్ టోర్నమెంట్ తరఫున సంద రాఘవ ను కోచు రాజశేఖర్ తో పాటు క్రికెట్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు.

# భూసమస్యల పరిష్కారంలో వేగం పెంచండి

## – రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



**ధర్మవరం జనవరి 12 (మనసులో మాట)..** ధర్మవరం డివిజన్ పరిధిలోని రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఉన్న భూసమస్యలకు వేగంగా పరిష్కారం చూపించాలని ధర్మవరం ఆర్డీఓకు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే రెవెన్యూ క్లినిక్ కార్యక్రమానికి పరిటాల సునీత రావడం జరిగింది. ఆర్డీఓ మహేష్ ను కలిసి ప్రస్తుతం పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నేపథ్యంలో రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను వివరించారు. భూ వ్యత్యాసాలు, భూ వర్గీకరణ, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు సర్వే నంబరు తప్పిదాలు, జాయింట్ ఎల్పీఎంలు, మిగులు భూములువంటి వాటి గురించి వివరించారు. ఈ సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లు, వీఆర్ఓలు ఇతర సిబ్బంది వేగంగా పని చేసేలా చూడాలని కోరారు. రైతులకు వీటిపై అవగాహన కల్పిస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. దీనిపై ఆర్డీఓ కూడా సానుకూలంగా స్పందించారు. కొన్నింటికి అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ భూఆధారిత సమస్యల పరిష్కారంపై ఈ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని ఇప్పటికే రెవెన్యూ మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో భూముల రికార్డులను అస్తవ్యస్తం చేశారన్నారు. పైగా తన సొమ్ము ఏదో ఇచ్చినట్టు పాసుబుక్కుల్లో జగన్ రెడ్డి తన ఫోటో వేసుకున్నారని విమర్శలు చేశారు.ఆ రోజు ఐఏఎస్ లు ఎందుకు దీనికి అడ్డు చెప్పలేదో అర్థం కావడం లేదన్నారు. మా ప్రభుత్వం వచ్చాక సమస్యల్ని పరిష్కరిస్తూ రాజముద్రతో పాసుపుస్తకాలు ఇస్తున్నామన్నారు. గతంలో జరిగిన తప్పుల్ని సరి చేస్తున్నామని.. ఇది రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాయింట్ గా ఉన్న భూముల విషయంలో రైతులు ఒక నిర్ణయానికి రావాలని.. వీటిపై పంతంతో ఉంటే మీ పేరుతో ఎక్కువ భూములు చూపిస్తాయన్నారు. దాని వలన మీకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందకపోవచ్చని అన్నారు. పరస్పరం అంగీకారంతో మీరు అధికారుల వద్దకు వెళ్తే.. మీరు మీకున్న పొలం ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకునే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

## ఈ నెల 18న చలో ఖమ్మం

# జయప్రదం చేయండి

## - సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్



**ధర్మవరం జనవరి 12 (మనసులో మాట)..** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఈనెల 18వ తేదీన ఖమ్మం లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు 5 లక్షల మంది దాకా సిపిఐ కార్యకర్తలు పాల్గొంటారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ధర్మవరం పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలుపూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మం జిల్లాలో ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని దీన్ని జయప్రదం కోరుతూ శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈనెల 17 తారీఖున ధర్మవరం నుంచి ఖమ్మం కు సిపిఐ ప్రత్యేక రైలు ఏర్పాటు చేసిందని, కావున ప్రతి కార్యకర్త చలో ఖమ్మం రావాలని పిలుపునిచ్చారు. ఈ శతాబ్ద కాలంలో సిపిఐ ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు ,ఎంతో మంది అమరువీరుల రక్త తర్పణంతో ఎన్నెన్నో విజయాలు సాధించి, భారత దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నదని భూమి కోసం, భుక్తి కోసం, నిరంకుశ నిజామును గద్దె దించడానికి జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ది అని తెలిపారు. ఫలితంగానే పాలకులు భూ సంస్కరణ చట్టం గరీబీ హటావో బ్యాంకుల జాతీయ కర్ణ అనే సంస్కరణలు చేయాల్సి వచ్చింది అన్నారు. పోరాటాల ద్వారా దేశంలోనే అనేక కార్మిక సంక్షేమ చట్టాలను సాధించింది అని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ యూపీఏ ప్రభుత్వంలో చరిత్రత్మక సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం అటవీ హక్కుల చట్టం తీసుకురావడానికి సిపిఐ కృషి చేసిందనీ పేర్కొన్నారు. కావున చలో ఖమ్మం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వెంకట నారాయణ, వెంకట స్వామి, శీలా నారాయణ స్వామి, చేతి వృత్తిదారుల సంఘం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాస్, శ్రీధర్, మహిళా సమైక్య నాయకులు లలితమ్మ, లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**పలమనేరు జనవరి 12( మనసులో మాట):** పట్టణమునందు ఐ సి డి ఎస్ అర్బన్ సెక్టార్ గాంధీ నగర్ అంగన్వాడి కేంద్రంలో వర్కర్ సుబ్బమ్మ అధ్యక్షతన ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంక్రాంతి సంబరాల కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ ఉమారాణి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఉమారాణి మాట్లాడుతూ.... భారతదేశంలో సంక్రాంతి పండుగ అంగరంగ వైభవముగా జరుపుకోవడంతో పాటు వివిధ రకాల సాంప్రదాయ కార్యక్రమాలు నైపుణ్యతలను ప్రదర్శించి పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. ప్రజలు చేసే పండగలు అన్నిటిలోన ఈ సంక్రాంతి పండుగకు ఓ ప్రత్యేకత గుర్తింపు ఉందని కులాలు మతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకుంటారని గుర్తు చేశారు. సంక్రాంతి సంబరాలు కోసం ఉదయం నుండి అంగన్వాడి కేంద్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అక్కడ హాజరైన అంగన్వాడి వర్కర్లు వివిధ రకాల ముగ్గులు వేసి సంక్రాంతి పండుగకు ఏ ఏ వస్తువులను అలంకరిస్తారో ఆ విధంగా డిజైన్ చేసి పలువురుని ఆకర్షింప చేశారు. అదేవిధంగా చిన్నపిల్లల చేత వివిధ రకాల వేషధారణలతో ప్రత్యేకమైన ప్రదర్శనలు నిర్వహించారు. దాన్ని చూసి చుట్టుపక్కల ప్రజలు ఎప్పుడూ ఎవరు చేయలేని సంక్రాంతి సంబరాలు అంగన్వాడీ సిబ్బంది నిర్వహించి ప్రజల హృదయాల్లో నిలిచారు. ఈ అద్భుతమైన కార్యక్రమం ఆ ప్రాంతంలో పలువురిని ఆకర్షింప చేయడంతో పాటు ప్రత్యేకమైన మంచి వాతావరణం సంతరించుకుందన్నారు. సంక్రాంతి పండగ ప్రత్యేకతను అక్కడ హాజరైన స్థానికులకు క్లుప్తంగా వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు చిలకమ్మా, భాగ్యమ్మ, మహేశ్వరి, అనసూయ, శాంతి, లతా, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేను సన్మానించిన జిల్లా స్పోక్స్ పర్సన్ బత్తిగౌడు

**పలమనేరు జనవరి 12 ( మనసులో మాట):** పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని తెలుగుదేశం పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్ బత్తి గౌడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించి పార్టీ పదవిని కట్టబెట్టినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు,గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్,నాయకులు వెంకటేష్ గౌడ్,గిరిధర్ గోపాల్, చలపతి గౌడ్, మునెప్ప గౌడ్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ అసిస్టెంట్లు రివ్యూ మీటింగ్



**పలమనేరు జనవరి 12( మనసులో మాట):** పలమనేరు సబ్ యూనిట్ ఆఫీసర్ కే.సి. జయశంకర్ ఆధ్వర్యంలో పలమనేరు సబ్ యూనిట్ లోని హెల్త్ అసిస్టెంట్లు అందరికీ నెలవారి రివ్యూ మీటింగ్ జరిగినది. ఈ రివ్యూ మీటింగ్ నందు నెలవారి రికార్డులను తనిఖీ చేశారు. ఇంకా ఏ రికార్డ్స్ మెయింటైన్ చేయవలెనో తెలియజేశారు. అంతేకాకుండా ఫీల్డ్ లెవల్లో అందరూ యాక్టివ్ సర్వేలెన్సు ప్రతిరోజు చేయవలసినదిగా ఆదేశించారు. వెక్టార్ బార్న్ డిసీజెస్, వాటర్ బార్న్ డిసీజెస్, ఫుడ్ బార్న్ డిసీజెస్ గురించి ప్రజలకు విస్తృతముగా అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలలో,వార్డులలో సందర్శించినప్పుడు పైప్ లైన్ లీకేజెస్ మొదలైనవి ఐడెంటిఫై చేసి పంచాయతీ, వార్డ్ సెక్రటరీలకు తెలియజేసి లీకేజెస్ అరికట్టవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెన్స్ మహబూబ్ బాషా, రవి, బలరాం, యరపరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముదిగుబ్బ రూరల్ పోలీస్ స్టేషన్ను తాళం వేసి

# మూసివేయడం పై ప్రజా ఆగ్రహం



**ముదిగుబ్బ జనవరి:12 (మనసులో మాట)..** ముదిగుబ్బ రూరల్ పోలీస్ స్టేషన్లో సోమవారం చోటుచేసుకున్న ఘటనపై ప్రజా సంఘాలు, బాధితులు, ప్రజా నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్కు వచ్చిన బాధితులు పోలీస్ అధికారుల కోసం గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ, స్టేషన్ తాళం వేసి ఒక్క సిబ్బంది కూడా లేకపోవడంతో వినతులు ఇవ్వలేక వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా కొంతమంది ప్రజా నాయకులు కూడా పోలీస్ స్టేషన్కు వచ్చి, అక్కడ ఎవరూ లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్లారు. బాధ్యతగల పోలీస్ స్టేషన్ను పూర్తిగా మూసివేసి సిబ్బంది ఇళ్లకు వెళ్లడం అనేది సరైన చర్య కాదని, చట్టబద్ధతకూ ప్రజాస్వామ్య విలువలకూ విరుద్ధమని ప్రజా సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. పోలీస్ స్టేషన్ అనేది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కీలక ప్రజాసేవ కేంద్రం. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం వచ్చే ప్రజలకు స్టేషన్ మూసివేసి ఉండడం వల్ల ప్రజల భద్రతపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే అమర్



**పలమనేరు జనవరి 12 ( మనసులో మాట):** సంక్రాంతి సందర్భంగా తమ స్వగ్రామం నారావారిపల్లెకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి స్వాగతం తెలియజేశారు. ఆమేరకు నారావారిపల్లి సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన సీఎంతోపాటు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు స్వాగతం తెలిపారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

మంగళవారం 13 జనవరి 2026




# యూరియా వాడకం తగ్గించండి

- రైతులకు మంత్రి తుమ్మల సూచన
- డ్రోన్ స్ప్రేను ప్రారంభించిన మంత్రి



**ఖమ్మం, జనవరి 12:** పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్ కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాతలందరికీ అధికారులు డ్రోన్ల మీద అవగాహన కల్పించాలని సూచించారు. తాను పంటలకు యూరియా వేయనని, యూరియా వేయకపోతే పురుగుమందు వాడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. యూరియా ఎంత కావాలంటే అంత ఇస్తామని, కానీ అది పంట చేలకు అరిష్టమని తెలిపారు. ప్రతిపక్షాలు యూరియా మీద పబ్బం గడపాలని చూస్తున్నాయని విమర్శలు గుప్పించారు. పామాయిల్, కొబ్బరికి డ్రోన్ అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మిషన్లు కనిపెట్టాలని శాస్త్రవేత్తలను కోరారు. అన్ని దేశాల్లో మన దేశం నంబర్ వన్ అని, అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్ర నంబర్ వన్‌గా ఉండాలనేదే తన ఆకాంక్షని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ



- విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి
- తెలంగాణకు సుప్రీం ధర్మాసనం సూచన
- కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్

**న్యూఢిల్లీ, జనవరి 12:** పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖ లు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్య వర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించు కోవచ్చనీ అభిప్రాయపడింది. అయితే.. తెలంగాణ ప్రభు త్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎ లాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరపున సీనియర్ న్యాయవాది అబిషేక్ మను సింఘ్వి మరోసారి వాదనలు వినిపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పే ర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీ టిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదించిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపి వేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయ డంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

## సుప్రీంలో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ

**న్యూఢిల్లీ, జనవరి 12:** నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు. పిటిషన్ ఉపసంహరణ నేపథ్యంలో కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వానికి సీజేఐ కీలక సూచనలు చేశారు. నల్లమల సాగర్ అంశంపై రిట్ పిటిషన్ ద్వారా ముందుకు వెళ్లడం ప్రయోజనకరం కాదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు రిట్ పిటిషన్ సరైన మార్గం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లమలసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వాదనలు, అభ్యంతరాలను వినిపించాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించారు. అదే సరైన న్యాయపరమైన మార్గమని అభిప్రాయపడ్డారు. తెలంగాణా ప్రభుత్వం పిటిషన్ ఉపసంహరించుకోవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ ఆఫ్ చేసినట్లు ఆయన ప్రకటించారు. దీంతో భవిష్యత్తులో సివిల్ సూట్ రూపంలో ఈ అంశం మరోసారి కోర్టు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టుపై తెలంగాణా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచా వత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తన పిటి షన్‌లో పేర్కొంది. చట్టపరంగా మరింత పటిష్ఠంగా వ్యవహరించాలనే సుప్రీంకోర్టు సూచ నతో తెలంగాణా ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకుంది. కేవలం పాలనాపరమైన ఉత్తర్వుల కోసం కాకుండా, శాశ్వత పరిష్కారం కోసం సివిల్ సూట్ ద్వారా న్యాయపోరాటం చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గోదావరి జలాల తరలింపుపై ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన వాదనలు వినిపించే అవకాశం ఉంటుందని సర్కార్ భావిస్తోంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

**డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్, జనవరి 12:** సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుంది. సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.




# అశాస్త్రీయంగా జిల్లాల విభజన

**వాటిని సరిదిద్ది పాలనాపర ఇబ్బందులు తొలగిస్తాం**

- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- టీజీఓ డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్



**హైదరాబాద్, జనవరి 12:** తెలంగాణలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పా టును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరిం త సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పా టు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం విమర్శించారు. జిల్లాల సరిహ ద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం వెల్లడించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని.. ఇలాంటి సమస్యలను పరి ష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిష న్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కమిషన్ ఆ రం నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మం డలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, బ్జడెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ సారథులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'మా ప్రభుత్వ వారధులు.. సారథులు ప్రభుత్వ ఉద్యోగులే. ఆనాడు ప్రభుత్వం తప్పుడు పనులను ఉద్యోగులపై ఒత్తిడి చేసి అమలు చేయించింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'నేను అన్నగా వచ్చాను. ఇప్పుడు నేను 18 గంటలు పనిచేస్తున్నాను. ఈరోజు డీఏ ఫైల్ మీద సంతకం చేసి వచ్చాను. దీంతో ప్రభుత్వానికి రూ.227కోట్ల భారం పడుతుంది' అని రేవంత్ రెడ్డి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ ఉద్యోగికి రూ.1.02 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు. ఇద్దరం కలిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి' అని సీఎం అన్నారు. అలాగే, భూములు, ఇసుక, ఉప్పు సబ్సిడీలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని నిరోధిస్తే ప్రభుత్వ ఆదాయం మెరుగవుతుందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12వేల కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయి. పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. సరిగా వసూళ్లు చేస్తే చాలు'అని అన్నారు.

# చలానా పడగానే.. ఖాతాలో కట్ కావాలి

- ఆ మేరకు బ్యాంక్‌తో అనుసంధానించండి
- అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో సీఎం

**హైదరాబాద్, జనవరి 12:** వాహనాలకు చలానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసులకు కీలక సూచనలు చేశారు. అవి ఎంతో కాలం పెండింగ్‌లో లేకుండా వెంటనే వారి ఖాతాల నుం చి కట్ అయ్యేలా చూడాలన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. వాహనంపై చలాన్ పడిన వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా చూడాలన్నారు. యజమాని వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించడానికి వచ్చి నప్పుడే బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకోండి. ఆ వివరాలు సింక్ చేయండి. చలాన్ పడిన వెంటనే ఆటోమేటిక్‌గా డ బ్బులు ఖాతా నుంచి కట్ కావాలని రేవంత్ అన్నారు. రో డ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం మేర నష్టం జరుగుతోందని సీఎం అన్నారు. ప్రతి నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోందని, 3నిమిషాలకో ప్రాణం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. సమాజంలో కొందరి నిర్లక్ష్యం మరొకరికి ప్రాణాపాయంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి. ఫిజికల్ క్రైమ్‌తో పాటు సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. వీటి నియంత్రణలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇందులో పోలీసులు, రవాణా శాఖ పని మా త్రమే కాదు.. ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. విస్తృత అవగాహనతో మరణాల సంఖ్య తగ్గిందని చెప్పారు. అందరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జనవరి 13 నుంచి 24 వరకు పది రోజుల పాటు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొన్న ప్రభాకర్, డిజిపి శివధర్ రెడ్డి, సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# పక్కాగా పనిదినాలు.. కూలీ అమలు

- గుంతలు తవ్వే కార్యక్రమానికి చెల్లుచీటీ
- వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు
- జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు
- పాక్, బంగ్లాలో హిందూ మహిళలను ప్రధానిని చేయమంటారా
- ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్



**హైదరాబాద్, జనవరి 12:** వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ-జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

- ఎరువుల ఇవ్వలేని వాడు.. ఏం ఉద్ధరిస్తాడు
- గెలిచిన సర్పంచ్‌లతో కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం
- ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు



**మహబూబ్‌నగర్, జనవరి 12:** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువులే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసింద్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్లుండె, ఇప్పుడు ఎట్టున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు.నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్లు ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసింద్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు. 'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండె, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.

# పేదల భూములకు రక్షణ కల్పిస్తాం

**కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన**



**హైదరాబాద్, జనవరి 12:** తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీల్లో.. 40 ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

**వీటి నిర్వహణ బాధ్యత పూర్తిగా కలెక్టర్లదే**

**వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, జనవరి 12:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చారు. దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా ఈ స్కూల్స్ రూపకల్పన చేస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా-కరిక్యులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ స్కూల్స్ దోహదపడతాయని రేవంత్ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 105కి పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబడుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున స్కూల్స్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. బ్జడెట్‌లో రూ.11,600 కోట్లు, మరిన్ని దశల్లో రూ.21,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా కుల, మత, ఆర్థిక వివక్షలు తొలగి, అందరూ ఒకే వేదికపై చదువుకునే అవకాశం లభిస్తుంది. అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను సమానత్వ సాధనంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇవి కేవలం భవనాల నిర్మాణం కాదు.. సమాజంలో సామరస్యం, సమాన అవకాశాలు, భవిష్యత్ తరాల బలోపేతం కోసం చేపట్టిన విప్లవాత్మక అడుగని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



# సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

**పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లీయర్**


**అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు ద్రోహం**

**మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ**

**హైదరాబాద్, జనవరి 12:** రేవంత్‌రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయంపై హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు. నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు. సివిల్ సూట్ ల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు. బలహీనమైన రిట్టు వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురు దక్షణ చెల్లించుకున్నాడని విమర్శించారు. గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పుకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు షాక్

**5 కోట్ల ఆస్తులు సీజ్ చేసిన ఐటీ శాఖ**




**జనగామ, జనవరి 12:** జనగామ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన రూ.5కోట్ల విలువైన ఆస్తులను ఐటీ అధికారులు అటాచ్ చేశారు. బినామీ యాక్ట్ కింద సిద్ధిపేట, జనగామలో ఆయనకు చెందిన పలు విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ అధికారులు సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తన కుమార్తె తుల్జా భవానీ రెడ్డి పేరు మీద జనగామ, సిద్ధిపేటలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పలు భూములు కొనుగోలు చేశారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఐటీ అధికారులు రంగంలోకి దిగి.. ఆ దిశగా విచారణ చేపట్టారు. తన కుమార్తెను బినామీగా పెట్టి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులకు పలు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో ఈ భూముల కొనుగోలుపై యాదగిరిరెడ్డి కుమార్తె తుల్జా భవానీరెడ్డిని విచారించారు. ఈ భూములు కొనుగోలు చేసేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందంటూ తుల్జా భవానీ రెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో తనకు తెలియదని ఐటీ అధికారులకు ఆమె వెల్లడించింది. తన తండ్రి సంతకం పెట్టమని చెబితేనే.. తాను ఈ భూములకు చెందిన సేల్ డీడ్‌పై సంతకం చేశానంటూ ఐటీ అధికారులకు తుల్జా భవానీ దేవి వివరించారు. ఆమె చెప్పిన స్టేట్‌మెంట్‌ను ఐటీ శాఖ ఉన్నతాధికారులు రికార్డు చేశారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా సిద్దిపేట, జనగామలో రూ.5కోట్లు విలువైన ఆస్తులను ఐటీ శాఖ అధికారులు ఫ్రీజ్ చేశారు.

# రోశయ్య సతీమణి కన్నుమూత

**హైదరాబాద్, జనవరి 12:** దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి కొణిజేటి శివలక్ష్మి(86) కన్నుమూశారు. ఆమె మరణం తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపింది. శివలక్ష్మి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ అమీర్‌పేటలోని తన నివాసంలో కన్నుమూశారు. శివలక్ష్మి మరణం వారి కుటుంబంలోనే కాకుండా, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర విషాదం నింపింది. శివలక్ష్మి మరణ వార్త తెలియగానే తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అమీర్‌పేటలోని రోశయ్య నివాసానికి అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్నారు. రోశయ్యకు శివలక్ష్మి అండగా ఉంటూ, ఆయన రాజకీయ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారని బంధుమిత్రులు తెలిపారు. రోశయ్య సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పినప్పటికీ.. శివలక్ష్మి తెర వెనకే ఉంటూ కుటుంబాన్ని చక్కదిద్దేవారని బంధుమిత్రులు చెబుతున్నారు.

# పీజేఆర్‌కు సీఎం నివాళి



**హైదరాబాద్, జనవరి 12:** దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పీ జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ సర్కిల్‌లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పీజేఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయనప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీజేపీ తనయ విజయా రెడ్డి,మంత్రి దామోర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పీజేఆర్‌కు నివాళి అర్పించారు.

# క్రీడల్లో యువత చురుకుగా పాల్గొనాలి

- పిలుపునిచ్చిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు
- పెద్దపల్లిలో ఘనంగా 'చీఫ్ మినిస్టర్ కప్' టార్చ్ ర్యాలీ



**పెద్దపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని రాణించాలని, క్రీడాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు. జిల్లా యువజన మరియు క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'చీఫ్ మినిస్టర్ కప్-2025' (రెండవ ఎడిషన్) ప్రచారంలో భాగంగా సోమవారం పెద్దపల్లిలో టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి స్థానిక అయ్యప్ప దేవాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల పట్ల ప్రజల్లో, యువతలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ టార్చ్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడలను విస్తరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం మేరకు తెలంగాణ రాష్ట్ర కీర్తిని క్రీడల ద్వారా మరింత ముందుకు తీసుకువెళ్లాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, పలు క్రీడా సంస్థల అధ్యక్షులు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు హర్షణీయం

దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి



**దుబ్బాక, జనవరి 12 (మనసులో మాట):**

ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ =వశ్రీఅవట ఖీబఅఎ) పేదలకు వరంగా మారిందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్ అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆయన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మోటి దివ్యకు రూ. 23,500, కోరంపల్లి వెంకట్ రెడ్డికి రూ. 13,000 విలువైన చెక్కులను పాతూరి వెంకటస్వామి గౌడ్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గతంలో రూ. 5 లక్షలుగా ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచిన ఘనత రేవంత్ రెడ్డి సర్కార్‌కే దక్కుతుందని కొనియాడారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మెరా సంయుక్త శ్రీధర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఏలూరి కమలాకర్, సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, మాజీ ప్రజా ప్రతినిధులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కూడవెల్లి దేవస్థానం డైరెక్టర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట, కోడిపందాలపై పటిష్ట నిఘా

హెచ్చరించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌తో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో పేకాట, కోడిపందాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అరికట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు, నాకాబందీలు నిర్వహిస్తున్నామని, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన కీలక ప్రదేశాలలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేశామని తెలిపారు. అలాగే కమిషనరేట్ సరిహద్దు జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్‌లతో సమన్వయం ఏర్పాటు చేసుకుని సంయుక్త చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట, కోడిపందాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీపీ స్పష్టం చేశారు.



# యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలి

జూలపల్లి ఎస్సై సనత్ కుమార్ రెడ్డి

**జూలపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, అవి ఆరోగ్యకరమైన జీవనశైలిలో ముఖ్యమైన భాగమని జూలపల్లి ఎస్సై సనత్ కుమార్ రెడ్డి అన్నారు. జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో నూతన సర్పంచ్ మచ్చ అరుణ-యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు కప్ అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని, విద్యార్థుల్లో శారీరక, మానసిక, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మచ్చ యాదగిరి, నాయకులు కొమ్ము ప్రసాద్ యాదవ్, పెద్దపూర్ సర్పంచ్ పొగరు శ్రీనివాస్, జూలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాతకుల అనిల్, మాజీ ఎంపీటీసీ కనుకుట్ల అంజయ్య, మాజీ సర్పంచులు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే కీలకం

పేర్కొన్న యువర్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, మాస్టర్ బురాని శ్రీకాంత్

దుబ్బాక సిద్ధార్థ స్కూల్‌లో ఘనంగా బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

ప్రతిభ చాటిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

పరీక్షలకు హాజరైన సిద్దిపేట, దుబ్బాక విద్యార్థులు



**దుబ్బాక, జనవరి 12 (మనసులో మాట):**

శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే ఎంతో అవసరమని యువర్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని సిద్ధార్థ కాన్సెప్ట్ స్కూల్లో ఆదివారం సాయంత్రం అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచి సర్టిఫికెట్లను సొంతం చేసుకున్నారు. ఈ పరీక్షలకు పరిశీలకులుగా కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, పీఈటీ శ్రీనివాస్ గౌడ్, సుశాంక్ వర్ధన్, లక్షిత, యశ్వంత్ వ్యవహరించారు. ఈ పరీక్షల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన లక్షిత, లోకేష్ బ్లాక్ బెల్టులను సాధించగా.. శ్రీ సంజయ్ సాహూ మహారాజ్, హర్షవర్ధన్ బ్రౌన్ బెల్టులను కైవసం చేసుకున్నారు. అలాగే ప్రజ్వల పర్పుల్ బెల్ట్, రోహన్ బ్లూ బెల్ట్, చక్రధర్, సంకీర్తన, విశ్రుత్ గ్రీన్ బెల్టులు పొందారు. సాయి శ్రీయాన్స్, శరణ్య, వర్ష, అశ్విన్ ఆరంజ్ బెల్టులు సాధించగా.. వివాన్, యగ్నేష్, హరదీప్ సాయి, సుశాంక్, ప్రచురిత, అక్షయ్ వర్ధన్, రూపేష్, సాత్విక, అన్విక ప్రియ, వర్షిత్, షయాన్, శ్రీ సాత్విక, సహస్రిక్, వశిష్ఠ, అయాన్ ఎల్లో బెల్టులను సొంతం చేసుకున్నారు.



# చందానగర్‌లో ఘనంగా పీజేఆర్ జయంతి వేడుకలు

నివాళులర్పించిన ఎంబీసీ చైర్మన్ జైపాల్, టీపీసీసీ కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

పేదల పెన్నిధి, దివంగత నేత పి. జనార్దన రెడ్డి (పీజేఆర్) 78వ జయంతి వేడుకలను శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చందానగర్‌లోని పీజేఆర్ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల కోసం పీజేఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, ఊరేటి వెంకట్రావు, సౌందర్య రాజన్, మధు, కాటా నరసింహా గౌడ్, గఫూర్, ఏకాంత గౌడ్, సునీత రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్లాన్ ఆఫ్ యాక్షన్

జిల్లాలో నేటి నుంచి 'అరైవ్ అలైవ్' కార్యక్రమం అమలు

2025లో 40 శాతం ఆస్తి రికవరీ చేశాం

గ్రామాల్లో పటిష్ట నిఘా.. రౌడీ షీటర్లపై కన్నేయాలి

కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర



**జుక్కల్, జనవరి 12 (మనసులో మాట):**

జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' రూపొందించుకుని ముందుకు సాగాలని కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఆయన నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తీవ్రమైన కేసుల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ఖచ్చితంగా పాటిస్తూ దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. 2025లో జరిగిన ఆస్తి సంబంధిత నేరాల్లో 45 శాతం కేసులను ఛేదించామని, 40 శాతం ఆస్తిని రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం (నేటి) నుంచి ప్రారంభమయ్యే 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓలు, విలేజ్ పోలీస్ అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని, చిన్న ఘటనలకైనా తక్షణమే స్పందించాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది 'పోపిలోన్ డివైస్'ల ద్వారా అనుమానితుల వేలిముద్రలను సేకరించాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ వచ్చిన వెంటనే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసరావు, విఠల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

హామీ ఇచ్చిన సర్పంచ్ పాతకుల అనూష, ఉప సర్పంచ్ కొప్పుల మహేష్



**జూలపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, గ్రామాభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేస్తామని జూలపల్లి సర్పంచ్ పాతకుల అనూష, ఉప సర్పంచ్ కొప్పుల మహేష్ పేర్కొన్నారు. సోమవారం జూలపల్లి మండల కేంద్రంలో స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన' పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో పాలకవర్గం పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు మెరుగు రమేష్, మహిళా అధ్యక్షురాలు కొండ విజయ, ఉపాధ్యక్షులు కోదూరి రాజేశ్వర్, కొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిరిపురం సత్తయ్య, కోశాధికారి కనకయ్య, సంయుక్త కార్యదర్శి సాంబారి అంజనేయులు, కార్యనిర్వహణ కార్యదర్శి బైరి భూమయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ పాతకుల అనిల్, కార్యవర్గ సభ్యులు రుద్ర రాజేశం, కోదూరు శ్రీనివాస్, దీకొండ సంతోష్, నాగుల వెంకటేశం, భూదారపు వెంకటేశం, కొండ బత్తుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు

**బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్**



**పెద్దపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ నేతృత్వం వహించి, వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద యువతకు నిత్య స్ఫూర్తి ప్రదాత అని, భారతదేశ ఔన్నత్యాన్ని, సంస్కృతిని ప్రపంచమంతటికీ చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతరం చేతుల్లోనే ఉందని వందేళ్ల క్రితమే చాటిన దార్శనికుడు వివేకానందుడని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలో యువత నడవాలని, అందుకే ఆయన జయంతిని ప్రతి సంవత్సరం 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తంగెడ రాజేశ్వరరావు, కావేటి రాజగోపాల్, వొళ్లె తిరుపతి, ఎర్రోల్ల శ్రీకాంత్, ఉప్పు కిరణ్, గుడ్ల సతీష్, పోగుల రాజు, మోసంపల్లి శ్రీధర్, గాదాసి సతీష్, ముంజ రాజేంద్రప్రసాద్, శిలారపు మహేష్, మధుకరన్, కుక్క అంజి, సాయి, పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి

**నివాళులర్పించిన గ్రామ శాఖ అధ్యక్షుడు మెరుగు రమేష్**



**జూలపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జూలపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పద్మశాలి సంఘం భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జూలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మెరుగు రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కోడూరి రాజేశ్వర్, కొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిరిపురం సత్తయ్య, కోశాధికారి కనకయ్య, సంయుక్త కార్యదర్శి సాంబారి ఆంజనేయులు, కార్యనిర్వహణ కార్యదర్శి భైరీ భూమయ్య, కార్యవర్గ సభ్యులు రుద్ర రాజేశం, వెంగలి వెంకటేశం, నాగుల వెంకటేశం, కోడూరు శ్రీనివాస్, దికొండ సంతోష్, భూదారపు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

**పిలుపునిచ్చిన బీజేపీ సీనియర్ వార్డు సభ్యుడు తీగల అశోక్**



**జూలపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో సోమవారం బీజేపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ నాయకులు, సీనియర్ వార్డు సభ్యులు తీగల అశోక్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిని, వేదాలను, యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన మొదటి వ్యక్తి స్వామి వివేకానందుడని కొనియాడారు. 'ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన యువకులను నాకు అప్పగిస్తే దేశ గతిని మారుస్తానని' చాటిన ధీరుడు ఆయనని గుర్తుచేశారు. యువతను ప్రభావితం చేసి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. నేటి యువత ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సంకెండ్ల నర్సయ్య, కొక్కుల భద్రయ్య, వొదనాలా శేఖర్, పెసరు రాజు, పెసరు అంజయ్య, చిప్ప వెంకటేశం, నేరెళ్ల శ్రీనివాస్, మల్కాపురం శ్రీను, సింగం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# దేశ ప్రగతి యువత చేతుల్లోనే..

- ప్రయత్నించి ఓడినా పర్వాలేదు.. ప్రయత్నంలో ఓడవద్దు
- యువత ఉక్కు సంకల్పాన్ని అలవర్చుకోవాలి
- బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్
- మదీనాగూడలో ఘనంగా వివేకానంద 164వ జయంతి వేడుకలు
- విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి

**శేరిలింగంపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

దేశంలోని యువత లేకుండా మార్పులు, పురోగతిని సాధించలేమని, ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువతరం భాగస్వామ్యం ఎంతో అవసరమని బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. స్వామి వివేకానంద 164వ జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా మదీనాగూడ మైత్రి నగర్ కమాన్ వద్ద గల వివేకానంద విగ్రహానికి హాఫీజ్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు జితేందర్, మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. యువకులందరికీ జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అతి చిన్న వయస్సులోనే, 1893లో చికాగోలో జరిగిన 'పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రిలీజియన్స్'లో ప్రసంగించి భారతీయ సంస్కృతిని, తత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానందుడు చెప్పిన మాటలు నేటికీ ఆదర్శమని ఆయన గుర్తుచేశారు. "లేచి పడుతున్నందుకు కాదు.. పడినా కూడా లేస్తున్న కెరటం నాకు ఆదర్శం", "ప్రయత్నం చేసి ఓడిపో కానీ.. ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు", "మందలో ఉండకు.. వందలో ఉండటానికి ప్రయత్నించు" వంటి సూక్తులు యువతలో స్ఫూర్తిని నింపుతాయన్నారు. ఉక్కు సంకల్పం కలిగిన యువత దేశానికి అవసరమని తెలిపారు. మనం కూడా ఆ యువ వయస్సు నుంచి వచ్చిన వాళ్ళమేనని, యువత ప్రతి అడుగు ప్రణాళికాబద్ధంగా, తెలివిగా వేస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ వయస్సులో ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకోవాలని, దేశ సామాజిక సంస్కరణలు, అభివృద్ధి యువత చేతుల్లోనే ఉన్నాయని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేశ్వర్ గౌడ్, మహేష్ యాదవ్, మాణిక్ రావు, అజిత్ సేనాధిపతి, కోటేశ్వరరావు, మనోహర్, శ్రీధర్ గౌడ్, విష్ణు, సత్యనారాయణ రాజు, రవి గౌడ్, రమణయ్య సురేష్, శ్రీనివాస్ యాదవ్, గణేష్ ముదిరాజ్, రాజేష్ గౌడ్, వర ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, శివారెడ్డి, విజయేందర్, పట్టాభిరామ్, శివరాజ్ ముదిరాజ్, వినోద్ యాదవ్, పవన్, బాబు ముదిరాజ్, రాము, మహేందర్ యాదవ్, ప్రసాద్, రాము యాదవ్, నగేష్, రెడ్డమ్మ, సాయి, శ్రీనివాస్, నవీన్, రాజు, శ్రీను నాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

# యువత వివేకానందుని సన్మార్గంలో నడవాలి

**పిలుపునిచ్చిన సర్పంచ్ ఆస్పత్వర్ అనిల్ కుమార్**



**జుక్కల్, జనవరి 12 (మనసులో మాట):**

భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకుని యువత సన్మార్గంలో నడవాలని పెద్ద ఎడ్గిగి గ్రామ సర్పంచ్ ఆస్పత్వర్ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పెద్ద ఎడ్గిగి గ్రామంలో ఐక్యత యూత్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ యువజన దినోత్సవాన్ని (163వ స్వామి వివేకానంద జయంతి) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. భారత దేశ చరిత్రను, సంస్కృతిని ప్రపంచ వేదికలపై సగర్వంగా చాటిన మహనీయుడు స్వామి వివేకానందుడని కొనియాడారు. నేటి యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫయ్యూం ఖాన్, ఐక్యత యూత్ సభ్యులు రవీందర్, శంషుద్దీన్, సందీప్, పండరి, వినోద్, పవన్, రాజశేఖర్, శ్రీనివాస్, బాలు, భజరంగ్, జ్ఞానేశ్వర్, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

**పిలుపునిచ్చిన బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరోజ సత్యనారాయణ**

**పెద్దపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాటిని పరిరక్షించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరోజ సత్యనారాయణ పిలుపునిచ్చారు. పెద్దపల్లి మండలం మూలసాల గ్రామంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో సర్పంచ్ జూపాక శ్వేత నేతృత్వంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ సృజనాత్మకతతో అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. వారు వేసిన రంగురంగుల ముగ్గులు చూపరులను, గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొనడం పట్ల అతిథులు అభినందనలు తెలిపారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలకు సర్పంచ్ శ్వేత, బీసీ నాయకురాలు సరోజ సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రధాని మోదీ

***గాంధీ కుటుంబమే దేశానికి శ్రీరామరక్ష: సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూకుంట అంక్షారెడ్డి***

- గజ్వేల్‌లో ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు
- కుల, మతాల పేరిట బీజేపీ విభజన రాజకీయాలు
- ఢిల్లీలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలి
- యూపీఏ పథకాల రక్షణకు కాంగ్రెస్ శ్రేణులు కదలాలి



**గజ్వేల్, జనవరి 12 (మనసులో మాట):**

కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట ప్రజలను విభజించి పాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని, దేశ సమగ్రాభివృద్ధి కోసం గాంధీ కుటుంబమే శ్రీరామరక్షగా నిలుస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూకుంట అంక్షారెడ్డి స్పష్టం చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సోమవారం గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఇతర నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన దివంగత ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల ఆశయ సాధన కోసం రాహుల్, ప్రియాంక గాంధీలు పోరాడుతున్నారని తెలిపారు. ప్రియాంక గాంధీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తూనే, పార్లమెంట్ సభ్యురాలిగా ప్రభుత్వానికి దీటైన జవాబు చెబుతున్నారని కొనియాడారు.

**బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి:**

స్వాతంత్ర్య ఉద్యమంతో ఏమాత్రం సంబంధం లేని బీజేపీ, గాంధీల చరిత్రను మరుగున పరిచేందుకు కుట్రలు చేస్తోందని, వీటిని కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పరిరక్షణకు ఉద్యమించాలన్నారు. రాహుల్, ప్రియాంకల స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాచగిరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొనగారి రాజు, మండల ఇన్‌చార్జి సుకేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, గాడిపల్లి శీను, రమేష్ గౌడ్, సమీర్, నరసింహారెడ్డి, శివారెడ్డి, అజ్గర్ అజార్ పాల్గొన్నారు.

# బిచ్కుంద మున్సిపాలిటీ ఓటర్ల తుది జాబితా విడుదల

**వివరాలు వెల్లడించిన మున్సిపల్ కమిషనర్ హాయ్యుం**



**జుక్కల్, జనవరి 12 (మనసులో మాట):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మున్సిపాలిటీకి సంబంధించిన ఓటర్ల తుది జాబితాను సోమవారం మున్సిపల్ కమిషనర్ హాయ్యుం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులకు గాను మొత్తం 12,759 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 6,201 మంది పురుషులు, 6,556 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారని, పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని వివరించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన 99 అభ్యంతరాలను, అలాగే మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన 25 ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని సవరించి తుది జాబితాను రూపొందించినట్లు కమిషనర్ తెలిపారు. ఓటింగ్ సౌకర్యార్థం పట్టణంలో 24 పోలింగ్ కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న ఫోటోలతో కూడిన తుది జాబితాను వార్డుల వారీగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు శివాని, వీరారెడ్డి, విశాల్, కంప్యూటర్ ఆపరేటర్లు సంజీవ్, మహేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గంగాదేవిపల్లెలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

**బహుమతులు అందజేసిన సర్పంచ్ కొలకాని జలంధర్, ఉపసర్పంచ్ మని సాయి**



**గొల్లపల్లి, జనవరి 12 (మనసులో మాట):**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో సోమవారం ముగ్గుల పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో ఆకట్టుకున్నారు. విజేతలకు గ్రామ సర్పంచ్ కొలకాని జలంధర్, ఉపసర్పంచ్ మని సాయి బహుమతులను అందజేశారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కొలకాని నిహారిక మొదటి బహుమతిగా మిక్సీ గ్రైండర్‌ను గెలుచుకోగా, బోండ్ల రమ్య ద్వితీయ బహుమతిగా హాట్ బాక్స్‌ను, బోయపోతు మానస తృతీయ బహుమతిగా డబుల్ క్యారేజ్ టిఫిన్ బాక్స్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవీందర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ స్వప్న, వివో వూట్కూరి నీరజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ ఆధ్యాత్మికతకు ప్రతీక స్వామి వివేకానంద

**ఆవాలు, ఎర్రపప్పుతో అద్భుత చిత్రాన్ని ఆవిష్కరించిన భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**




**గజ్వేల్, జనవరి 12 (మనసులో మాట):**

భారతీయ ఆధ్యాత్మికతకు నిలువెత్తు నిదర్శనం స్వామి వివేకానంద అని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపకులు రామకోటి రామరాజు అన్నారు. స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని రామకోటి కార్యాలయంలో ఆయన వినూతన రీతిలో నివాళులర్పించారు. ఆవాలు, ఎర్రపప్పు గింజలను ఉపయోగించి స్వామి వివేకానంద చిత్రాన్ని అత్యంత అద్భుతంగా చిత్రించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ.. ప్రపంచానికి హైందవ ధర్మాన్ని పరిచయం చేసిన మహోన్నతమైన, దేదీప్యమానమైన వ్యక్తి వివేకానందుడని కొనియాడారు. నవభారతం వైపు యువతను నడిపించిన స్ఫూర్తిప్రదాత ఆయనేనని అన్నారు. "చావు బతుకులు ఎక్కడో లేవు.. ధైర్యంలోనే బతుకు ఉంది, భయంలోనే చావు ఉంది" అన్న వివేకానందుడి మాటలు నేటికీ శిరోధార్యమని, ఆయన చూపిన బాటలో యువత నడవాలని పిలుపునిచ్చారు.

# వ్యవసాయ రంగాభివృద్ధే 'దానా క్రాప్ సైన్సెస్' లక్ష్యం

- కంపెనీ జనరల్ మేనేజర్ వి. శ్రీనివాస రెడ్డి
- అనంతరావుపల్లిలో ఘనంగా ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న 60 మంది మహిళలు



**గజ్వేల్, జనవరి 12 (మనసులో మాట):**

భారతదేశంలో వ్యవసాయ రంగ అభివృద్ధే తమ కంపెనీ ప్రధాన లక్ష్యమని, వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దానా క్రాప్ సైన్సెస్ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ వి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో దానా క్రాప్ సైన్సెస్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన సుమారు 60 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో, ఆలోచింపజేసే డిజైన్లతో తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. మన సంస్కృతిలో భాగమైన ముగ్గుల పోటీల్లో మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని శ్రీనివాస రెడ్డి అభినందించారు. ముందుగా గ్రామ సర్పంచ్ సులోచన మల్లేష్ యాదవ్, పాలకవర్గ సభ్యులను ఆయన సన్మానించారు.

**లాభాల్లో 20 శాతం సేవకే..**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానా క్రాప్ సైన్సెస్ లిమిటెడ్ ఇండియాలోనే అతిపెద్ద కంపెనీ అని, గత 30 ఏళ్లుగా పురుగు మందులు, బయో ఫెర్టిలైజర్స్, న్యూట్రియెంట్స్ రంగంలో రాణిస్తోందన్నారు. వ్యాపారంలో వచ్చిన లాభాల్లో 20 శాతం నిధులను నిరుపేదలకు, అనాథ పిల్లలకు, దివ్యాంగులకు మరియు పేద విద్యార్థులకు (మెడిసిన్, ఇంజనీరింగ్ చదువుల కోసం) కేటాయిస్తున్నామని వెల్లడించారు. కరోనా సమయంలోనూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులోనూ గ్రామంలో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ప్రతిభావంతులైన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు జనరల్ మేనేజర్ శ్రీనివాస రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జిల్లా ప్రతినిధి టి. చక్రపాణి, సర్పంచ్ సులోచన మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, మధు ఫెర్టిలైజర్ స్వామి, సంతోష్, ఆశ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

- 7 వేల మందికి ఉపకరణాల పంపిణీ.. రూ. 50 కోట్లతో సాధికారత
- బాల భరోసా, 'ప్రణామం'తో మానవీయ సంక్షేమానికి కొత్త నిర్వచనం
- వృద్ధుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 37 డే కేర్ సెంటర్ల ఏర్పాటు
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**గొల్లపెల్లి, జనవరి 12 (మనసులో మాట):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారుల సంక్షేమాన్ని మాటలకే పరిమితం చేయకుండా, కార్యరూపంలో చూపిస్తోందని ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా భారీ ఎత్తున ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగుల సాధికారతే లక్ష్యంగా ఒకే ఆర్థిక సంవత్సరంలో రూ. 50 కోట్ల భారీ నిధులను కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 7 వేల మంది అర్హులైన దివ్యాంగులకు రూ. 43.22 కోట్ల విలువైన ఉపకరణాలను (ల్యాప్‌టాప్‌లు, ట్రైసైకిళ్లు, వీల్‌చెయిర్లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు) పంపిణీ చేశామన్నారు. వారి ఆత్మవిశ్వాసం పెంచేలా, విద్య, ఉపాధిలో సమాన అవకాశాలు కల్పించేలా ఈ పరికరాల ఎంపిక జరిగిందన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 37 'ప్రణామం' డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేశామని, అక్కడ వారికి భోజనం, వినోదం, భద్రతతో కూడిన సంరక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే, 'బాల భరోసా' పథకం ద్వారా ఐదేళ్లలోపు పిల్లల వైకల్యాలను అంగన్వాడీల స్థాయిలోనే గుర్తించి, వారికి ఉచిత చికిత్స, థెరపీ, శస్త్రచికిత్సలు అందిస్తున్నామని వివరించారు. వైకల్యరహిత తెలంగాణ నిర్మాణమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, ఎంపీలు బలరామ నాయక్, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యసాచ్ ఘోష్, కలెక్టర్ దాసరి హరి చందన, దివ్యాంగుల శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# నాచగిరి గిరిప్రదక్షిణతో ఆధ్యాత్మిక అనుభూతి

- స్వామివారి నామస్మరణతో మార్మోగిన నాచగిరి కొండలు
- లోకకల్యాణార్థం సాగిన గిరి ప్రదక్షిణ
- సనాతన ధర్మ పరిరక్షణ బాధ్యత మనందరిది
- శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి



**గజ్వేల్, జనవరి 12 (మనసులో మాట):**

ప్రసిద్ధ నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్ర గిరి ప్రదక్షిణ చేయడం ద్వారా భక్తులకు అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుభూతి దక్కుతుందని శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. సోమవారం తెల్లవారుజామున నాచగిరి క్షేత్రంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. స్వామివారు నడయాడిన నాచగిరి, శ్వేతగిరి కొండలు ఎంతో పవిత్రమైనవని తెలిపారు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని, వైకుంఠ ద్వారం నుండి గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యకార్యమని, ఇది భక్తులకు సత్ఫలితాలను ఇస్తుందని చెప్పారు. భగవన్నామ స్మరణ మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని, లోక కళ్యాణార్థం చేపట్టిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. సాంప్రదాయ దుస్తులతో భక్తులు పాల్గొనడం సనాతన ధర్మాన్ని, మన సంస్కృతిని గుర్తుచేస్తోందని స్వామీజీ అన్నారు. అంతరించిపోతున్న మానవ విలువలు, ఆధ్యాత్మిక, ధార్మిక భావనలను కాపాడుకోవాలని, ధర్మ పరిరక్షణ వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. భగవంతునిపై భక్తి, సేవాభావం, మనో నిగ్రహం, దాతృత్వం మనిషిని సన్మార్గంలో నడిపిస్తాయని వివరించారు. పుణ్యక్షేత్రాలు, పురాతన ఆలయాలు, గోసంపదను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు.



# సంగారెడ్డిలో తొలి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

## ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జనవరి 12 (మనసులో మాట):**

సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ సహకారంతో నిర్మించిన మొదటి రెండు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. సదాశివపేట మండలం ఆత్మకూరు, కంబాలపల్లి గ్రామాల్లో నిర్మించిన ఈ ఇళ్లను సోమవారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు (గృహ ప్రవేశం చేశారు). ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేదలకు కన్నతల్లి వంటిదని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఒక ఊరి వారికి మరో ఊరిలో ఇళ్లు కేటాయించడం, అక్కడ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడు పుట్టి పెరిగిన సొంత ఊర్లోనే ఇంటి కలను సాకారం చేస్తోందని, ఇందుకోసం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ. 5 లక్షలు కేటాయిస్తోందని తెలిపారు. దరఖాస్తుదారులు డబ్బులు వస్తాయో రావో అని అనుమాన పడవద్దని, అర్హులైన ప్రతి



ఒక్కరికీ రూ. 5 లక్షలు కచ్చితంగా అందుతాయని భరోసా ఇచ్చారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వెంటనే చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గంగిరెద్దుల విన్యాసాలే జీవనం

## చలి, ఆకలి లెక్కచేయకుండా సంక్రాంతి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న వృద్ధ దంపతులు

**మనసులో మాట-సిద్దిపేట**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తరతరాలుగా వస్తున్న గంగిరెద్దుల విన్యాసాల సంప్రదాయాన్ని నేటికీ సజీవంగా నిలుపుతున్న వృద్ధ దంపతులు నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం, భాషపేట గ్రామానికి చెందిన మల్లేశం (70), ఆయన భార్య బాలవ్వ (50) దంపతులు గంగిరెద్దుల విన్యాసాలనే తమ జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారు. గత నాలుగు రోజులుగా తీవ్ర చలిని, ఆకలిని లెక్కచేయకుండా



రహదారి పక్కనే తమ గంగిరెద్దుల సమీపంలోనే రాత్రులు గడుపుతూ, పగలు సంక్రాంతి పండుగ సందర్భంగా సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఊరు ఊరుగా తిరుగుతూ ఇంటింటికి వెళ్లి గంగిరెద్దుల విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. పాటలు పాడుతూ, ప్రజలను అలరిస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

గంగిరెద్దుల విన్యాసాలు తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన వృత్తి కావడంతో, అదే తమ బ్రతుకుగా మారిందని మల్లేశంఉబాలవ్వ దంపతులు చెబుతున్నారు. ఆధునికత పెరుగుతున్న కొద్దీ ఈ కళకు ఆదరణ తగ్గుతున్నా, తాతల నాటి సంప్రదాయాన్ని కాపాడాలనే తపనతో పాటు, జీవనోపాధి కోసమే ఈ వృత్తిని వదలకుండా కొనసాగిస్తున్నామని వారు తెలిపారు.

ఈ దంపతులకు ఇద్దరు కొడుకులు, అయిదుగురు పిల్లలు ఉండగా, అందరికీ వివాహాలు పూర్తయ్యాయి. అయితే ఒక బిడ్డకు మాటలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు వేర్వేరు జీవనాల్లో స్థిరపడినా, తాము మాత్రం సంప్రదాయ వృత్తిని విడిచిపెట్టలేక ఇప్పటికీ గ్రామం నుంచి గ్రామానికి, ఊరు నుంచి ఊరికి తిరుగుతూ చెట్ల కిందనే రాత్రులు గడుపుతున్నామని చెప్పారు.



"వయసు ఎంతైనా కష్టపడితేనే నాలుగు మెతుకులు దొరుకుతాయి" అనే భావనతో గంగిరెద్దుల విన్యాసాలు చూపిస్తూ, పాటలతో ప్రజలను అలరించడమే తమ నిత్యకృత్యమని వారు తెలిపారు. చలి, వర్షం, ఆకలి వంటి కష్టాలను తట్టుకుంటూ కూడా ఈ కళను కొనసాగిస్తున్న వారి జీవితం నేటి తరానికి ఒక గొప్ప పాఠంగా నిలుస్తోంది. ఇలాంటి సంప్రదాయ కళాకారులను ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు గుర్తించి ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సిద్దిపేటలో రోడ్డు భద్రతపై భారీ ర్యాలీ

## నిబంధనలు పాటించకుంటే జైలు శిక్ష తప్పదు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సాయి రమాదేవి

**మనసులో మాట-సిద్దిపేట**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సాయి రమాదేవి హెచ్చరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ట్రాఫిక్ పోలీస్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో రోడ్డు భద్రతపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిద్దిపేట కోర్టు ప్రాంగణం నుంచి విక్టరీ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో పాల్గొన్న వారు రోడ్డు భద్రతా నినాదాలు చేస్తూ, ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడపడం వల్ల అమూల్యమైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనం నడుపుతూ (డ్రంకన్ డ్రైవ్‌లో) పట్టుబడితే మొదటిసారి రూ.10,000 జరిమానా విధిస్తారని, రెండవసారి




పట్టుబడితే తప్పనిసరిగా జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించాలన్నారు. పట్టణ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకొని, చలానాలు విధించాలని ఈ సందర్భంగా పోలీస్ శాఖకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# క్రీడలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

## సాంసద్ ఖేల్ మహోత్సవం జెర్సీ, ట్రోఫీని ఆవిష్కరించిన ఎంపీ రఘునందన్ రావు

**సంగారెడ్డి, జనవరి 12 (మనసులో మాట):** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మెదక్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) రఘునందన్ రావు తెలిపారు. సోమవారం సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని పాఠశాలలో నిర్వహించిన 'సాంసద్ ఖేల్ మహోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలకు సంబంధించిన జెర్సీని మరియు ట్రోఫీని ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 'ఖేలో ఇండియా' వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థులను జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనేలా కేంద్రం ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. సంగారెడ్డి ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా, క్రీడల్లోనూ ముందుకు నడిపించాలని సూచించారు. శారీరక దృఢత్వంతో పాటు, భవిష్యత్తులో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్ రెడ్డి, సెయింట్ ఆంథోని విద్యాసంస్థల చైర్మన్ సాల్మన్ రెడ్డి, బీజేపీ నాయకులు జగన్, చంద్రశేఖర్, రాజేశ్వర రావు పాల్గొన్నారు.




# మున్సిపాలిటీ తుది ఎన్నికల జాబితా విడుదల



**జుక్కల్ జనవరి 12 (మనసులో మాట):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో గల 12 వార్డుల తుది హోటళ్ల జాబితాలో మున్సిపల్ కమిషనర్ హయ్యోం సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మొత్తం 12,59 మంది ఓటర్లు ఉండగా వీరులు పులుసులు 6,201 మహిళలు 6,556 ఇతరులు ఇద్దరు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల నుంచి వచ్చిన 99 అభ్యంతరాలను పరిష్కరించి జాబితా రూపొందిస్తున్నామన్నారు. ఓటింగ్ కోసం పట్టణంలో మొత్తం 24 పోలింగ్ బూత్ కేంద్రాలను కేటాయించినట్లు వివరించారు.

## సంగారెడ్డిలో..



**సంగారెడ్డి, మనసులో మాట:** సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాను మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విడుదల చేసిన ఓటర్ల జాబితాను మున్సిపల్ తహసిల్దార్ కార్యాలయం అలాగే జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ సూర్యప్రకాశ్, డీపీఓ విశాల్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**సంగారెడ్డి, మనసులో మాట:** సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 97 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.26.33 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అవసరమైన అర్హులైన పేదలు నేరుగా క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

# ఐఐటీలో బైక్ విన్యాసాల జోరు

**సంగారెడ్డి, మనసులో మాట:** కంది సమీపంలోని ఐఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన బైక్ విన్యాసాల కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ముగ్గురు విద్యార్థులు బైక్‌పై అద్భుతమైన విన్యాసాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. బైక్‌ను ముందు భాగం పైకి లేపుతూ చేసిన విన్యాసాలు విద్యార్థుల్లో ఉత్కంఠను రేపాయి. విన్యాసాలను తిలకించిన విద్యార్థులు కేరింతలు కొడుతూ, చప్పట్లతో ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మూర్తి అభినందించి, బహుమతులు అందజేశారు.



# ఐఐటీ హైదరాబాద్‌లో నెక్స్ట్-జనరేషన్ పోస్ట్ ఆఫీస్ ఆవిష్కరణ



**సంగారెడ్డి, మనసులో మాట:** జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఐఐటీ హైదరాబాద్‌లో భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో నెక్స్ట్-జనరేషన్ పోస్ట్ ఆఫీస్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్మాస్టర్ జనరల్ డా. వీణా కుమారి డెర్మల్ మాట్లాడుతూ, నేటి యువత అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా తపాలా శాఖ తన సేవలను సాంకేతికంగా మరింత ఆధునీకరిస్తోందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా పోస్ట్ ఆఫీస్‌లను స్మార్ట్, డిజిటల్ సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్. మూర్తి, పోస్ట్మాస్టర్ జనరల్ విశాలాక్షి, ఎస్పీ శ్రీహరి, ప్రొఫెసర్లు, తపాలా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సోఫీ షైన్‌తో శిఖర్ ధావన్ నిశ్చితార్థం!

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన స్నేహితురాలు సోఫీ షైన్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. చాలా కాలంగా ఇద్దరూ ఒకరినొకరు డేట్ చేస్తున్నారు. మొదట్లో సీక్రెట్‌గా జరిగిన వ్యవహారాన్ని సోషల్ మీడియా ద్వారా అప్పుడప్పుడు వెల్లడిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఏకంగా వారి నిశ్చితార్థం విషయాన్ని కూడా చెప్పేశారు. తన నిశ్చితార్థం ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అభిమానులకు ఈ శుభవార్తను అందించాడు. సోఫీ కంటే ధావన్ 5 సంవత్సరాలు పెద్దవాడు. శిఖర్ ధావన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫోటోను షేర్ చేశాడు, ఇందులో శిఖర్, సోఫీ చేతిలో నిశ్చితార్థపు ఉంగరం ఉంది. శీర్షికలో, ధావన్ ఇలా రాశాడు, "నవ్వులు పంచుకోవడం నుంచి కలలను పంచుకోవడం వరకు, మా నిశ్చితార్థం కోసం వచ్చిన ప్రేమ, ఆశీర్వాదాలు, ప్రతి శు భాకాంక్షలకు నేను కృతజ్ఞుడను, ఎందుకంటే మేము కలిసి జీవించాలని నిర్ణయించుకున్నాము." అని రాసుకొచ్చాడు. సోఫీ ఐర్లాండ్‌కు చెందిన యువతి. ఆమె ఒక ప్రోడక్ట్ కన్సల్టెంట్. ప్రస్తుతం ఆమె అబుదాబిలోని ఒక కంపెనీలో సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె 1990లో జన్మించింది, ప్రస్తుతం ఆమె వయస్సు 36 సంవత్సరాలు. లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మార్కెటింగ్, మేనేజ్‌మెంట్‌లో చదువు పూర్తి చేసింది. 2023లో శిఖర్ ధావన్‌కు చాలా ఇబ్బందికరమైన సమస్యలు వచ్చాయి. బ్యాడ్ టైం నడిచింది. మొదటి భార్య ఆయేషా ముఖర్జీ వివాదాలు సాగాయి. కలిసి జీవించలేమని గ్రహించి ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. కుమారుడికి దూరం కావడంతో శిఖర్ ధావన్ చాలా భావోద్వేగానికి లోనయ్యాడు. వాటిని ఏమాత్రం తనలో దాచుకోలేదు. వాటిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తన ఆలోచనలు పంచుకుంటూ పోస్టులు పెట్టాడు. కట్ చేస్తే ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో ధావన్ సోఫీ షైన్‌తో కనిపించి అందరికీ షాక్ ఇచ్చాడు. ఈ టోర్నమెంట్‌కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చింది. కానీ భారత్ ఆ దేశం వెళ్లలేదు. తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడింది. దుబాయ్‌లోని ఒక రెస్టారెంట్‌లో సోఫీ షైన్‌ను మొదటిసారి కలిసినట్లు ధావన్ చెప్పారు. ఆ రోజున కామోఫ్లాజ్ ట్రౌజర్స్, జాకెట్‌లో సోఫీ చాలా అందంగా కనిపించిందని క్రికెటర్ చెప్పాడు. మొదటి సమావేశం గురించి మాట్లాడుతూ, ధావన్ అందమైన ముఖం, అల్లరి కళ్ళతో ఆకర్షితుడైనట్లు సోఫీ చెప్పారు. నిశ్చితార్థం చేసుకున్న శిఖర్ ధావన్ సోఫీ షైన్ కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు కూడా చేస్తున్నారు. ధావన్ అతనితో చాలా ఫన్నీ వీడియోలను షేర్ చేశాడు. వార్తల ప్రకారం, వచ్చే నెలలో శిఖర్ , సోఫీ వివాహం జరగనుంది.

## రిజ్వాన్‌కు భారీ అవమానం..

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్‌లో సోమవారం సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఒక చారిత్రాత్మక నిర్ణయానికి వేదికైంది. మెల్బోర్న్ రెనెగేడ్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ మొహమ్మద్ రిజ్వాన్‌ను, అతని నెమ్మదైన బ్యాటింగ్ కారణంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ ఇన్నింగ్స్ మధ్యలోనే వెనక్కి పిలిపించారు. దీంతో బీబీఎల్ చరిత్రలో 'రిటైర్డ్ అవుట్' అయిన తొలి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు. సిడ్నీ థండర్‌తో జరిగిన ఈ పోరులో మెల్బోర్న్ రెనెగేడ్స్ మొదట బ్యాటింగ్ చేపట్టింది. నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మొహమ్మద్ రిజ్వాన్ క్రీజులో పాతుకుపోయినప్పటికీ, ఆశించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోయాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో రిజ్వాన్ సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. ఆయన 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం తగ్గింది. ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇన్నింగ్స్ ముగియడానికి ఇంకా 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, భారీ హిట్టర్లు అవసరమని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్'గా పరిగణిస్తారు. రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ మాస్టర్ ప్లాన్ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. పాక్ ఆల్ రౌండర్ హసన్ ఖాన్ (31 బంతుల్లో 46) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. పాకిస్థాన్ వైట్ బాల్ కెప్టెన్ అయిన రిజ్వాన్‌ను ఇలా మధ్యలోనే వెనక్కి పిలిపించడం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. గతంలో ఐపీఎల్‌లో రవిచంద్రన్ అశ్విన్ ఇలాంటి సాహసం చేయగా, ఇప్పుడు బీబీఎల్‌లో రిజ్వాన్ రూపంలో మరో ఉదాహరణ కనిపిస్తోంది. జట్టు ప్రయోజనాల కోసం ఆటగాళ్లను రిటైర్డ్ అవుట్ చేయడం ఆధునిక క్రికెట్‌లో ఒక వ్యూహంగా మారుతోంది.

# బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చేసుకున్న కోహ్లీ

క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ ఒక రన్ మెషీన్. గత దశాబ్ద కాలంగా అతను క్రీజులో ఉన్నాడంటే స్కోరు బోర్డు పరుగులెడుతుందని ఫ్యాన్స్‌కు నమ్మకం. అయితే నిన్నటి వరకు మనం చూసిన కోహ్లీ వేరు, ఇప్పుడు చూస్తున్న కోహ్లీ వేరు. సాధారణంగా విరాట్ క్రీజులోకి రాగానే కొంచెం సమయం తీసుకుని, సెటిల్ అయ్యాక గేర్ మారుస్తుంటాడు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఆడిన తీరు చూస్తే, కోహ్లీ తన బ్యాటింగ్ ఫిలాసఫీని పూర్తిగా మార్చేసుకున్నాడని అర్థమవుతోంది. వడోదరలో జరిగిన మ్యాచ్?లో కోహ్లీ ఫస్ట్ మూడు బంతుల్లోనే బౌండరీ బాదేశాడు. రాయ్‌పూర్, రాంచీ మ్యాచ్‌ల్లో కూడా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. బౌలర్ ఎవరైనా సరే, క్రీజులోకి రాగానే తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని కోహ్లీ ప్రయత్నిస్తున్నాడు. గతంలో ఇన్నింగ్స్?ను హోల్డ్ చేసే యాంకర్ రోల్ పోషించిన విరాట్ ఇప్పుడు మాత్రం ఎదురుదాడితో బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. అనవసరంగా వెయిట్ చేయకుండా మన స్ట్రెంగ్త్ మీద నమ్మకంతో కౌంటర్ ఎటాక్ చేయాలి అని కోహ్లీ స్వయంగా తన కొత్త ఫార్ములాను బయటపెట్టాడు. విరాట్ కోహ్లీ ఇప్పుడు ఏ రికార్డు కోసమో లేక తనని తాను నిరూపించుకోవడానికో ఆడటం లేదు. అన్నీ సాధించాక వచ్చే ఒక రకమైన స్వేచ్ఛ అతని బ్యాటింగ్‌లో కనిపిస్తోంది. టెస్ట్, టీ20 రిటైర్మెంట్ తర్వాత వన్డేలలో మళ్ళీ స్ట్రాంగ్ రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ, తనలోని పాత ప్యాషన్?ను వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. అక్టోబర్ నుంచి ఆడిన ఏడు మ్యాచుల్లో విరాట్ 106 స్ట్రైక్ రేట్‌తో 469 పరుగులు చేశాడు. ఇది అతని కెరీర్ యావరేజ్ స్ట్రైక్ రేట్ (93.7) కంటే చాలా ఎక్కువ. రికార్డుల భారం దింపేసి ఆడుతుండటం వల్లే ఈ అద్భుతమైన ఫామ్ సాధ్యమవుతోంది. కోహ్లీ ప్రస్తుత బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే



కెప్టెన్ రోహిత్ శర్మ పద్ధతి గుర్తొస్తుంది. 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్‌లలో రోహిత్ కూడా ఇదే తరహా అగ్రెసివ్ మైండ్ సెట్‌తో ఆడి సక్సెస్ అయ్యాడు. వ్యక్తిగత రికార్డుల కంటే టీమ్‌కి మంచి ఆరంభం ఇవ్వడమే లక్ష్యంగా రోహిత్ బ్యాట్ ఝులిపించాడు. ఇప్పుడు విరాట్ కూడా అదే బాటలో నడుస్తున్నాడు. నెంబర్ 3 లో బ్యాటింగ్‌కి వచ్చే కోహ్లీ, బౌలర్లు సెటిల్ అవ్వకముందే వారి లయను దెబ్బతీస్తూ టీమ్ ఇండియాను సేఫ్ జోన్‌లో కూర్చోబెడుతున్నాడు. విరాట్‌లో వచ్చిన ఈ మార్పు కేవలం బ్యాటింగ్‌లోనే కాదు, తన ఆలోచనా విధానంలో కూడా కనిపిస్తోంది. "నేను ఇప్పుడు మైలురాళ్ల గురించి ఆలోచించడం లేదు, టీమ్‌ని కంఫర్టబుల్ పొజిషన్‌లో ఉంచడమే నా గోలు అని అతను ఓ క్లారిటీ ఇచ్చేశాడు. టెక్నిక్‌లో మార్పులు కంటే మెంటల్‌గా అతను ఎంత స్ట్రాంగ్‌గా ఉన్నాడనేది అర్థమవుతుంది. మెల్లగా ఆడుతూ వికెట్ ఇచ్చుకునే కంటే, తన బలాన్ని నమ్ముకుని అటాక్ చేయడం మంచిదని అతను భావిస్తున్నాడు. ఈ క్లారిటీయే అతన్ని క్రికెట్‌లో మళ్లీ తిరుగులేని వీరుడిగా మారుస్తోంది. వడోదర, రాయ్‌పూర్‌లలో కోహ్లీ కొట్టిన బౌండరీలు కేవలం రన్స్ మాత్రమే కాదు, ప్రత్యర్థులకు అతను ఇస్తున్న హెచ్చరికలు. తన ఆటను మార్చుకుంటూ మోడరన్ క్రికెట్ డిమాండ్స్‌కి తగ్గట్టుగా అతను అప్డేట్ అవుతున్నాడు. వయసు పెరుగుతున్నా తన ఫిట్‌నెస్, ఆకలి ఏమాత్రం తగ్గలేదని విరాట్ నిరూపిస్తున్నాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా ఇంతటి ఎనర్జీతో, భయం లేకుండా ఆడటం నిజంగా గ్రేట్ అని చెప్పాలి. కింగ్ కోహ్లీ ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలను అందుకోవడం ఖాయం.

## వైభవ్ సూర్యవంశీ దెబ్బకు కోహ్లీ, గిల్ రికార్డులు బద్దలు

భారత క్రికెట్‌లో మరో అద్భుతమైన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దిగ్గజాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ. ప్రస్తుతం జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లలో పరుగుల వరద పారిస్తున్న ఈ యువ ఆటగాడు, త్వరలో జరగనున్న యూ19 వరల్డ్ కప్ 2026లో టీమిండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ పేరిట ఉన్న భారీ రికార్డులను తుడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాడు. యూత్ వన్డే కెరీర్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో వైభవ్ వేగంగా దూసుకుపోతున్నాడు. ఇప్పటివరకు ఆడిన 18 మ్యాచ్‌ల్లోనే 973 పరుగులు సాధించాడు. టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో మొత్తం 978 పరుగులు చేశాడు. అంటే, వైభవ్ మరో 6 పరుగులు చేస్తే చాలు, కోహ్లీ రికార్డును అధిగమించి ముందుకు వెళ్తాడు. కేవలం కోహ్లీ మాత్రమే కాదు, ప్రస్తుత టీమిండియా స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ రికార్డు కూడా వైభవ్ టార్గెట్‌లో ఉంది. గిల్ తన యూ19 వన్డే కెరీర్‌లో 1149 పరుగులు చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే, రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌లోనే ఈ మార్కును సులువుగా దాటే అవకాశం కనిపిస్తోంది. కేవలం 13 ఏళ్ల వయసులోనే యూత్ వన్డేల్లో సెంచరీ చేసిన రికార్డు వైభవ్ సొంతం.?సిక్సర్ల కింగ్: యూత్ వన్డేల్లో అత్యధికంగా 80కి పైగా సిక్సర్లు బాదిన రికార్డు కూడా ఈ చిన్నారి ఆటగాడి ఖాతాలోనే ఉంది.?రాబోయే యూ19 వరల్డ్ కప్‌లో వైభవ్ సూర్యవంశీ ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. తన పవర్ హిట్టింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు నిద్రలేకుండా చేస్తున్న ఈ 'వండర్ కిడ్' భవిష్యత్తులో భారత సీనియర్ జట్టులో కూడా సంచలనం సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.




## మారిన బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు..

2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలు మారవచ్చు అని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ ఒక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వేదిక శ్రీలంకలో ఉంటుందా లేదా భారతదేశంలోని మరొక నగరానికి మారుస్తారా అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది? 2026 టీ20 ప్రపంచ కప్‌ను ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక నిర్వహించనున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం, బంగ్లాదేశ్ జట్టు అన్ని గ్రూప్ మ్యాచ్‌లు మొదట కోల్‌కతా, ముంబైలలో జరగాల్సి ఉంది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికను శ్రీలంకకు మార్చే అవకాశం లేదు. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను దక్షిణ భారతదేశానికి మార్చే అవకాశం ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. దీని అర్థం కోల్‌కతా, ముంబైలకు బదులుగా చెన్నై, తిరువనంతపురంలో మ్యాచ్‌లు నిర్వహించవచ్చు అని తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు ప్రతిస్పందనగా బంగ్లాదేశ్ ఆటగాడు ము-స్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ బహిష్కరించింది. ఈ చర్యకు ప్రతిస్పందనగా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను మార్చాలని ఐసీసీకి ఇమెయిల్ పంపింది. బంగ్లాదేశ్ తన మ్యాచ్‌లను భారతదేశం నుంచి శ్రీలంకకు మార్చాలని కోరింది. భద్రతా సమస్యలను పేర్కొంటూ భారతదేశంలో ఆడకూడదని తన ఇమెయిల్‌లో కోరికను వ్యక్తం చేసింది. ఇటీవలి నివేదికలు బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదిక మార్పును సూచిస్తున్నాయి. అయితే, ఇది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డిమాండ్ వల్ల జరిగిందా లేదా అని చెప్పడం కష్టం, ఎందుకంటే ఇది బీసీసీఐ నిర్ణయం అని నివేదికలు సూచిస్తున్నాయి. 2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ తన ప్రచారాన్ని ఫిబ్రవరి 7న ప్రారంభించనుంది. షెడ్యూల్ ప్రకారం, అది తన మొదటి మ్యాచ్‌ను వెస్టిండీస్‌తో కోల్‌కతాలో ఆడాల్సి ఉంది. ఆ తర్వాత, ఫిబ్రవరి 9న ఇటలీతో, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు కూడా కోల్‌కతాలోనే జరగనున్నాయి. బంగ్లాదేశ్ తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్‌తో ఆడనుంది.

## ఆయుష్ బదోనికి పిలుపు!

న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆడుతున్న భారత్ జట్టులో మార్పులు చేర్పులు జరిగాయి. బౌలింగ్ చేస్తున్నప్పుడు గాయపడ్డ వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆయుష్ బదోనీకి పిలుపునిచ్చారు. వన్డే సిరీస్‌లో భాగంగా వడోదరలో ఆదివారం జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని స్థానంలో ఆయుష్ బదోనిని ప్రకటించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. దీంతో ఆ రెండు మ్యాచ్‌లకు వాషింగ్టన్ స్థానంలో బదోని ఆడనున్నాడు. 14, 18 తేదీల్లో భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో, మూడో వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి. వాషింగ్టన్ స్థానంలో ఇప్పుడు బదోని చేరాడు. అలాంటి ఫెర్ఫార్మెన్స్ యన ఏం చేశాడో ఇక్కడ తెలుసుకోండి. ఆయుష్ బదోని డిసెంబర్ 3, 1999న ఢిల్లీలో జన్మించాడు, అయితే అతను వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందినవాడు. అతని కుటుంబం దేవప్రయాగ్ బ్లాక్‌లోని చిన్న గ్రామం సిలోడ్‌కు చెందినది. వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందిన అతని కుటుంబం తరువాత ఢిల్లీకి షిఫ్ట్ అయ్యింది, దీని కారణంగా ఆయుష్ తన బాల్యాన్ని ఢిల్లీలోనే గడిపాడు. ఆయుష్ బదోనికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. 9 సంవత్సరాల వయస్సులోనే క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రాక్టీస్ ప్రారంభించాడు. కుమారుడి టాలెంట్ గుర్తించిన తండ్రి బదానిని సోనెట్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ కోసం జాయిన్ చేశాడు. అప్పటి వరకు తండ్రి వద్దే శిక్షణ తీసుకున్నాడు. అంటే వాస్తవానికి అతని మొదటి కోచ్ అతని తండ్రి వివేక్ బదోని అయ్యారన్నమాట. వివేక్ తన కొడుకులో క్రికెట్ పట్ల ఉన్న మక్కువను చూసి బంతి, బ్యాట్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించడం ప్రారంభించాడు. వివేక్ బదోని వృత్తిరీత్యా డాక్యుమెంటరీ సినిమాలు తీస్తారు. ఆయుష్ తల్లి, విభ బదోని వృత్తిరీత్యా స్కూల్ టీచర్. బదాని ఆసక్తిని గమనించిన తండ్రి వివేక్ ఇంటి పైకప్పును నెట్ ప్రాక్టీస్ ఏరియాగా మార్చారు. ఆయుష్ ఇక్కడే నెట్ ప్రాక్టీస్ చేసేవాడు. 26 ఏళ్ల ఆయుష్ బదోని దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరపున ఆడాడు. ఐపీఎల్లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అరంగేట్రం చేశాడు. 2022లో లక్నో సూపర్ జెయింట్స్ బదోనిని 20 లక్షల రూపాయలకు తమ జట్టులో చేర్చుకుంది. అప్పటి నుంచి అతను ఈ జట్టు కోసం ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026లో అతనికి 4 కోట్ల రూపాయల భారీ జీతం లభించనుంది.






# నిఖిల్ స్వయంభుపై పెరుగుతున్న అంచనాలు

విడుదలకు సిద్ధంగా ఉన్న పాన్ ఇండియా చిత్రాలో 'స్వయంభు' ఒకటి. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా,సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది.పిరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వెల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా, రా గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.

# తెలుగు తెరపై సంక్రాంతి సందడి


## రాజాసాబ్‌తో మొదలైన వసూళ్ల జోరు

సంక్రాంతి పండగకు వచ్చే ప్రతి సినిమానీ ప్రేక్షకులు ఆదరిస్తారనే ఓ భరోసా పరిశ్రమలో కనిపిస్తుంటుంది. అందుకే పండగే లక్ష్యంగా పలు సినిమాలు తెరకెక్కుతూ ప్రేక్షకుల ముందుకొస్తుంటాయి. ఈసారి పండగకు ప్రేక్షకుల ముందుకొస్తున్న తెలుగు సినిమాలు.. ఐదు. వాటిలో అగ్ర కథానాయకుల సినిమాలున్నాయి, యువ తారల సినిమాలూ ఉన్నాయి. వీటన్నిటి థియేట్రికల్ వ్యాపార లావాదేవీల విలువ రూ.600 కోట్లు పైమాటే అనేది పరిశ్రమ వర్గాల లెక్క. ఇదివరకు ఏ సీజన్‌లోనూ ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరగలేదు. ఈ సినీ సంక్రాంతి ఎంత తిరిగి రాబట్టుకుంటుందో కానీ... ప్రేక్షకుల్లో ఉత్సాహం మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చాయి. తెలంగాణలో ముందస్తు ప్రదర్శనలు లేకపోయినా, తొలి ఆట తర్వాత మిశ్రమ స్పందన వచ్చినా 'ది రాజాసాబ్' తొలి రోజు వసూళ్లు అదిరి పోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభాస్ మేనియాకి తగ్గట్టుగానే తొలి రోజూ రూ.112 కోట్లు వసూళ్లు వచ్చాయని నిర్మాత తెలిపారు. రెండో రోజూ స్థిరమైన వసూళ్లతో సినిమా థియేటర్లని కళకళలాడించింది. సినిమాకి మిశ్రమ స్పందన లభించిన తర్వాత చిత్ర బృందం వెంటనే స్పందించి, కొన్ని కొత్త సన్నివేశాల్ని జోడిస్తూ అనవసరమైన సన్నివేశాల్ని తొలగించి సినిమాకి వేగం పెరిగేలా చేసింది. అమెరికా మార్కెట్‌లో ఈ సినిమా ఇప్పటికే 2 మిలియన్ డాలర్ల మార్క్‌ని అధిగమించింది. ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రదర్శనల తోనే విడుదలైన చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్‌గారు' సినిమాకీ అదిరిపోయే ప్రారంభం దక్కింది. అమెరికాలో ప్రీమియర్ షోల తోనే ఈ సినిమా మిలియన్ డాలర్ మార్క్‌కి చేరవైపోయింది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి నటించిన సినిమా కావడం, విజయాలకి కేరాఫ్‌గా నిలుస్తున్న అనిల్ రావిపూడి దర్శకత్వం వహించడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటైన ప్రారంభ వసూళ్లతోనే ఈ సినిమా ప్రదర్శితమవుతోంది. ఈసారి విడుదలవుతున్న ప్రతి సినిమా కూడా వినోదానికి గ్యారెంటీ అన్నట్టుగా ఊరించాయి. అన్ని సినిమాలూ కుటుంబ వినోదంతో రూపొందిన సినిమాలు కావడమే అందుకు కారణం. 13న రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 14న నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు', అదే రోజున శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటి ప్రచార చిత్రాలు వినోదంతో ఊరిస్తున్నాయి. మిగతా సినిమాలతో పోలిస్తే, ఈ మూడు సినిమాలు పరిమిత వ్యయంతో రూపొందినవే. అయితే పండుగ సందర్భంగా ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో వచ్చిన చిన్న సినిమాలూ గతంలో ఘన విజయాల్ని అందుకున్నాయి. అందుకే చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి పండగ సినిమాపైనా ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి.









# తొలిరోజే మన శకర వరప్రసాద్ గారు.. జోరు



పండగకు వస్తున్నారు.. అంటూ టాలీవుడ్‌లో పండగ తీసుకొచ్చారు మన శంకరవరప్రసాద్ గారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌టాక్‌తో అలరిస్తోంది. చాలా రోజుల తర్వాత వింటేజ్ చిరును చూశామంటూ అభిమానులు సంబర పడుతున్నారు. దీంతో ప్రీమియర్స్ పూర్తికాగానే మూవీ టీమ్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. చిరంజీవితో పాటు అనిల్ రావిపూడి, సాహు గారపాటి, సుస్మిత కొణిదెల కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ పెద్ద పండగకు భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విజయం సాధించింది. దీంతో టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. తాజాగా చిరు ఈ సినిమాతో మరో ఘనత సాధించారు. ప్రీమియర్స్‌లోనే వన్ మిలియన్ డాలర్లరు వసూలు చేసిన చిరు రెండో చిత్రంగా ఇది నిలిచింది. మరోవైపు ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మై షోలో 24 గంటల్లో 2లక్షల 86వేల టికెట్స్ అమ్ముడైనట్లు పేర్కొంది.




# సుప్రీంను ఆశ్రయించిన జననాయగన్

'జన నాయగన్'కు మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'జన నాయగన్' టీమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ నేడు పిటిషన్ వేసింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడీ స్టే పై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# శోభితా ధూళిపాళ్ల.. చీకటిలో!

శోభితా ధూళిపాళ్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'చీకటిలో'. అమెజాన్ ప్రైమ్ వేదికగా జనవరి 23 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. న్యూస్ ఛానల్‌లో యాంకర్ జాబ్ మానేసి సొంతంగా ఛానల్ పెట్టి స్నేహితుల హత్యల వెనక ఉన్న కారణాన్ని కనిపెట్టే సంధ్య పాత్రలో శోభిత కనిపించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో ట్యాగ్ చేసినందుకే హత్య చేశాడా.. అంటూ ఆసక్తికరమైన ప్రశ్నతో ముగించిన ఈ ట్రైలర్‌ను మీరూ చూసేయండి.



# 'పరాశక్తి'పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం



'పరాశక్తి'పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారని విజయ్ అభిమానులపై నటుడు, నిర్మాత దేవ్ రామ్‌నాథ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు బుక్ మై షోలో నెగెటివ్ రివ్యూలు ఇస్తున్నారని సినిమాను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదన్నారు. నెగెటివ్ రివ్యూలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ల ను ఎక్స్‌లో షేర్ చేసిన ఆయన కొందరు విజయ్ ఫ్యాన్స్‌ను ఉద్దేశిస్తూ పోస్ట్ పెట్టారు. థియేటర్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా 'పరాశక్తి'కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. మీ సినిమా (జననాయగన్)కు పోటీగా మేం విడుదల చేసినందుకే ఇలా చేస్తున్నారా?. ఈ కారణంగా మా సినిమాను దెబ్బతీసే హక్కు మీకు లేదు. మేం ముందుగా విడుదల తేదీని ప్రకటించాం. మేం మీ సినిమాను అడ్డుకోవడానికి ప్రయత్నించ లేదు కదా.. మరెందుకు ఇలా చేస్తున్నారు. 'జననాయగన్'కు వచ్చినట్లే మాకు కూడా సెన్సార్ సమస్యలు వచ్చాయి. విడుదలకు 18 గంటల ముందు వరకు మేం కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం. సీబీఎఫ్‌సీ కార్యాలయానికి ఎన్నోసార్లు వెళ్లాం. నెగెటివ్ రివ్యూలు, పాత వీడియోలు ఉపయోగించి ప్రజలను ప్రభావితం చేయాలని చూడడం, థియేటర్‌లో రాజకీయ నినాదాలు చేయడం. బుక్ మై షోలో రేటింగ్ తగ్గించడం.. ఇలాంటి పనులు చేసే వారికి పోటీ అని చెప్పే హక్కు లేదు. గతేడాది విడుదలైన ఓ పెద్ద సినిమాకు కూడా ఇలానే చేశారు. ఇది ఇండస్ట్రీకి మంచిది కాదు. పరాశక్తి చాలా గొప్ప సినిమా' అని తన ఎక్స్ పోస్ట్‌లో దేవ్ రామ్‌నాథ్ రాసుకొచ్చారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861